




ESTD: 1999

www.voodayam.com

# వుదయం






ఆదిలాబాద్ | 03-09-2026 గురువారం | సంపుటి : 13 | సంచిక :303 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal | Follow us on

## గ్లోబల్ సమ్మిట్ - రక్ష ఎక్స్‌పోలో

# భాగస్వాములు కండి



**దేవరకద్ర డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూ కేటాయింపు**

**ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు ఆహ్వానం**

**రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు మరో 750 ఎకరాలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (ఎఎంస్) :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో2026ను ప్రారంభించాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు. రక్షణ ఎక్స్‌పో లో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్టాత్మక ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. దేశవ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు రక్షణ శాఖ మంత్రి హాజరై మార్గనిర్దేశం చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. రక్షణ ఎక్స్ పో2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు రక్షణ శాఖ సహకరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వాములు కావాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్ పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందుకు కేంద్ర రక్షణ శాఖ సహకరించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూ సేకరణ చేపట్టిందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలియజేశారు. రక్షణ శాఖ కోరినట్లు మొత్తం 1500 ఎకరాలు కోరినందున, మరో 750 ఎకరాలు సేకరించే ఇచ్చేందుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల (డీఆర్‌డీఎల్) ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందని రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాల కాలానికి భూమిని కేటాయించనున్నట్లు తెలిపారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని తెలిపారు.

సమావేశంలో రాష్ట్ర శక్తి శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం.అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.

## కేసీఆర్ రాజీనామాలతోనే ఢిల్లీ దిగొచ్చింది



**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (వుదయం) :**

ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజీనామాలు కొత్తేమీ కాదని, ఆయన చేసిన రాజీనామాల ఫలితంగానే ఢిల్లీ పీఠం దిగివచ్చి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు (కేటీఆర్) స్పష్టం చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీశ్ రావుతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనపై 'ఛార్జ్ షీట్'ను విడుదల చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పదే పదే అసందర్భంగా కేసీఆర్ రాజీనామా చేయాలంటూ చేస్తున్న వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. నాడు కేసీఆర్ రాజీనామా చేస్తే ఢిల్లీ గడగడా వణికిపోయిందని, ప్రజా ఉద్యమం ఉధృతమై వీపు పగులుతుందనే భయంతో తప్పనిసరి పరిస్థితుల్లో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించక తప్పలేదని గుర్తుచేశారు. కేసీఆర్ దెబ్బకు సోనియా గాంధీనే తట్టుకోలేకపోయారని, ఇక రేవంత్ రెడ్డి ఒక లెక్కనా అంటూ సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కేసీఆర్ రాజీనామాలు, పోరాటాల వల్లే సాధ్యమైందని స్పష్టం చేసిన కేటీఆర్, సీఎం రేవంత్ రెడ్డి ఇకనైనా పనికిమాలిన మాటలు పక్కనపెట్టి ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడంపై దృష్టి సారించాలని హితవు పలికారు.

## ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు



**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (వుదయం) :**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల ప్రజా పాలనలో సామాన్యుల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు సాగామని, ప్రజా అవసరాలకు అనుగుణంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'వరి వేస్తే ఉరే' అని రైతులను భయభ్రాంతులకు గురిచేస్తే, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వరి పంటకు మద్దతు ధరతో పాటు బోనస్ అందిస్తూ ప్రోత్సహిస్తోందని, ఫలితంగా నేడు దేశంలోనే వరి సాగులో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. గతంలో ప్రశ్నపత్రాల లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారని, తమ ప్రభుత్వం టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపడుతోందని, ఇటీవలే 10 వేల ఉద్యోగాలకు కొత్త నోటిఫికేషన్లు జారీ చేశామని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన భారీ అప్పులు, బకాయిలను చెల్లిస్తూనే ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పొంగులేటి చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు తమ పదవులు పోయాయన్న నిరాశతో ప్రజలను రెచ్చగొట్టే యత్నం చేస్తున్నారని, వరస ఓటములు ఎదురైనా ఆ పార్టీ నేతలకు జ్ఞానోదయం కావడం లేదని ఎద్దేవా చేశారు. గతంలో బతుకమ్మ చీరల పంపిణీలో కూడా అవినీతికి పాల్పడ్డ చరిత్ర బీఆర్ఎస్‌దని, ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేటీఆర్ సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని, పరిమితులు దాటి ప్రవర్తిస్తే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు కొత్త రేషన్ కార్డులు కూడా ఇవ్వలేకపోయారని, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల లోపే 15 లక్షల కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందని, త్వరలోనే మరో 3 లక్షల మంది వృద్ధులు, వితంతువులకు కొత్తగా పింఛన్లు అందించబోతున్నామని మంత్రి ప్రకటించారు.

# ఉద్యోగులు ఆందోళన చెందవద్దు

## సింగరేణి గనుల ప్రైవేటీకరణ వార్తలు అవాస్తవం

**సింగరేణి భవన్ , సెప్టెంబర్ 2 (ఎఎంస్) :**

సింగరేణి భూగర్భ బొగ్గు గనులను ప్రైవేటుపరం చేస్తున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. సింగరేణి భూగర్భ గనులను ప్రైవేటీకరించేందుకు ప్రస్తుతం సంస్థ వద్ద ఎటువంటి ప్రతిపాదన పరిశీలనలో లేదని పేర్కొంది.

బాధ్యతాయుతమైన ప్రభుత్వ రంగ సంస్థగా, మైనింగ్ రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన సింగరేణి ప్రస్తుతం 21 భూగర్భ గనులు, 17 ఓపెన్‌కాస్ట్ గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. తెలంగాణతో పాటు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు బొగ్గును సరఫరా చేస్తూ దేశ ఇంధన భద్రతకు, పారిశ్రామిక అభివృద్ధికి నిరంతరం తోడ్పడుతున్నట్లు వెల్లడించింది.

**నష్టాల్లో ఉన్నా భూగర్భ గనుల కొనసాగింపు**

సింగరేణిలోని భూగర్భ గనులు ఆర్థికంగా నష్టాల్లో ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రాంతంలో ఉపాధి కల్పన, ఉద్యోగ భద్రతను దృష్టిలో ఉంచుకుని నష్టాలను సాధ్యమైనంత మేర తగ్గిస్తూ వాటిని కొనసాగిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది.

భూగర్భ గనులను మూసివేయడం లేదా ప్రైవేటుపరం చేయడం కాకుండా వాటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, నిర్వహణ వ్యయాలను తగ్గించడం ద్వారా సాధ్యమైనన్ని గనులను లాభదాయకంగా మార్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది.

**శాంతిఖని గనిపై ఈఓఐ కేవలం పైలట్ అధ్యయనం కోసమే**

భారీ నష్టాల్లో కొనసాగుతున్న శాంతిఖని భూగర్భ గనిలో ఉత్పత్తి కార్యకలాపాలను ఎండీఓ (మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్) విధానంలో నిర్వహించడం ద్వారా ఉత్పత్తి వ్యయాలను తగ్గించగలమా, నష్టాలను నివారించగలమా అనే అంశాన్ని అధ్యయనం చేసేందుకు మాత్రమే పైలట్ ప్రాజెక్టుగా ఒక ప్రతిపాదనను రూపొందించినట్లు యాజమాన్యం వివరించింది.



ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరి 2వ తేదీన ఈఓఐ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్) ప్రకటన జారీ చేసి, ఆసక్తిగల సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించడం జరిగింది. తొలుత జనవరి 15వ తేదీ వరకు గడువు ఇవ్వగా ఏ సంస్థ కూడా ఆసక్తి వ్యక్తం చేయలేదు. అనంతరం గడువును జనవరి 22వ తేదీ వరకు పొడిగించగా ఒక సంస్థ మాత్రమే ముందుకొచ్చింది. అయితే తదుపరి దశలో ఆ సంస్థ కూడా ఈ ప్రక్రియలో కొనసాగేందుకు సంసిద్ధత వ్యక్తం చేయలేదు. ఈ ప్రతిపాదనకు తగిన స్పందన లభించకపోవడంతో దానిని విరమించుకున్నట్లు సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. శాంతిఖని గనికి సంబంధించి జారీ చేసిన ఈఓఐని ఆధారంగా చేసుకుని సింగరేణి భూగర్భ గనులను ప్రైవేటుపరం చేస్తోందని ప్రచారం చేయడం వాస్తవ విరుద్ధమని యాజమాన్యం పేర్కొంది. శాంతిఖని గనికి సంబంధించిన ఈఓఐ ప్రక్రియను కూడా ఇప్పటికే విరమించుకున్నామని తెలిపింది.

భూగర్భ గనులను మరింత సమర్థ వంతంగా నిర్వహించడం, నష్టాలను తగ్గించడం, సాధ్యమైనన్ని గనులను లాభదాయకంగా మార్చడం ద్వారా తెలంగాణ ప్రాంతంలో ఉపాధి అవకాశాలను పరిరక్షించడంతో పాటు భవిష్యత్తులో మరింత ఉపాధి కల్పించడమే సింగరేణి యాజమాన్యం ప్రధాన లక్ష్యమని పేర్కొంది.

వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఇటువంటి వార్తలను ప్రచురించడం వల్ల ఉద్యోగులు, వారి కుటుంబాలు, ప్రజల్లో అనవసర ఆందోళన ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది.

## 'ఆపరేషన్ సింధూర్' హీరోకి ఆలయ నిర్వహణ బాధ్యతలు

**లక్నో, సెప్టెంబర్ 2 (ఎఎంస్) :**

ఉత్తరప్రదేశ్‌లోని ప్రసిద్ధ అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తొలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా భారత వైమానిక దళ విశ్రాంత ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా ఎంపికయ్యారు. 'ఆపరేషన్ సింధూర్' సమయంలో వెస్ట్రన్ ఎయిర్ కమాండ్ అధిపతిగా కీలక సేవలు అందించిన ఆయన, ఇప్పుడు ఆలయ నిర్వహణతో పాటు ఆర్థిక బాధ్యతలను స్వీకరించనున్నారు. నూతనంగా రూపుదిద్దిన ఈ సీఈవో పదవి కోసం దేశవ్యాప్తంగా ఐదు వేలకు పైగా దరఖాస్తులు రాగా, ట్రస్ట్ కమిటీ తీవ్ర పరిశీలన అనంతరం అత్యున్నత అనుభవం కలిగిన జితేంద్ర మిశ్రా వైపే మొగ్గు చూపినట్లు సమాచారం. 1986లో ఐఏఎఫ్‌లో ఫైటర్ పైలట్‌గా చేరిన జితేంద్ర మిశ్రా, నేషనల్ డిఫెన్స్ అకాడమీతో పాటు అమెరికా, యూకేలోని ప్రముఖ డిఫెన్స్ కళాశాలల్లో ఉన్నత విద్యనభ్యసించారు. ఐఏఎఫ్‌లో అత్యంత ప్రాధాన్యమున్న వెస్ట్రన్ కమాండ్‌కు నాయకత్వం వహించిన ఆయన, దాదాపు 38 సంవత్సరాలకు పైగా దేశానికి సేవలందించి ఈ ఏడాది ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు.

**స్టాక్ మార్కెట్ ఆప్‌డేట్**

**700 పాయింట్లకు పైగా కుప్పకూలిన సెన్సెక్స్**

**ఆయిల్ మంటలకు తోడైన యుద్ధ భయాలు..**

**నష్టాల్లో దలాల్ స్ట్రీట్**

## ఇంతే కదా...!




# నాకు షోకేజ్ నోటీసు ఇవ్వడమే తప్పు..

**కుమార్తె వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయొద్దు**

**నా బిడ్డ వ్యాఖ్యలతో నాకు సంబంధం లేదు**



**హైకమాండ్‌కు వివరణ ఇచ్చిన కొండా సురేఖ**

**పార్టీ నిర్ణయం బట్టే నా భవిష్యత్ కార్యాచరణ**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (ఎఎంస్) :**

తన కుమార్తె సుస్మిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని, ఈ విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ అధిష్ఠానానికి స్పష్టం చేసినట్లు తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు. బుధవారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు పార్టీ అగ్రనేతలకు తన వివరణ ఇచ్చిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. సుస్మిత వివాహమై వేరే ఇంటికి కోడలిగా వెళ్లిందని, ఆమె వ్యాఖ్యలు స్వతంత్రమైనవని సురేఖ స్పష్టం చేశారు. "నా బిడ్డ జీవితం ఆమె ఇష్టం.. నాతో పాటు నా భర్త రాజకీయ ప్రయాణం మా ఇష్టం" అని వ్యాఖ్యానించారు. మంత్రిగా ఎలాంటి అవినీతి మరకలు లేకుండా ఉత్తమ పనితీరు కనబరుస్తున్నానని, పదవిలో కొనసాగించాలని అధిష్ఠానాన్ని కోరినట్లు తెలిపారు. తనపై ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా, ఏఐసీసీ సభ్యురాలినైన తనకు షోకేజ్ నోటీసు ఇవ్వడమే తప్పని ఆమె అభిప్రాయపడ్డారు. పార్టీలో కొందరు వ్యక్తులే కావాలని తనపై ఆరోపణలు చేయించారని, వారి పేర్లు బయటకు చెప్పి కొత్త వివాదాలకు తావివ్వనని ఆమె పేర్కొన్నారు. తన వివరణను రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్‌లకు రాతపూర్వకంగా అందజేసినట్లు తెలిపారు. తనపై చర్యలు తీసుకునే ముందు అంతర్గతంగా కుట్రలు పన్నిన వారిపై కూడా షోకేజ్ నోటీసులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## అమెరికాలో వలసదారులకు కొత్త తిప్పలు



**వాషింగ్టన్:** అమెరికాలో జన్మతః లభించే పౌరసత్వాన్ని (బర్త్‌రైట్ సిటిజన్‌షిప్) కట్టడి చేయడమే లక్ష్యంగా డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మరిన్ని కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. ఇందులో భాగంగా విదేశీ వలసదారుల పిల్లలకు పాస్‌పోర్ట్ జారీ చేసే ప్రక్రియలో పారదర్శకత నెపంతో నిబంధనలను మరింత సవరించేందుకు అమెరికా విదేశాంగ శాఖ కసరత్తు చేస్తోంది. ఇకపై తమ పిల్లల పాస్‌పోర్ట్‌ల కోసం దరఖాస్తు చేసుకునే తల్లిదండ్రులు దరఖాస్తు ఫారంలో కేవలం వివరాలు రాస్తే సరిపోదని, తమ పౌరసత్వం మరియు ఇమిగ్రేషన్ స్టేటస్‌కు సంబంధించిన అధికారిక ఆధారాలను కచ్చితంగా సమర్పించాల్సి ఉంటుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. విదేశీయులు అమెరికా వచ్చి పిల్లలకు జన్మనివ్వడం ద్వారా పౌరసత్వం పొందే 'బర్త్ టూరిజం'ను అరికట్టేందుకు అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులకు (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్) అనుగుణంగానే ఈ తాజా ప్రతిపాదనలు రూపుదిద్దుకుంటున్నాయి. అమెరికన్ పౌరసత్వం యొక్క విశిష్టతను, విలువను కాపాడటమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని, దానికి తగినట్లే పాస్‌పోర్ట్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కూడా కఠినంగా ఉంటుందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న పాస్‌పోర్ట్ నిబంధనల ప్రకారం అమెరికాలో జన్మించిన పిల్లల కోసం దరఖాస్తు చేసేటప్పుడు, తల్లిదండ్రులు తమతో పిల్లలకు ఉన్న సంబంధాన్ని నిరూపించే పత్రాలతో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డును అందిస్తే సరిపోతుంది. పౌరసత్వ వివరాలను కేవలం దరఖాస్తులో పేర్కొంటే సరిపోయేది తప్ప, ఇమిగ్రేషన్ స్టేటస్‌కు సంబంధించిన ఆధారాలు చూపాల్సిన అవసరం ఉండేది కాదు.

## గోదావరి నదిలో మునిగి నిజామాబాద్ యువకుడు బలి

**బాసర, సెప్టెంబర్ 2 (వుదయం) :**

శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చి ప్రమాదవశాత్తు గోదావరి నదిలో పడి ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయిన విషాదకర సంఘటన నిర్మల్ జిల్లా పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం కౌల్పూర్ గ్రామానికి చెందిన రమావత్ సాయికిరణ్ (25) బ్రిటన్ (యూకే)లో ఎంబీఏ చదువుతున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన అతడు, ఈ నెల 5న తిరిగి యూకే పయనమవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం బాసర ఆలయ దర్శనార్థం వెళ్లాడు. అమ్మవారి దర్శనం పూర్తయిన తర్వాత గోదావరి వంతెనపై నిలబడి ఫోటోలు దిగుతుండగా, అనుకోకుండా అడుగు జారి నదిలో పడిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, స్థానికులు



గాలింపు చర్యలు చేపట్టగా, బుధవారం నాటికి సాయికిరణ్ మృతదేహం లభ్యమైంది. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాల్సిన యువకుడు కళ్లముందే అనంత లోకాలకు వెళ్లడంతో కౌల్పూర్ గ్రామంలో తీవ్ర శోకఛాయలు అలముకున్నాయి. మృతుడి తండ్రి రమావత్ భోజారామ్ ఫిర్యాదు మేరకు బాసర పోలీసులు కేసు నమోదు చేసి, ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారు.

## ఢిల్లీలో బిజీ బిజీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (ఎఎంస్) :**

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం కీలక భేటీ నిర్వహించారు. ఢిల్లీ వేదికగా జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రానికి చెందిన పలు ముఖ్యమైన రాజకీయ, పాలనాపరమైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, పార్టీ అంతర్గత వ్యవహారాలతో పాటు ఇటీవల వెలుగులోకి వచ్చిన మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యల అంశంపై హైకమాండ్‌కు సీఎం, డిప్యూటీ సీఎం వివరణ ఇచ్చినట్లు సమాచారం.



# నాంపల్లి హనుమాన్ దేవాలయ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం

**నాంపల్లి (వుదయం):**

ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు శాయశక్తులా తమ వంతు కృషి చేస్తామని నాంపల్లి గుట్ట్, షెడ్ లోని శ్రీ హనుమాన్ దేవాలయ ట్రస్టు బోర్డు పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆలయానికి నూతనంగా నియమించిన పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గా చల్లపల్లి శ్రీ రామచంద్రమూర్తి, సభ్యులుగా ప్రవీణ్ పిల్లై, పిల్లి గురుమూర్తి, కాటెపాగ అనిల్ బాబు, కందికంటి సంధ్యారాణి లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా సమాజంలో భక్తిభావం పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. తమను పాలకవర్గ సభ్యులుగా అవకాశం కల్పించడం పట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఫిరోజ్ ఖాన్, డిప్యూటీ కమిషనర్ వినోద్, సహాయ కమిషనర్ కృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్ స్పెక్టర్ సురేఖ నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

# గ్రామాల రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- **లైసెన్స్ సర్వేయర్ల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ బిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల, సెప్టెంబర్ 02 (వుదయం బ్యూరో)**



జిల్లాలోని గ్రామాల భూముల రీసర్వే ప్రక్రియను కచ్చితత్వంతో, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. రీసర్వేలో ఎలాంటి పొరపాట్లు, భూ వివాదాలకు తావులేకుండా క్షేత్రస్థాయి పరిశీలనతో పనులు చేపట్టాలని సూచించారు. బుధవారం గద్వాల పట్టణ శివారులోని సంగాల పరమపదంగాల్లో పరిధిలో కొనసాగుతున్న రీసర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా గ్రామ సరిహద్దులను పాత రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి కచ్చితంగా గుర్తించి డిమార్కేషన్ చేయాలని ఆదేశించారు. అనంతరం సర్వే నంబర్ల వారీగా భూములను గుర్తించి పార్సిళ్లుగా రూపొందించాలన్నారు. ప్రభుత్వ భూములు, రహదారులు, గ్రామకంఠం, అసైన్డ్ భూములు, చెరువులు, కుంటలు, గుట్టలతదితరాలను ప్రత్యేకంగా గుర్తించి రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. రెవెన్యూ రికార్డులను క్షేత్రస్థాయి భౌతిక పరిస్థితులతో సరిపోల్చి వివరాలను నమోదు చేయాలని తెలిపారు.రీసర్వేలో రోవర్, జీపీఎస్ తదితర సాంకేతిక పరికరాలను సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి పాయింట్ కు సంబంధించిన భౌగోళిక వివరాలు కచ్చితంగా నమోదయ్యేలా చూడాలని, సిగ్నల్ స్థిరంగా వచ్చిన తర్వాతే తుది పాయింట్ ను నిర్ధారించాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ భూముల సర్వే చేపట్టే టప్పుడు సంబంధిత రైతులకు తెలియజేసి ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. రైతుల సహకారంతో సర్వేను వేగంగా, పారదర్శకంగా, వివాదాలకు తావులేకుండా పూర్తి చేయవచ్చన్నారు. రికార్డుల్లో నమోదైన వ్యక్తి, క్షేత్రస్థాయిలో భూమిని అనుభవిస్తున్న వ్యక్తి వేర్వేరుగా ఉన్న సందర్భాల్లో నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి, ఆధారాలు, అభ్యంతరాలు సమర్పించేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే జీపీఎస్, సర్వే తదితర అంశాల్లో శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్లు అందుబాటులో ఉన్నందున వారి సేవలను రీసర్వే పనుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. కేటాయించిన సిబ్బంది పూర్తిస్థాయిలో విధుల్లో పాల్గొనేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బంది పై మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ పర్యటనలో జిల్లా సర్వే ఏడీ నూకరాజు, డిప్యూటీ ఇన్ స్పెక్టర్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

- **డీఎంహెచ్ఓ డాక్టర్ కే. కృష్ణ**

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 01 (వుదయం బ్యూరో):**




నేత్రదానం ఆవశ్యకతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. కృష్ణ అన్నారు. మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 41వ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నేత్రదాన ఆవశ్యకతపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఒకరు మరణించిన తర్వాత నేత్రదానం చేయడం వల్ల ఇద్దరికి చూపు వస్తుందని, కాబట్టి వ్యక్తి మరణించిన తర్వాత కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నేత్రదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని లేదా ఆరోగ్య సిబ్బందిని కలిసి అంగీకారం తెలపాలని, వ్యక్తి మరణించిన 6 గంటలలోపే నేత్రదానం చేయాలని తెలిపారు. 202526 సంవత్సరంలో ఆర్బీఎస్కే సంచార వైద్య బృందం, నేత్రాధికారులు జిల్లాలోని 276 ప్రభుత్వ పాఠశాలల్లో 35,586 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 1,736 మందికి దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించారని, వీరిలో 1,256 మంది బాలబాలికలకు ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా పాఠశాలలో 20 మంది విద్యార్థులకు కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఆనంద ప్రసాద్, ఉప జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాల్ చారి, డీపీఓ రేణయ్య, నేత్రాధికారులు కోట బాలాజీ, దత్తాత్రి రావు, ఉపాధ్యాయులు సలీం, ఎల్. వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యల్లందొడ్డిలో 'డిజిటల్' అడుగు!



- **అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డుల పంపిణీ.. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు**

**గట్టు సెప్టెంబర్ 02 (వుదయం బ్యూరో)**

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల నియోజకవర్గం గట్టు మండలం యల్లందొడ్డి గ్రామంలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరువ చేయడంలో భాగంగా డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టారు. కార్డుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకులతో పాటు ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ ప్రయోజనాలు సులభంగా అందే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత, ఉపసర్పంచ్ మారెమ్, గ్రామ కార్యదర్శి దస్తగిరి, రేషన్ డీలర్ ప్రభు, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు రాఘవేంద్ర గౌడ్, మోహన్తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. డిజిటల్ రేషన్ కార్డులు అందుకోవడంతో అర్హులైన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

# క్రీడా పోటీలను ప్రారంభించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య





**మిరుదొడ్డి, సెప్టెంబరు 2, వుదయం:**

క్రీడలతో విద్యార్థుల్లో మానసిక, శారీరక దృఢత్వం పెంపొందుతుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం మిరుదొడ్డి మండలం అల్వాల కూడలిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకళాశాల మైదానంలో మాధవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో మండల స్థాయి ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్14, అండర్17 బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రవీణ్‌బాబు, ఏఎంసీ చైర్మన్ సంయుక్త, నైపుణ్య ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తోట కమలాకర్ రెడ్డి, దిలీప్‌రెడ్డి, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# 1000 కాంగ్రెస్ పాలనలో అంతా మోసం



- **ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్**

**ఆందోల్ జోగిపేట్ వుదయం**

బుధవారం కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచి వెయ్యి రోజులు గడుస్తున్న ఉచిత బస్సు ఏ ఒక్క ఆమె నెరవేర్చలేదని ఆందోల్ మాజీఎమ్మెల్యే శాంతి కిరణ్ అన్నారు టిఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు 420 హామీలతో కూడిన 420 ఫీట్ల తో పిక్స్ భారీ ర్యాలీ నిర్వహించారు మహిళలకు 2500 రూపాయలు రైతు భరోసా ఎకరాకు ఒక్క లక్ష బాకీ ఉందని నిరుద్యోగ ఒక్క లక్ష ముప్పై రెండు వేలు బాకీ ఉందని వారికి 500 ఇస్తానని 75000 బాki విద్యా భరోసా విద్యార్థులకు 5 లక్షల రూపాయలు బాకీ ఉందని రైతు కూలీలకు రెండు సంవత్సరాలపాటు 12000 చొప్పున బాకీ ఆటో కార్మికులకు 24వేల బాకీ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత ప్రభుత్వమని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీ హామీలను నెరవేర్చాలని అదేవిధంగా మహిళలకు 33 నెలల పాటు 82,500 కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ తులం బంగారం విద్యార్థులకు స్కూటీలు బాకీ వంటి ఎన్నో హామీలు తుంగల తొక్కి వెయ్యి రోజుల పరిపాలనలు కాంగ్రెస్ ప్రభుత్వం శూన్యం అంటూ ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు జైపాల్ రెడ్డి నాయకులు లింగాగౌడ్ పైతర సాయికుమార్ ఆయా మండల బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పల్లె గడ్డ నరసింహులు బత్తుల వీరప్ప కృష్ణ గౌడ్ ఆయా మండల గ్రామ సర్పంచ్లు ఆందోల్ జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్లు మాజీ మండలా అధ్యక్షులు బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన హామీలు

# నెరవేర్చని రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి



**కొండపాక, సెప్టెంబర్ 2:**

ఎన్నికల అప్పుడు 420 హామీలు, ఆరు గ్యారెంటీ లు ఇచ్చి అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను నిలువెళ్ల మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని బిఆర్ఎస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు ర్యాగళ్ల దుర్గయ్య, అనంతుల ప్రశాంత్ లు డిమాండ్ చేశారు.

**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 1000 పూర్తయిన ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ పై ఈరోజు మొదలుకొని ప్రజలకు మద్దతుగా వారం రోజులపాటు నిరసనలు చేయాలని పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు ఈరోజు కొండపాక మండలం బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వెలికట్ట చౌరస్తాలో పెద్ద ఎత్తున మానవహారం తో నిరసన చేసి ప్రయాణికులకు మరియు ప్రజలకు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి అమలు చేయకుండా మోసం చేస్తున్న బాకీ కార్డులను ప్రజలందరికీ పంచడం జరిగింది.

**ఈ సందర్భంగా నూనె కుమార్, ర్యాగల దుర్గయ్య, అనంతుల ప్రశాంత్ గార్లు మాట్లాడుతూ**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నుండి కెసిఆర్ గారిని తిట్టడం తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు.దొంగ హామీలతో అధికారంలోకి వచ్చి తెలంగాణ సబ్బండ వర్ణాల ప్రజలను నిలువెళ్ల మోసం చేశారని అన్నారు. దొంగే దొంగ దొంగ అన్నట్టుగా తెలంగాణ జాతిపిత అయిన కేసీఆర్ గారిని విమర్శించడం చూస్తుంటే తెలంగాణ సమాజం సిగ్గుపడుతుందని అన్నారు.కల్లబొల్లి మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుల భరతం పడతామని వారు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే అడుగడుగునా అడ్డుకుంటామని కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న మోసాలను ఎండగట్టి ప్రజలకు మద్దతుగా కెసిఆర్ గారు మరియు హరీష్ రావు గారి నాయకత్వంలో ఎంతటి ప్రజా పోరాటాల కైనా సిద్ధమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు కాసపురం సంజీవరెడ్డి, సర్పంచులు మిద్దె శివకుమార్, గాలి బాలయ్య, తేలు అశోక్, ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు భరత్ పటేల్, నాయకులు పెద్దనుకుల శ్రీనివాస్, జిర్ర రాజు, గోనె శ్రీనివాస్, అంబటి భానుచందర్, రాజగిరి శ్రీనివాస్, గొట్టే ఐలయ్య, తాటిపాముల నర్సాగౌడ్, రాముల యాదగిరి, గోవర్ధన్ రెడ్డి, మైపాల్ రెడ్డి, ఏమల్ల రాజిరెడ్డి, బొద్దుల తిరుపతి, కోడెల మల్లేశం, గిరాయపల్లి నరసింహారెడ్డి, మేకల మల్లేశం, అందే యాదగిరి, సున్నం భాస్కర్, నల్లమాస వెంకటేశం, మెర్గోజు గాలయ్య, అమ్ముల రమేష్ బాబు, మెర్గోజు మల్లికార్జున్, నరిగొప్పల లింగం, రాశుల రంజిత్, కోడెల కిరణ్ కుమార్, ఎలుక రాజిరెడ్డి, నీల వెంకటేశం, మల్లమారి రవీందర్, ఆత్కూరి సుధాకర్, అమ్ముల పరశురాములు, దొమ్మాట చంద్రశేఖర్, పల్లె యాదగిరి, పెరుగు స్వామి, వైకుంఠం, సీత యాదగిరి, విశ్వనాథపల్లి మల్లేశం, చెంది మల్లికార్జున్, పాండు గౌడు, స్వామి, బాల్ నరసయ్య, తిరుపతి, రాముల భాను, ఆరే రాజు, నరసింహారెడ్డి, పెరుగు ఆంజనేయులు, గిరాయపల్లి యాదగిరి, దుర్గ ప్రసాద్, మైలారం శ్రీనివాస్, అమ్ముల నర్సింలు, పంజాల శ్రీనివాస్ గౌడ్, పల్లె బాబు, రొడ్డ ప్రవీణ్, గున్నాల నరేష్, గూడెపు శంకర్, ఆనందం, పసుల కుమార్, సుధాకర్, సీత కనకయ్య, కనకరాజు, భూపతి రెడ్డి, మజారుద్దీన్, నవీన్ చందు, కెమ్మసారం సంతోష్, వంశీ, రాంపల్లి బీరయ్య, బిక్షపతి, కరుణాకర్ రెడ్డి, పరమేశ్వర్, వంగ నరసింహులు, రవి తోపాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మన ఇల్లు.. మన వీధి

- **స్వచ్ఛ తాండూర్ అందరి బాధ్యత**
- **విద్యార్థులే పరిశుభ్రతకు వారధులు.. ప్రజల్లో అవగాహన కల్పించాలి: ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**తాండూర్ సెప్టెంబర్ 02, వుదయం ప్రతినిధి :**



స్వచ్ఛమైన తాండూర్ నిర్మాణం కేవలం మున్సిపల్ శాఖ బాధ్యత కాదని, పట్టణంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజా బాల్రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా (స్వచ్ఛ వారోత్సవాల్లో భాగంగా )ఏర్పాటు చేసిన వివిధ పోటీల కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. "మన ఇల్లు.. మన వీధి.. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా స్వచ్ఛ తాండూర్ సాధ్యమవుతుంది. పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలి" అని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పట్టణంలోని వ్యాపారవేత్తలు కూడా స్వచ్ఛ తాండూర్ కోసం తమ వంతు సహకారం అందించాలని కోరారు. పిల్లల్లో చిన్ననాటి నుంచే పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని, నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తాండూర్‌ను మరింత పరిశుభ్రమైన, సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారుకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్ రెడ్డి, కమిషనర్ రాకేష్ రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు



# తాండూరులో ఘనంగా డాక్టర్ విజయ్ కుమార్ గృహప్రవేశం

**తాండూరు సెప్టెంబర్ 02 వుదయం ప్రదినిధి**

తాండూరు పట్టణంలో డాక్టర్ విజయ్ కుమార్ నూతన గృహప్రవేశ వేడుక బుధవారం అత్యంత వైభవంగా, ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సంపత్ కుమార్ హాజరయ్యారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన డాక్టర్ విజయ్ కుమార్ దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు డాక్టర్ సంపత్ కుమార్ ఈ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, శుభాశీస్సులు అందించారు.ఈ వేడుకలో పలువురు ప్రముఖులు పాల్గొని డాక్టర్ విజయ్ కుమార్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. పాల్గొన్న వారిలో కోర్వర్ నాగేష్, వడే శీను, వెంకట్, వారాల శ్రీనివాస్ రెడ్డి, బోయపల్లి రమేష్ గౌడ్ తదితరులు ఉన్నారు. ఈ వేడుకతో డాక్టర్ విజయ్ కుమార్ నివాసం వద్ద పండుగ వాతావరణం నెలకొంది.

# ఏక్లాస్పురంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం



**అయిజ సెప్టెంబర్ 02 (వుదయం ప్రతినిధి)**

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విడుదల చేసిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం అయిజ మండలంలోని ఏక్లాస్పురం గ్రామంలో బుధవారం ప్రారంభమైంది. గ్రామ సెక్రటరీ మాబి, డిపివో బజారన్న, సర్పంచ్ కుర్వ నాగన్న ఆధ్వర్యంలో, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో కాంగ్రెస్ నాయకులు కే. నరసింహులు రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తామని తెలిపారు. నూతన రేషన్ కార్డుల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# తాండూర్ సమగ్ర అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం కృషి చేయాలి

- **ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**తాండూర్ సెప్టెంబర్ 2 వుదయం ప్రతినిధి :-**



తాండూర్ పట్టణ సమగ్ర అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం, ప్రజాప్రతినిధులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు బుధవారం తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ నీరజబాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధికి సంబంధించిన 18 అంశాలతో కూడిన ఎజెండాపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. కౌన్సిల్ సమావేశం అనంతరం ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.రూ.110 కోట్ల నిధులు: ముఖ్యమంత్రి శ రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో తాండూర్ పట్టణానికి శాశ్వతంగా తాగునీరు అందించేందుకు రూ.110 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు.కాగ్నా ప్రాజెక్టుపై విమర్శలు:తాండూర్ ప్రజల దాహార్తిని తీర్చే కాగ్నా తాగునీటి పథకాన్ని అడ్డుకునేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు కుట్రలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. గత 30 ఏళ్లుగా కాగ్నా నీరు కొడంగల్ ప్రాంతానికి వెళ్తున్నాయని, తాగునీటి పథకాన్ని మరింత పురోగతిలోకి తెచ్చేందుకు ప్రభుత్వం ద్వారా అదనపు నిధులు తెచ్చామని చెప్పారు. విద్య, వైద్య రంగాలు: ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను తాండూర్ లోనే నిర్మించి చూపిస్తామని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థ అభివృద్ధికి తమ ప్రభుత్వం ఏటీసీ (ATC) సెంటర్లను అందుబాటులోకి తెచ్చిందని, ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార (బ్రేక్ పాస్ట్) పథకాన్ని పునః ప్రారంభించామని గుర్తుచేశారు.ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి: కొంతమంది ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో కుమ్మక్కై ప్రభుత్వ ఆసుపత్రిపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. గత పదేళ్ల పాలనలో ఐసీయూ యూనిట్ ఏర్పాటు చేయకపోవడమే కాకుండా, కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలు కూడా సకాలంలో ఇవ్వలేదని విమర్శించారు. అభివృద్ధి పనులకే ప్రాధాన్యం: గతంలో కేవలం ఎన్నికల సమయంలో శిలాఫలకాలు వేయడానికే పరిమితమయ్యారని, కానీ తమ ప్రభుత్వం శిలాఫలకాల కంటే కంటికి కనిపించే అభివృద్ధి పనులకే ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు.కౌన్సిల్ సమావేశాలు అంటే కేవలం విమర్శలు, ప్రతివిమర్శలతో కాలయాపన చేసే వేదికలు కాకూడదని, ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గం చూపాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు ప్రజల భాగస్వామ్యంతో తాండూర్ ను ఒక ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు ,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా కొడకాంచి శివప్రసాద్ గౌడ్ జన్మదిన వేడుకలు


**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 2....**



మెదక్ జిల్లా, శివంపేట మండల కేంద్రానికి చెందిన యువ నాయకుడు, మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ ముఖ్య అనుచరుడు కొడకాంచి శివప్రసాద్ గౌడ్ జన్మదిన వేడుకలను, ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్, మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర నాయకులు చిట్యాల మహిపాల్ రెడ్డి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని మనసారా భగవంతున్ని కోరుకున్నారు. రాబోవు ఎన్నో సేవా కార్యక్రమాలను కొనసాగించి ఉన్నత స్థాయికి పేరు ప్రఖ్యాతలు పొందాలని ఆకాంక్షించారు.



# గ్రేటర్ హైదరాబాద్



# SIR మెగా హియరింగ్‌కు

## నోటీసులు అందుకున్న వారు తప్పనిసరిగా హాజరు కావాలి



**రంగారెడ్డి జిల్లా ,సెప్టెంబర్ 2 (వుదయం ప్రతినిధి)**

సెప్టెంబర్ 5, 6 తేదీలలో ప్రత్యేక మెగా హియరింగ్ - అవసరమైన ఆధార పత్రాలతో హాజరు కావాలి: జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి రంగారెడ్డి జిల్లాలో SIR (Special Intensive Revision) ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేసిన కేసులకు సంబంధించి సెప్టెంబర్ 5, 6 తేదీలలో SIR మెగా హియరింగ్ ప్రక్రియను నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు.

SIR ప్రక్రియలో భాగంగా సంబంధిత ఓటర్లకు ఇప్పటికే నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, నోటీసులు అందుకున్న ప్రతి వ్యక్తి తమ నోటీసులో పేర్కొన్న తేదీ, సమయం మరియు హియరింగ్ కేంద్రానికి తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. హియరింగ్‌కు హాజరై తమకు సంబంధించిన అభ్యంతరాలు, వివరణలు, వాదనలు మరియు అవసరమైన వివరాలను సంబంధిత అధికారుల ముందు సమర్పించుకోవాలని తెలిపారు.

తప్పనిసరిగా తీసుకురావాల్సిన పత్రాలు

హియరింగ్‌కు హాజరయ్యే వారు క్రింది పత్రాలను తమ వెంట తీసుకురావాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు:

**పరిశీలన కోసం వర్తించే పత్రాలు:**

ప్రభుత్వ/పీఎస్‌యూ ఉద్యోగి ID లేదా పెన్షన్ ఆర్డర్ - సాధారణ ఉద్యోగి/పెన్షనర్‌కు సంబంధించిన గుర్తింపు పత్రం.ప్రభుత్వం/బ్యాంక్/స్థానిక సంస్థలు జారీ చేసిన ధృవీకరణ పత్రాలు లేదా పత్రాలు.పూర్తి తేది ధృవీకరణ పత్రం (Birth Certificate) - సంబంధిత అధికార పరిధిలో జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం.పాస్‌పోర్ట్ - భారత ప్రభుత్వం జారీ చేసిన చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్.విద్యా అర్హత ధృవీకరణ పత్రాలు - గుర్తింపు పొందిన బోర్డు/విశ్వవిద్యాలయం/విద్యాసంస్థల నుంచి పొందిన సర్టిఫికెట్లు.శాశ్వత నివాస ధృవీకరణ పత్రం (Permanent Resident Certificate) - రాష్ట్ర అధికారులు జారీ చేసిన నివాస ధృవీకరణ పత్రం. అటవీ హక్కుల ధృవీకరణ పత్రం - అధికారికంగా జారీ చేసిన అటవీ హక్కుల పత్రం.కుల ధృవీకరణ పత్రం - సమర్థ అధికారి జారీ చేసిన OBC/SC/ST లేదా ఇతర కుల ధృవీకరణ పత్రం.ఎన్ఆర్ఐల కోసం ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (OCI) కార్డు.కుటుంబ రిజిస్టర్ - రాష్ట్ర/స్థానిక అధికారులు జారీ చేసిన కుటుంబ రిజిస్టర్.భూమి/ఇంటి కేటాయింపు పత్రం - ప్రభుత్వం జారీ చేసిన భూమి లేదా ఇంటి కేటాయింపు ధృవీకరణ పత్రం.ఆధార్ కార్డు - నిర్దిష్ట ఈసీఐ మార్గదర్శకాలు మరియు ఆదేశాల మేరకు మాత్రమే పరిశీలనకు తీసుకోవచ్చు నోటీసులో పేర్కొన్న వివరాలకు అనుగుణంగా అవసరమైన ఆధారాలను సమర్పించడం ద్వారా తమ వాదనను స్పష్టంగా తెలియజేసే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. నోటీసులు అందుకున్న వారు తమకు కేటాయించిన హియరింగ్ తేదీ, సమయం, కేంద్రాన్ని ముందుగానే పరిశీలించుకుని, ఎటువంటి ఆలస్యం లేకుండా నిర్ణీత సమయానికి హాజరు కావాలని జిల్లా ఎన్నికల అధికారి కోరారు. SIR ప్రక్రియలో ప్రతి అర్హత కలిగిన ఓటరుకు సంబంధించిన వివరాలు సమగ్రంగా పరిశీలించి, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా మరియు నిబంధనల ప్రకారం నిర్వహించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కావున, SIR హియరింగ్‌కు నోటీసులు అందుకున్న వారు ఎట్టి పరిస్థితుల్లోనూ గైర్హాజరు కాకుండా, నోటీసులో పేర్కొన్న తేదీ, సమయం మరియు హియరింగ్ కేంద్రానికి తప్పనిసరిగా హాజరై, తమ వద్ద ఉన్న సంబంధిత ఆధార పత్రాలతో తమ వివరణ/వాదనను సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నోటీసు అందుకున్న ప్రతి వ్యక్తి ఈ నెల 5 తేదీ మరియు 6వ తేదీల్లో నిర్వహించే మెగా హియరింగ్‌ను సద్వినియోగం చేసుకుని, SIR ప్రక్రియకు అవసరమైన సహకారం అందించాలని ఆయన కోరారు.

# రంగారెడ్డి జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ



**రంగారెడ్డి జిల్లా ,సెప్టెంబర్ 2 (వుదయం ప్రతినిధి)**

రంగారెడ్డి జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి బుధవారం కొందుర్గ్ మరియు చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, రోగుల హాజరు, సిబ్బంది విధుల నిర్వహణ, మందుల నిల్వలు, ల్యాబొరేటరీ సేవలు, ప్రసవ సేవలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆసుపత్రిలో పారిశుద్ధ్య ప్రమాణాలను పాటించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణ కుమారి సూచించారు.



వై ఎస్ ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

# రామచంద్రాపురం లో వైఎస్సార్‌కు ఘన నివాళులు

- **వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేద్దాం: పర్స శ్యామ్‌రావు**

**రామచంద్రపురం,సెప్టెంబర్ 2(వుదయం)**

వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా తెల్లాపూర్ డివిజన్263లో స్థానిక కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంగారెడ్డి డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్స శ్యామ్‌రావు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమానికి వైఎస్సార్ విశేష కృషి చేశారని అన్నారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భరత్, డీసీసీ జనరల్ సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అరుణ్‌గౌడ్, రవి, యాదగల్, కాంగ్రెస్ నాయకులు రాజు, మంగలి మహేష్, ప్రశాంత్, బలరాం, కొల్లూర్ శ్రీను, హరీష్‌గౌడ్, విక్రమ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం

- **420 హామీల అమలుకు డిమాండ్.. 420 అడుగుల భారీ బ్యానర్‌తో మానవహారం**
- **ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ముఠా గోపాల్ ఆధ్వర్యంలో భారీ నిరసన**

**కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నేతల ధ్వజం**

**ముషీరాబాద్, సెప్టెంబర్ 02(వుదయం)**



కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పాలనపై బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో భారీ మానవహారం నిర్వహించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు ప్రతీకగా 420 అడుగుల భారీ బ్యానర్‌ను ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు.

**ఎమ్మెల్యే ముఠా గోపాల్ కాంగ్రెస్ పార్టీ వైఫల్యానికి నిరసన**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారాన్ని పక్కనపెట్టి ప్రభుత్వం రాజకీయ ప్రచారానికే పరిమితమైందని విమర్శించారు.

ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ముఠా గోపాల్ స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

**కాంగ్రెస్ వైఫల్యాలపై జై సింహ ధ్వజం**

బీఆర్ఎస్ యువ నాయకులు జై సింహ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా.. ఈ కాలంలో ప్రజలకు ఏం చేశారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా గుర్తు చేస్తూ ప్రజలను ఆకట్టుకున్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుపై ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరుతో ప్రజలకు ఇచ్చిన మాటలు ఎక్కడ అమలయ్యాయో ప్రభుత్వం ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల పాలనలో నిరుద్యోగులు, యువత, రైతులు, మహిళలు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వం ఏం పరిష్కారం చూపిందో వెల్లడించాలని జై సింహ ప్రశ్నించారు. హామీల అమలుపై ప్రశ్నిస్తే రాజకీయ విమర్శలకు దిగడం కాకుండా.. ప్రజలకు ఇచ్చిన మాటలకు ప్రభుత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, హామీల అమలు కోసం ప్రభుత్వంపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని జై సింహ స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. రానున్న రోజుల్లో మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ముషీరాబాద్ నియోజకవర్గంలో అక్రమ నిర్మాణాల జోరు!

- **సెల్లార్లు.. అదనపు అంతస్తులు.. సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు – టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు**

**ముషీరాబాద్, సెప్టెంబర్ 02 (వుదయం)**

ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలో అక్రమ నిర్మాణాలపై స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. చిక్కడపల్లి రోడ్ నంబర్-10, అశోక్‌నగర్ బ్రిడ్జి పరిసర ప్రాంతాలు, కవాడిగూడ, రాంనగర్ డివిజన్‌లలో నిర్మాణ నిబంధనలను ఉల్లంఘిస్తూ భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయకపోవడం వల్లే అక్రమ నిర్మాణదారులకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా?**

కొన్ని ప్రాంతాల్లో భవన నిర్మాణానికి తీసుకున్న అనుమతులకు భిన్నంగా నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా అనుమతులు లేని సెల్లార్ నిర్మాణాలు, అనుమతులకు మించి అదనపు అంతస్తులు, భవనం చుట్టూ తప్పనిసరిగా ఉండాల్సిన సెట్‌బ్యాక్ స్థలం లేకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. రహదారులను ఆనుకుని నిర్మాణాలు చేపట్టడం, పార్కింగ్‌కు కేటాయించాల్సిన స్థలాన్ని కూడా నిర్మాణానికి వినియోగించడం వల్ల భవిష్యత్‌లో ట్రాఫిక్, పార్కింగ్, డ్రైనేజీ సమస్యలు మరింత తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**



నిర్మాణ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు వెంటనే ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఆయా ప్రాంతాల్లో నిర్మాణ అనుమతులు, సెల్లార్ నిర్మాణం, అదనపు అంతస్తులు, సెట్‌బ్యాక్ తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలన జరపాలని డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలు ప్రారంభ దశలోనే గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్మాణాలు పూర్తయ్యే వరకు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత భవన యజమానులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమంగా నిర్మించిన భాగాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి**

నిర్మాణ నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి



లో కచ్చితంగా అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా సెల్లార్, అదనపు అంతస్తులు, సెట్‌బ్యాక్ వంటి అంశాల్లో నిబంధనలను ఉల్లంఘిస్తే భవన భద్రతపైనా ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిక్కడపల్లి రోడ్ నంబర్-10, అశోక్‌నగర్ బ్రిడ్జి పరిసరాలు, కవాడిగూడ, రాంనగర్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**"అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఎప్పుడు?"**

ముషీరాబాద్‌లో పెరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు ఇకనైనా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటంతో పాటు

నిర్మాణ నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన బాధ్యత టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఉందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

## షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ అంశాలపై సమగ్ర సమీక్ష

**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 1 (వుదయం ప్రతినిధి) :**

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీ చంద్రా రెడ్డి షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయంలో షాద్‌నగర్ డివిజన్‌కు సంబంధించిన వివిధ రెవెన్యూ అంశాలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పెండింగ్ రెవెన్యూ అంశాలు, సర్వే సంబంధిత పనుల పురోగతి తదితర అంశాలను సమీక్షించారు. పెండింగ్ పనులను ప్రాధాన్యతతో చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సత్వరంగా అందేలా సమన్వయంతో పనిచేయాలని



# కాంగ్రెస్ అరాచకాన్ని సహించేది లేదు...

- **డాక్టర్ దాసి నాగరాజు**
- **బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.**

**బాచుపల్లి, సెప్టెంబర్ 2,(వుదయం ప్రతినిధి ),**

అప్రజాసానిక కాంగ్రెస్ అరాచకాన్ని సహించేది లేదని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ దాసి నాగరాజు తెలిపారు. మంగళవారం మేడ్చల్ అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి,డాక్టర్ దాసి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా నష్టపోయిన బాధితులను పరామర్శించడానికి వెళ్తే అక్రమ అరెస్టులు చేస్తున్నారని, జిల్లా అధ్యక్షుల ఇళ్లల్లోకి వెళ్లి మహిళలను విచక్షణారహితంగా కాంగ్రెస్ శ్రేణులు గాయపరుస్తున్నారని

ఇదెక్కడ ప్రజాస్వామ్యం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద ఎస్సీ సమాజమంతా దేవుడిగా కొలుసుకునే గురు సంత్ రవిదాస్ చిత్రపటానికి నల్ల రంగు పూయటం హేయమైన దుశ్చర్య అని, ప్రభుత్వం ఈ విధమైన సంఘటన ను ప్రోత్సహిస్తే భారతీయ జనతా పార్టీ రెండింతలు ప్రతిఘటిస్తుందని హెచ్చరించారు.

సంత్ రవిదాస్ చిత్రపటంపై నల్ల రంగు పూసిన యువజన కాంగ్రెస్ నాయకులను తక్షణమే అరెస్టు చేసి వారిపై అట్రాసిటీ కేసును నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు కె.సుధాకర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు అమిత్, బిజెపి అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్, బిల్డర్ సెల్ కన్వీనర్ పద్మ ప్రసాద్, బిజెపి ప్రగతి నగర్ అధ్యక్షులు నరేంద్ర చౌదరి, యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయి కృష్ణారెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా కమిటీ సభ్యులు, మోచి సమాజ ప్రతినిధులు, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE XXV ADDL. CHIEF JUDGE, C.C.C. AT: HYDERABAD O.S.NO. 346 OF 2026**

**Between :**

1. K.S. Shravya @ Ganta Sudheer Kumar Shravya, D/o Late K. Sravan Kumar @ Katta Sravan Kumar, Aged about 38 years, Occ: Houswife, R/o H.No.1-8-702/23/A, Nallakunta, Shankar Mattam, Musheerabad, Hyderabad.
2. K.S. Poojhya @ Pottigari Poojhya, D/o Late K. Sravan Kumar @ Katta Sravan Kumar, Aged about 34 years, Occ: Housewife, R/o 3-4-543/1, Flat No.301, 3rd Floor, Imperial Castle Appt., Near YMCA, Narayanaguda, Himayathnagar, Hyderabad. …Plaintiffs

**AND**

1. The Tahsildar, Himayat Nagar Mandal, Hyderabad District. 2. The Tahsildar, Bachannapet Mandal, Jangoan District. 3. The Tahsildar, Rajendra Nagar Mandal, Ranga Reddy District. 4. The Tahsildar, Amberpet Mandal, Hyderabad District.
5. All Concern …Defendants

Please take notice that the Plaintiffs above named filed the above suit for Declaration, to declare the Plaintiffs 1 & 2 are the absolute owners and possessors of Schedule A to E Properties by way of inheritance as they are the only Legal Heirs of Late Late Sri K. Sravan Kumar @ Katta Sravan Kumar and Late Smt. K. Chandra Prabha @ Katta Chandra Prabha. The said suit stands posted to 23.09.2026. if any person/s claiming to be the beneficiaries of the said land not having any objection in granting the said relief, may appear before the above said court on the date mentioned above at 10:30 a.m. either in person or through your Advocate, and submit your contentions with documentary evidence, failing which, the matter will be heard decided exparte.

**SCHEDULE "A" PROPERTY**

All that House bearing Municipal No.1-8-702/23/A, admeasuring 176 Sq. Yards situated equivalent to 147.15 Sq. meters and with a common area of 12.81 Sq. yards out of 25.62 sq. yards for common passage, borewell 4½ (Thus totally admeasuring 188.81 sq. yards) consisting of stilt floor room 160 sq. feets and 710 Sq. feet for parking, Ground Floor, admeasuring 870 Sq. Feet, first floor admeasuring 900 sq. feet and second floor admeasuring 270 sq. feet situated at Nallakunta, Hyderabad, and bounded as follows:
North : H.No.1-8-702/21/2
South : H.No.1-8-702/24
East :H.No.1-8-702/23 and common passage
West : H.No.1-8-702/22/3

**SCHEDULE "A" PROPERTY**

Residential Plot bearing No,1395 admeasuring 250 Sq. Yd. pertaining Survey Nos.114,698, 699, 700, 701, 703, 705, 711, 714, 715, 716, 717, 722, 723, 725, 726, 727, 728, 729, 730, 731, 732, 734, 735, 736, 737, 738, 739, 763, 764, 766, 767, 768, 769, 770, 774, 775, 776, 777, 778, 783, 784, 785, 786, 788, 790, 791, 806, 807, 808, & 880 parts of Pochannapet Village, Bachannapet Mandal, Warangal District under the jurisdiction of Registration Sub District Cherial, and Registration District Warangal, Gram Panchayath Pochannapet M.P.P. Bachannapet, Z.P.P. Warangal, and bounded as follows:
**Boundaries for Plot No.1395**
North : 40' Wide Road
South : Plot No.1388
East : Plot No.1394
West : Plot No.1395/1

**SCHEDULE "C" PROPERTY**

All that the Flat No. 103 (in First Floor) of "SATYADEVA SOWDHAM" in Block-C, having plinth area of 1198 Sq. Feet including common area and Car Parking together with un-divided share of land 28 Sq. Yards (out of 425 Sq. Yards) on Plot Nos.99 and 100, in Survey Nos.5, 6, 7 and 8, situated at POKALWADA VILLAGE, Rajendranagar Mandal, R.R. District, and bounded as follows:
North : Corridor
South : Open to sky
East : Open to sky
West : Open to sky

**SCHEDULE "D" PROPERTY**

Residential Plot bearing No,1126/2 admeasuring 328 Sq. Yd. pertaining Survey Nos.114,698, 699, 700, 701, 703, 705, 711, 714, 715, 716, 717, 722, 723, 725, 726, 727, 728, 729, 730, 731, 732, 734, 735, 736, 737, 738, 739, 763, 764, 766, 767, 768, 769, 770, 774, 775, 776, 777, 778, 783, 784, 785, 786, 788, 790, 791, 806, 807, 808, & 880 parts of Pochannapet Village, Bachannapet Mandal, Warangal District under the jurisdiction of Registration Sub District Cherial, and Registration District Warangal, Gram Panchayath Pochannapet M.P.P. Bachannapet, Z.P.P. Warangal., and bounded as follows:
**Boundaries for Plot No.1126/2**
North : others land
South : Plot No.1127
East : 33' Wide Road
West : Plot No.1126 & 1126/1

**SCHEDULE "E" PROPERTY**

All that the Residential Flat No.201, in Second Floor, bearing Municipal No.2-2-647/211/201, PTI No.1090207075, having a super built-up area of 1000 Sft., (including common area and sufficient car parking, along with undivided share of land admeasuring 20 Sq. Yards, out of 266.60 Sq. Yards, in premises bearing MCH No.2-2-647/211, in building complex known as "TIRUMALA NARAYANDARI", situated at C.E. Colony, Bagh Amberpet, Hyderabad, T.S., and bounded as follows:
Boundaries of Flat
North : Open to sky
South : Open to sky
East : Passage & Flat No.202
West : Open to sky
Boundaries of Flat
North : Sudarshan Nilayam Apartments
South : House of Seshagiri Rao
East : Road
West : Park

**//BY ORDER OF COURT//**

Hyderabad
Dt: 03.09.2026

**Sd/-
D. SRIDHAR
Advocate
R/o H.No.11-3-428,
New Ashok Nagar, Near Padma Rao Nagar, Parsigutta, Secunderabad – 500061.
Cell: 9989493740
Counsel for the Plaintiffs**

**IN THE COURT OF THE HON'BLE PRL DISTRICT AND SESSIONS JUDGE : RANGA REDDY DISTRICT : AT: L.B NAGAR GWOP NO. 38 OF 2026**

**Between :**
Smt. Kamal Rajesh Patel & others …Petitioners
**AND**
All Concerned …Defendants
To,
To whomever so it may be all concerned,

Take notice that the plaintiffs have filed the petition under section 7 to 10 R/w 29 of Guardian and Wards Act ,1890, vide GWOP No. 38 of 2026, on the file of the Hon'ble Prl. District and Sessions Judge, Ranga Reddy District at L.B. Nagar, against you and other defendants. The GWOP is posted to 18-09-2026 at 10:30 A.M. for your appearance. To appoint the Petitioner No. 1 herein as a Legal Guardian of the Minor Petitioner No. 2, Senghani Vaishnavi, i.e., and permit the Petitioner No. 1 to alienate Minor undivided  share inherited in deceased half share in the petition schedule property. Therefore, you are hereby called upon to appear before the said Hon'ble Court on the aforesaid date and file your objections, if any. Failing which, the Hon'ble Court shall proceed to decide the matter on merits and pass appropriate orders based on the material available on record.

**//BY ORDER OF THE HONOURABLE COURT//**

**Sd/-
G.Shankaraiah,
Advocate
# Flat No.301 , DKR MANSION
Ushodhaya colony, Hayathnagar
Hyderabad. Cell: 9848082431
Email: shankaraiahadv@gmail.com**

**IN THE COURT OF THE HON'BLE III SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: SECUNDERABAD O.S. No. 250 of 2026**

**Between :**
D. Sreenivasan & Others …Plaintiffs
**AND**
1.Mandal Revenue Officer,
Tirumalagiri Mandal
2.ALL CONCERNED …Defendants
To,
2. All Concerned

Please take notice that the above suit bearing O.S. No. 250 of 2026 on the file of III SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, SECUNDERABAD, has been filed by the Plaintiffs for the relief of Declaration, to declare them as legal heirs of the deceased Shri D. Rajamani and Late. D. Laxmi Narayana who died intestate in respect of Suit Schedule Property. The said matter is posted on 29.09.2026 for the appearance. All concerned may appear either in person or through an Advocate at 10:30 am before the said court. Failing which, the matter would be decided as per the law.

**(By the order of the Hon'ble III Senior Civil Judge, City Civil Court, Secunderabad)**

**Sd/-
GADDA SHASHI PRIYA
KARIKA DILIP KUMAR
Advocates
#20-1608, Near Chandanagar Railway Station, Hyderabad-500019.
Phone no: 8688809820
Shashipriyagadda@gmail.com**

**IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD O.S. No. 2612 of 2026**

**Between :**
Prabhavathi Patel and 3 others …Plaintiffs
**AND**
Mandal Revenue Officer, Ameerpet and another …Defendants
To,
All Concerned …Defendant No.2

Please take notice that the above said O.S. has been filed by the Plaintiff seeking Declaration of Legal Heirs of Late Amrut Lal Patel. The Hon'ble Court has posted the above said matter on 24-09-2026 for your appearance, if any. Please appear at 10:30 A.M. before the above mentioned court on 24-09-2026 with any objections failing which the above said matter will be decided in your absence and on merits.

**(By Order of Hon'ble Court)**

**Sd/-
Ashish Samat - Advocate
H. No. 1-8-54/1/1, 2nd Floor,
Above Pharma Plus, Opp. Swiss Castle Bakery,
P.G. Road, Secunderabad – 500003
Ph +91 7702285951**

**In the court of the Hon ble V JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURTS: at : HYDERABAD O.S. No. 2456 of 2026**

**Between :**
Smt. Renuka Gupta & others …Plaintiffs
**AND**
To all concerned & another …Defendants
To,
All Concerned N O T I C E Please take notice that the above named Plaintiffs have filed the above suit to Declare the Plaintiffs as Legal Heirs of Late Sri. Suresh Kumar Gupta, and the same is posted on 15-09-2026. That if any person/s has got any kind of objection in the above matter may appear before the Hon ble Court on 15-09-2026 at 10.30 A.M. either personally or through an Advocate, failing the matter will be decided on the material available.

By the Order of the Court

**Sd/-
Pawan Kumar Agarwal
Advocate Counsel for the Plaintiffs PAWAN KUMAR AGARWAL, Smt. DURGA AGARWAL, KUSHAAL AGARWAL, ADVOCATES 1105, 11th Floor, RAGHAV RATNA TOWERS, CHIRAG ALI LANE, ABIDS, HYDERABAD -01. Phone: 9246530236**




నేపాల్.. నువ్వు ఒంటరిదానివి కావు...

"వరదలు ముంచెత్తిన నేపాల్‌ను చూస్తే దుఃఖం వస్తోంది. మనం సురక్షిత ప్రాంతాల్లో ఉన్నందుకు అదృష్టవంతులం. మీరెంత బిజీగా ఉన్నా.. నేపాల్‌లోని కుటుంబాల కోసం కాస్త సమయం కేటాయించండి. మీకు చేతనైనంత విరాళాలు పంపండి. ఇలాంటి విపత్తులు వచ్చినప్పుడు ఆదుకోవడం ప్రభుత్వం, మంత్రుల బాధ్యత మాత్రమే అనుకోవద్దు. ఒక మనిషిగా, భారతీయుడిగా ఇది మనందరి బాధ్యత. వాళ్లు తమ ఇళ్లను, కుటుంబాలను, అందమైన బాల్యాన్ని కోల్పోయారు. మనమంతా కలిసి వారికి ఓ కొత్త జీవితాన్ని అందిద్దాం. నేపాల్.. నువ్వు ఒంటరివి కావు."

**- సోనూ సూద్, ప్రముఖ నటుడు**

## వే'మన' పద్యం

**చిత్త శుద్ధి కలిగి చేసిన పుణ్యంబు**
**కొంచమైన నదియు గొదవుగాదు**
**విత్తనంబు మఱ్ఱి వృక్షంబునకు**
**నెంతవిశ్వదాభిరామ! వినురవేమ!**



# సంపాదకీయం

## అది ఆలోచనలపై దాడే...

అక్షరాలతో ఆలోచనలు పోగేసుకుంటున్న ఆ యువ మనసులపై మతోన్మాదం విరుచుకుపడింది. జాతీయ గీతం పాడుతున్నా దాడులు ఆగలేదు. ఇంతకీ వాళ్ళు చేసిన నేరమేమిటి? పుస్తకాలు పట్టుకోవడమేనా వాళ్లు చేసిన పాపం. అహ్మదాబాద్ నగరంలోని సైలెంట్ పార్కులో ఇటీవల ప్రశాంతంగా పుస్తకాలు చదువుకుంటున్న స్టూడెంట్స్ అండ్ యూత్ కలెక్టివ్, గుజరాత్ రీడ్స్ ఎనీవే ప్రతినిధులపై విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ మూక దాడులకు తెగబడ్డాయి. ఇది కేవలం కొందరు విద్యార్థులపై జరిగిన దాడి కాదు.. చదువుకునే హక్కుపై, ఆలోచించే స్వేచ్ఛపై, భిన్న ఆలోచనలపై జరిగిన దాడి. బేస్బాల్ బ్యాట్లు, పెద్దకర్రలు, కాషాయ జెండాల్లో చుట్టిన ఇనుప రాడ్లతో విరుచుకుపడ్డాయి ఆ మూకలు. అంతటితో ఆగకుండా అక్కడున్న ముగ్గురు ముస్లిం విద్యా ర్థులను ప్రత్యేకంగా పక్కకు లాక్కెళ్లి "మీ బట్టలు విప్పి చూపించండి..
" అంటూ చితకబాదారు. "మేం భారతీ యులమే" అని ఎంత మొరపెట్టుకున్నా వారు కనికరించ లేదు. చివరకు వారు తమ దేశభక్తిని నిరూపించుకునేందుకు జాతీయ గీతాన్ని ఆలపించారు. కానీ, కసాయి గుండెలు కరగలేదు. ఆ కఠిన హృదయాలకు ఆ గీతంలోని పవిత్రత గానీ, కళ్లలోని భయంగానీ కనపడలేదు. ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే అక్షర దాహం ఆ యువకులది. అది వారికి భిన్న ఆలోచనలను పంచుకునే వేదిక. ఆ సాయంత్రం అహ్మదాబాద్ సైలెంట్ పార్కులో కనిపించిన దృశ్యం ఇదే. అక్కడ విద్యార్థులు, యువత కలిసి పుస్తకాలు చదువుకుంటున్నారు. వారి చేతుల్లో ఉన్నది కూడా నోబెల్ పురస్కారం పొందిన మలాలా జీవిత జ్ఞాపకం 'ఐ యామ్ మలాలా'.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ నెత్తుటి అక్షరాలు.. రాజ్యాంగ శిల్పి బి.ఆర్. అంబేద్కర్ సమతా భావాలు.. భారతదేశ తొలి ప్రధాని నెహ్రూ స్వప్నాలు.. నాజీల క్రూరత్వం మధ్య సైతం మానవత్వంపై ఆశను వదలని యాన్ ఫ్రాంక్ 'ది డైరీ ఆఫ్ ఎ యంగ్ గర్ల్'.. ఆ గొప్ప పుస్తకాల పేజీలను తిరగేస్తూ ఒకరికొకరు ఆలోచనలు పంచుకుం టున్నారు. ఆ ఆలోచనలు సంఘర్షణే ఇప్పుడు మతోన్మాదాన్ని భయపెట్టింది. పుస్తకం ప్రశ్నించ డం నేర్పుతుంది. ప్రశ్నించే మనిషి మూఢ నమ్మకాలను, విద్వేషాన్ని, అసమానతను అంగీకరించదు. అందుకే ఆలోచ నలపై దాడి చేసే శక్తులు ముందుగా పుస్తకాన్నే లక్ష్యంగా చేసు కుంటాయి. అందుకే ప్రశాంతంగా చదువుకుంటున్న ఆ యువతపై 'కాశ్మీర్ వ్యతిరేకులు', 'తీవ్రవాదులు' అంటూ ముద్రలువేస్తూ దండెత్తారు. 'జై శ్రీరామ్' నినాదాన్ని సైతం బెదిరింపు ఆయుధంగా మార్చేశారు. ఈ దారుణ దుశ్చర్య వెనుక స్పష్టమైన సంఘ్ పరివార్ కుట్ర కోణం దాగి ఉంది. భిన్నత్వాన్ని, సత్యాన్ని మోసే ఈ పుస్తకాలు వారి విద్వేష రాజ్యానికి ఏనాడూ మింగుడుపడవు. అందుకే పథకం ప్రకారమే దాడులకు తెగబడ్డారు. నోబెల్ పురస్కారం పొందిన మలాలాను 'పాకి స్థానీ అమ్మాయి' అంటూ ఎద్దేవా చేయడం. కానీ ఆమె నిలబడింది మత ఛాందసత్వానికి ఎదురొడ్డి. ఆ ఛాందసవాదాన్ని వ్యతిరేకించే స్వరం ముస్లిం అమ్మాయిది కావడం, ఆ పేరు వినపడటమే సంఘ్ మూకలలో కడుపుమంటను రేపింది. ఎన్నికల లాభాల కోసం బీజేపీ తరచూ అంబేద్కర్ పేరును జపిస్తున్నప్పటికీ, సామాజిక న్యాయాన్ని కోరే అంబేద్కర్ సిద్ధాంతాల పట్ల వారికి ఏనాడూ ఆత్మీయత లేదు. ఇక నెహ్రూ అంటే దాదాపు పన్నెండేండ్లుగా విష ప్రచారాన్ని నింపిన అధికార పీఠానికి, ఆయన పట్ల పెరిగిన అసూయ స్పష్టంగానే ఉంది. భగత్ సింగ్ నేర్పిన విప్లవం వారి హిందూత్వ ఎజెండాకు శత్రువు. అందుకే ఆలోచనలు వికసించే ఏ పుస్తకాన్నీ వాళ్లు భరించలేక పోతున్నారు. నిన్నటిదాకా మనం ఏం తినాలో, ఏం తాగాలో, ఎలా ఉండాలో నిర్దేశించాలనుకున్న నిరంకుశత్వం.. ఇప్పుడు మనం ఏం చదవాలో, ఏం ఆలోచించాలో, ఎలాంటి భావాలను గుండెల్లో దాచుకోవాలో కూడా శాసించాలను కుంటోంది. పుస్తకం చదివే పిల్లలను కొట్టడం అంటే రేపటి సమాజాన్ని కొట్టడం. జాతీయ గీతం పాడుతున్నా ఆగని కర్ర దెబ్బలు.. ఈ దేశంలో మతోన్మాదానికి అండగా రాజకీయ, అధికార రక్షణ ఎంత ప్రమాదకర స్థాయికి చేరిందో చెప్పకనే చెబుతోంది. ఆ దాడుల్లో దెబ్బతిన్నది ఆ పిల్లల శరీరాలు మాత్రమే కాదు.. ఈ దేశ ప్రజాస్వామ్య ఆత్మ కూడా. రక్తం కారింది వారి శరీరాల నుంచే కాదు.. రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛా భావాల నుంచీ. పుస్తకాలు పట్టిన ప్రతి చేతికి అండగా నిలవాల్సిన సమాజం, ఆ చేతులపై విరిగిన కర్రలను చూస్తూ మౌనంగా ఉండకూడదు. ఆలోచించే హక్కును, చదివే స్వేచ్ఛను, రాజ్యాంగం ఇచ్చిన భావప్రకటన స్వాతంత్ర్యాన్ని మతోన్మాద రాడ్లతో అణచివేయాలని చూస్తున్న ఈ ప్రమాదకర ధోరణిపై ఆలోచించే ప్రతి గుండె గళమెత్తుతుంది. స్పందించే ప్రతి అక్షరం తిరగబడుతుంది. జెన్ జీ ఉద్యమం దాన్ని నిరూపించింది.


**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


# ఇంకా ఎంతమంది శిరీషలు బలికావాలి?

## చట్టాలు మారుతున్నా మారని మహిళల భద్రత

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ములకలపల్లి మండలం, చౌటిగూడెం అనే ఒక మారుమూల గ్రామం నుంచి ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన 21 ఏళ్ల యువతి ఉకే శిరీష. తన కాళ్లపై తాను నిలబడాలనే ఆశయం, కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా ఉండాలనే బాధ్యత ఆమెను హైదరాబాద్‌లోని తుక్కుగూడ ప్రైమ్ కేర్ హాస్పిటల్ వరకు తీసుకువచ్చాయి. ఒక ఆసుపత్రిలో నర్సుగా చేరడం అంటే ప్రాణాలు కాపాడే వృత్తిలోకి అడుగుపెట్టడం. కానీ, అదే ఉద్యోగం, అదే హాస్పిటల్ పరిసరాలు, ఆమె నివసించిన గదే చివరికి మరణశయ్యగా మారతాయని ఆమె గానీ, ఆమె కుటుంబం గానీ ఊహించి ఉండరు. పోలీసు దర్యాప్తు వివరాల ప్రకారం, కొంతకాలంగా ఆమె కదలికలను గమనిస్తూ వచ్చిన నిందితుడు, ఆమె నిద్రిస్తున్న సమయంలో కిటికీ గుండా గదిలోకి ప్రవేశించి, లైంగిక దాడికి పాల్పడి దారుణంగా హత్య చేశాడని ఆరోపణలు ఉన్నాయి. ఆధారాల ఆధారంగా పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసినప్పటికీ, ఈ ఘటన సమాజం ముందు విసిరిన ప్రశ్నలు అత్యంత తీవ్రమైనవి. ఈ దేశంలో ఒక ఆడపిల్ల తన ఇంటికి దూరంగా, తన పని ప్రదేశంలో, తాను ఉండే వసతి గదిలో ప్రశాంతంగా, సురక్షితంగా జీవించే హక్కు ఎప్పుడు వాస్తవమవుతుంది అనేది ప్రధాన సమస్యగా నిలిచింది.

**మారిన కాలం – మారని పరిస్థితులు**

2012 నిర్భయ ఘటన దేశ మనస్సాక్షిని కుదిపేసినప్పుడు, భారత న్యాయ వ్యవస్థలోనూ, పోలీసు వ్యవస్థలోనూ విప్లవాత్మక మార్పులు వస్తాయని భావించాం. 2013 క్రిమినల్ లా సవరణ చట్టం ద్వారా స్టాకింగ్, యాసిడ్ దాడులు, లైంగిక వేధింపులపై శిక్షలను తీవ్రతరం చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, షీ టీమ్స్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ 112, సేఫ్ సిటీ ప్రాజెక్టులు, సీసీటీవీ నెట్‌వర్క్ అమల్లోకి వచ్చాయి. 2019 దిశ ఘటన తర్వాత రాత్రివేళల పోలీసు పెట్రోలింగ్, అత్యవసర యాప్‌లపై విస్తృత చర్చ జరిగింది. 2024 కోల్‌కతాలోని ఆర్.జి. కర్ మెడికల్ కాలేజీ ఘటన వైద్య రంగానికి చెందిన మహిళల రక్షణను ప్రశ్నించింది. ఇప్పుడు శిరీష హత్య ఉదంతం నగరాలు, వృత్తులు, బాధితులు మారుతున్నా మన వ్యవస్థ తీరులో ఒక విచారకరమైన




స్థిరమైన నమూనా ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. నేరం జరిగిన తర్వాత స్పందించే వ్యవస్థగానే మన యంత్రాంగం ఉండిపోయింది తప్ప, నేరం జరగకుండా అడ్డుకునే వ్యవస్థగా మారలేదు.

**గణాంకాలు చెబుతున్న కఠోర సత్యం**

మహిళల భద్రతపై మన వాదనలు ఎంత బలహీనమైనవో నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. 2023 నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా మహిళలపై నేరాలకు సంబంధించి 4,48,211 కేసులు నమోదయ్యాయి. 2022లో ఈ సంఖ్య 4,45,256 కాగా, 2021లో 4,28,278గా ఉంది. 2023లో జాతీయ స్థాయిలో ప్రతి లక్ష మంది మహిళలకు నేరాల రేటు 66.2గా నమోదు కాగా, తెలంగాణ రాష్ట్రంలో ఈ రేటు 124.9గా నమోదైంది. ఇది జాతీయ సగటు కంటే దాదాపు రెట్టింపు ఉండటం తీవ్రంగా ఆలోచించాల్సిన విషయం. ఈ సంఖ్యలు కేవలం పోలీసు స్టేషన్‌కు చేరిన కేసులు మాత్రమే. సామాజిక అవమాన భయం, కుటుంబాల ఒత్తిడి, బెదిరింపుల వల్ల నమోదు కాకుండా దాగి ఉన్న కేసులు ఇంకా ఎన్నో ఉంటాయి. కేసులు నమోదు కావడం చైతన్యానికి సూచికే కావచ్చు, కానీ జాతీయ సగటు కంటే ప్రాంతీయంగా నేరాల రేటు ఎక్కువగా ఉండటం వ్యవస్థల పనితీరుపై ఒత్తిడిని పెంచుతోంది.

**వ్యవస్థాగత వైఫల్యం, సామాజిక దృక్పథం**

తెలంగాణలో వందలాది షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, టీ సేఫ్ వంటి ఆధునిక వ్యవస్థలు ఉన్నాయి. వీధి వేధింపుల నిరోధానికి షీ టీమ్స్ తోడ్పడుతున్నప్పటికీ, శిరీష ఎదుర్కొన్న ప్రమాదం రక్షణ రహితమైన సంస్థాగత వాతావరణంలో జరిగింది. ఒక ప్రైవేట్ ఆసుపత్రి తన సిబ్బందికి కేటాయించే వసతి గదికి సరైన తలుపులు, కిటికీలకు గ్రిల్స్, పటిష్టమైన లాకింగ్ సిస్టమ్ ఉన్నాయా లేదా అని తనిఖీ చేసే బాధ్యత లోపించడం సంస్థాగత వైఫల్యానికి ఉదాహరణ. నిందితుడు ఆమెను కొంతకాలంగా గమనిస్తున్నాడనేది వాస్తవమైతే, ఆ సైలెంట్ వేధింపులను పసిగట్టే ప్రాథమిక హెచ్చరికల వ్యవస్థ మన వద్ద లేకపోవడం మరొక లోపం. మరొకవైపు, ఘటన జరగగానే మహిళలపై ఆంక్షలు విధించే సామాజిక ధోరణి ముమ్మాటికీ వైఫల్యమే. ఒక పురుషుడు అర్ధరాత్రి వేళ స్వేచ్ఛగా తిరగడాన్ని సాధారణంగా చూసే సమాజం, ఒక మహిళ తన వృత్తిరీత్యా రాత్రి షిఫ్ట్ చేసి వస్తే దానిని ప్రమాదకర నిర్ణయంగా ముద్ర వేయకూడదు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, శ్రమించే హక్కు, గౌరవప్రదమైన జీవితం పొందడం మహిళల హక్కు. భద్రత కల్పించాల్సిన బాధ్యత రాజ్యాంగ యంత్రాంగానిది, యాజమాన్యాలది.

**దుర్మార్గాలకు ముగింపు పలికే కార్యాచరణ**

శిరీష హత్య కేవలం మరొక వార్తగా మిగిలిపోకూడదంటే, వ్యవస్థలో తక్షణమే మార్పులు రావలసి ఉంది. మొదటిగా, ఫైర్ సేఫ్టీ ఎన్ఓసీ తరహాలోనే, మహిళలు పనిచేసే, నివసించే ప్రతి ప్రైవేట్ లేదా ప్రభుత్వ ఆసుపత్రి, నర్సింగ్ హాస్టల్, పీజీ హాస్టల్, పరిశ్రమలకు జెండర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించి సర్టిఫికేషన్ తప్పనిసరి చేయాలి. పని చేస్తున్న సీసీటీవీలు, వెలుగులు, పటిష్టమైన నిర్మాణాలు, సెక్యూరిటీ గార్డుల డిజిటల్ రిజిస్ట్రేషన్ లేకపోతే సంస్థల లైసెన్సులు రద్దు చేయాలి. రెండవది, కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం ప్రకారం ప్రతి సంస్థలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో లేబర్, పోలీసు శాఖలు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి. మూడవది, పోలీసులు మహిళా హాస్టళ్లు, రాత్రివేళ రాకపోకలు ఎక్కువగా ఉండే ప్రదేశాలలో హాట్‌స్పాట్ పెట్రోలింగ్ నిర్వహించాలి. స్టాకింగ్ లేదా వేధింపుల ఫిర్యాదులు వచ్చిన వెంటనే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలి. నాలుగవది, చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా, శిక్ష పడటానికి ఏళ్లు పడితే నేరస్థుల్లో భయం నశిస్తుంది కాబట్టి, ఇలాంటి దారుణ లైంగిక దాడులు, హత్యల కేసుల్లో విచారణను రెండు నుండి మూడు నెలల్లోగా పూర్తి చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన శిక్షలు అమలు చేయాలి. ఐదవది, పాఠశాల స్థాయి నుంచే లింగ సమానత్వం, ఇతరుల పట్ల గౌరవం అనే అంశాలపై అబ్బాయిలకు స్పష్టమైన విద్య అందించాలి.

**వ్యవస్థ పటిష్టం కావాలి**

శిరీష తిరిగి రాదు. నిర్భయ, దిశ, కోల్‌కతా బాధితురాలు మన మధ్యకు తిరిగి రారు. ప్రతి దారుణం తర్వాత కొవ్వొత్తుల ప్రదర్శనలు చేయడం, కొంతకాలం ప్రజా ఆగ్రహం వ్యక్తం కావడం, ఆ తర్వాత అంతా మరచిపోవడం ఒక నిరంతర విషవలయంగా మారింది. ఇప్పుడు మనం అడగాల్సిన అసలు ప్రశ్న నేరం జరిగిన తర్వాత నిందితుడికి ఏ శిక్ష పడింది అనేది మాత్రమే కాదు, ఈ నేరం జరగకుండా అడ్డుకోవడంలో మన వ్యవస్థ ఎక్కడ విఫలమైంది అనేది ప్రధానం. ఒక ఆడపిల్ల ఉద్యోగం కోసం ఇల్లు దాటి వెళ్తున్నప్పుడు తల్లిదండ్రులు జాగ్రత్త అని భయంతో చెప్పే దేశం కాదు మనకు కావాల్సింది, నువ్వు ఎక్కడ ఉన్నా ఈ దేశం, ఈ వ్యవస్థ, ఈ చట్టం నీ వెనుక రక్షణగా ఉన్నాయి అని కొండంత ధైర్యంతో చెప్పగలిగే రాజ్యం మనకు కావాలి. శిరీష హత్యకు న్యాయం జరగడం ఎంత ముఖ్యమో, మరో శిరీష బలికాకుండా చూడడం అంతకంటే పెద్ద న్యాయం. అది ప్రభుత్వానికి, పోలీసు రంగానికి, న్యాయ వ్యవస్థకు, అంతిమంగా ఒక నాగరిక సమాజంగా మన మనస్సాక్షికి నిరంతర పరీక్ష.




యం డి. ఉస్మాన్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్


## ఓ యువతా గమ్యం వైపు సాగిపో

ఓ యువత
మాటల మధ్యన
బంధీ కాకు
పట్టుదల సంకల్పంతో
లక్ష్యసాధనా ప్రక్రియలో
భాగస్వామివై
గమ్యం వైపు సాగిపో

ఓ యువత మాటల
కోటలు దాటిరా
మౌనపు బంధాలు తెంచుకో
చేతుల్లో నీ సత్తా చాటడానికి
నైపుణ్య కదలికవై చైతన్య శక్తిగా
నువ్వు ముందుకు సాగు

" ఈ పనిని నేను రేపు
మొదలు పెడతాను నేనింకా
సిద్ధంగా లేను నేను మారను
నేను ఇలాగే ఉంటాను
ఈ జన్మకు ఇంతే ఈ పని
నాతో కాదు అనే నైరాశ్యం
ఇవన్నీ కేవలం మాటలు కాదు
మిత్రమా! నీ పురోగతిని
అడ్డుకునే అడ్డుగోడలు

ఓ యువతా మాటల
మధ్యన బంధీగా ఉండకు
పనిని ప్రారంభించు ముందు
ఆలోచనలకే పరిమితం కాకు
కాలం ఎవరికోసం ఆగిపోదు
నీ అడుగులు వెనక్కు పడనీయకు
వెనుక ఉంటే వెనుక బడిపోతావు

యువతరమా? మేలుకో?
మొద్దు నిద్రను సోమరితనాన్ని
వీడు నిత్య చైతన్యంతో
మార్పుకు మార్గదర్శివై
ముందడు వేయాలి

నిత్య నూతన సృజనతో
ఆత్మనిర్భరతతో అడుగులు
వేయాలి అభివృద్ధికి అడ్డాగా

ఎదగాలి వృద్ధికి చోదక శక్తివి
కావాలి ఆర్థిక వ్యవస్థలో
ఉపాధి ఉత్పాదకత ఆదాయసృష్టి
ఆర్థిక సామాజిక పంపిణీ జరిగి
జీవన నాణ్యతను పెంచాలి
సుస్థిరాభివృద్ధే ధ్యేయంగా
యువత ముందుకు సాగాలి

నవ సమాజపు నిర్మాణ
శిల్పివి నీవే కావాలి
నీ ప్రతిభకు పదును పెట్టుకో
అడ్డంకులు ఎదురైతే ఆగకు
సమస్యలను చూసి పారిపోకు
ఆందోళనల్లో కుంగిపోకు

అడ్డంకులను అధిగమిస్తేనే
ప్రగతి సవాళ్లను గెలిస్తేనే
పురోగతి
కష్టాలు చీకటిని చీల్చుకుంటూ
ఆత్మవిశ్వాసం వెలుగులను
నింపుతూ విజయాన్ని సొంతం
చేసుకో

వాయిదా వేసే అలవాటు
మారకూడదనే మొండితనం
నీ ఎదుగుదలకు శత్రువులు!
కేవలం మాటలతో కాకుండా
చేతులతో అడ్డంకులను
తొలగించుకుంటూ సాగినప్పుడే
నిజమైన పురోగతి సిద్ధిస్తుంది

నీ సంకల్పమే నీ గెలుపుకు
తొలి అడుగు కావాలి
నీ విజయాలే సమాజానికి
వెలుగు దివ్వె కావాలి
చీకటిని పారదోలాలి
వికసిత భారత్ లక్ష్య
సాధనలో యువత
చోదక శక్తిగా ఎదగాలి




నేదునూరి కనకయ్య
9440245771


## డిజిటల్ సమానత్వం సాధ్యమేనా?

డిజిటల్ విప్లవంలో భారత్ సాధించిన పురోగతి అసాధారణం. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, ప్రభుత్వ సేవలు ఇప్పుడు గ్రామాలకూ చేరుతున్నాయి. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) దీనికి అత్యుత్తమ ఉదాహరణ. 2025-26 ఆర్థిక సంవత్సరంలో యూపీఐ 24,161.69 కోట్ల లావాదేవీలను, రూ.314.23 లక్షల కోట్ల విలువతో నిర్వహించింది. యూపీఐ వినియోగదారుల సంఖ్య 2026 జూన్ నాటికి సుమారు 55.49 కోట్లకు చేరింది. అయితే ఈ గణాంకాలు ఒక ప్రశ్నను కూడా లేవనెత్తుతున్నాయి. డిజిటల్ సేవలు వేగంగా విస్తరిస్తున్నాయంటే అవి అందరికీ సమానంగా అందుతున్నాయా? ఇదే డిజిటల్ అసమానతకు అసలు కొలమానం. 2025 సమగ్ర టెలికాం సర్వే ప్రకారం దేశంలోని 86.3 శాతం కుటుంబాలకు ఇంటి వద్ద ఇంటర్నెట్ సదుపాయం, 85.5 శాతం కుటుంబాలకు కనీసం ఒక స్మార్ట్‌ఫోన్ ఉంది.

ఇది గొప్ప పురోగతే. కానీ ఇంకా దాదాపు ప్రతి ఏడు కుటుంబాల్లో ఒక కుటుంబానికి ఇంటి వద్ద ఇంటర్నెట్ సదుపాయం లేదన్న విషయాన్ని కూడా విస్మరించలేం. అంతేకాదు, పరికరం ఉండటం, దాన్ని స్వతంత్రంగా సమర్థంగా ఉపయోగించగలగడం రెండు వేర్వేరు విషయాలు. ఇటీవలి అధ్యయనాలు డిజిటల్ అసమానత కొత్త రూపాన్ని సంతరించుకుంటోందని సూచిస్తున్నాయి. ఇంటర్నెట్ అందుబాటులో ఉందా లేదా అన్న దశ నుంచి దాన్ని ఎవరు ఎంత సమర్థంగా ఉపయోగించగలుగుతున్నారు? అన్న దశకు సమస్య మారుతోంది.



పని వయసు వారిలో ఇంటర్నెట్ వినియోగం పురుషుల్లో 57.6 శాతం ఉండగా, మహిళల్లో 35.6 శాతమేనని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) ఆధారిత విశ్లేషణలు సూచిస్తున్నాయి. అంతేకాదు, ఐదింట ఒక వంతు కుటుంబాలు డిజిటల్ సేవలను ఉపయోగించేందుకు ఇతరుల సహాయం కోరుతున్నాయి. విద్యలో ఈ అంతరం మరింత ప్రమాదకరం. యూడైస్+ 2024-25 గణాంకాల ప్రకారం దేశంలోని పాఠశాలల్లో ఇంటర్నెట్ సదుపాయం 63.5 శాతానికి చేరింది. అంతకుముందు ఏడాది అది 53.9 శాతం మాత్రమే. అంటే ఒక్క ఏడాదిలో గణనీయమైన పురోగతి ఉన్నప్పటికీ, ఇంకా దాదాపు 36.5 శాతం పాఠశాలలకు ఇంటర్నెట్ సదుపాయం అందలేదు. కంప్యూటర్ సదుపాయం కూడా అన్ని పాఠశాలలకు చేరలేదు. ఇది కేవలం సాంకేతిక లోపం కాదు. డిజిటల్ సదుపాయం ఉన్న విద్యార్థి, అది లేని విద్యార్థి మధ్య భవిష్యత్ అవకాశాల్లో అంతరం పెరిగే ప్రమాదం ఉంది.

ఆన్‌లైన్ కోర్సులు, డిజిటల్ పాఠ్యాంశాలు, కృత్రిమ మేధ సాధనాలు, ఉద్యోగ సమాచారానికి ప్రాప్యత——ఇవన్నీ విద్యార్థుల నైపుణ్యాలను ప్రభావితం చేస్తాయి. అందుకే డిజిటల్ భారత్ లక్ష్యం ఇకపై 'ప్రతి చేతిలో స్మార్ట్‌ఫోన్'తో ఆగకూడదు. ప్రతి వ్యక్తికి చౌకైన, నాణ్యమైన కనెక్టివిటీతో పాటు డిజిటల్ సామర్థ్యం కల్పించడమే తదుపరి లక్ష్యం కావాలి. గ్రామీణ ప్రాంతాల్లో చివరి మైలు కనెక్టివిటీని మెరుగుపరచాలి. పేద కుటుంబాలకు అందుబాటు ధరల్లో పరికరాలు, డేటా అందే విధానాలు అవసరం. పాఠశాలల్లో కంప్యూటర్లు, ఇంటర్నెట్ ఏర్పాటు చేయడమే కాకుండా వాటి నిర్వహణకు నిధులు, ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు ప్రాయోగిక అవగాహన కల్పించాలి. భాష కూడా ఒక పెద్ద అడ్డంకి. ప్రభుత్వ సేవలు, ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, బ్యాంకింగ్ వంటి కీలక సమాచారాన్ని భారతీయ భాషల్లో సులభంగా అందుబాటులోకి తేవాలి. వాయిస్ ఆధారిత సేవలు, స్థానిక భాషల్లో కృత్రిమ మేధ సాధనాలు డిజిటల్ అంతరాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషించగలవు. అదే సమయంలో డిజిటల్ అక్షరాస్యత అంటే కేవలం యాప్ ఉపయోగించడం కాదు. సైబర్ మోసాలను గుర్తించడం, పాస్‌వర్డ్‌లు-ఓటీపీని రక్షించుకోవడం, వ్యక్తిగత సమాచారాన్ని జాగ్రత్తగా పంచుకోవడం, తప్పుడు సమాచారాన్ని గుర్తించడం కూడా అందులో భాగమే. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, తక్కువ విద్యావంతుల కోసం ప్రత్యేక డిజిటల్ శిక్షణ అవసరం. డిజిటల్ భారత్ విజయాన్ని యూపీఐ లావాదేవీల సంఖ్యతో మాత్రమే కొలవడం సరిపోదు. ఒక గ్రామీణ మహిళ మధ్యవర్తి సహాయం లేకుండా బ్యాంకింగ్ చేయగలిగితే, ఒక పేద విద్యార్థి నాణ్యమైన డిజిటల్ విద్య పొందగలిగితే, ఒక వృద్ధుడు ప్రభుత్వ సేవను స్వయంగా పొందగలిగితేనే డిజిటల్ విప్లవం తన అసలు లక్ష్యాన్ని చేరుకున్నట్లు. డిజిటల్ భారత్ అంటే కేవలం అందరినీ ఇంటర్నెట్‌కు అనుసంధానించడం కాదు.. అందరికీ సమాన అవకాశాలను అనుసంధానించడం. సాంకేతికత కొందరిని మరింత ముందుకు తీసుకెళ్లే సాధనంగా కాకుండా, వెనుకబడిన వారిని ముందుకు తీసుకువచ్చే వంతెనగా మారినప్పుడే డిజిటల్ భారత్ నిజమైన సమానత్వానికి పునాదిగా నిలుస్తుంది.




హెచ్.ప్రతాప్
77998 00773


## చెప్పేదొకటి.. చేసేది మరొకటి...

అందరూ ఆచరణలో నిమగ్న మయ్యే ఉంటారు. కానీ ఆలోచనలూ మాటలే వారిననుసరించవు" అని అంటా రొక కవి. ఇది తిరగేసి వ్యంగ్యంగా చెప్పిన మాట. అంటే, చెప్పేదానికి చేసేదానికి పొంతన ఉండదని అర్థం. మాటలకు చేతలకు చాలా వ్యత్యాసం ఉంటుందనేది ఎప్పటినుంచో మనకు తెలిసిన విషయమే. అందుకే అంటారు, 'మాటలు కోటలు దాటుతాయి, కాని చేతలు గడపలు దాటవు అని.' 'వట్టి మాటలు కట్టి పెట్టోయ్, గట్టి మేల్ తలపెట్టవోయ్' అన్న గురజాడ గీతం ఇలాంటి వారిని చూసే రాసుంటారు. అయితే చెప్పే మాటల ప్రకారం చేయకపోతే పోనీ, చెప్పినదానికి విరుద్ధంగా, పూర్తి వ్యతిరేకంగా చేస్తున్న వారి గురించి జాగ్రత్తగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. అదేమంటే, 'సార్వత్రిక ఏకతా ఉత్సవాల' పేరుతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నిర్వహిస్తున్న సభలు నేడు అమెరికా దేశపు న్యూయార్క్ సిటీలోనూ ఏర్పాటు చేస్తున్నారు. న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఆగస్టు 29 న జరిగే ఈ సభలో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రసంగిస్తున్నారు. సార్వత్రిక ఏకతా ఉత్సవమని దానికి పేరుపెట్టటం మరీ విడ్డూరంగా ఉంది. అయితే వారి ఏకత కేవలం మతపరమైన ఏకతకు సంబంధించింది కావచ్చు. వీళ్లు అసలు మనుషుల ఐక్యతను ఎప్పుడూ కోరుకోరు. వీరి సిద్ధాంతంలోనే విభజన, విద్వేషం ఉంటుంది. ఐక్యత, ఏకత అనే మాటలకే పూర్తి విరుద్ధమైన ఆచరణ వాళ్లది. అట్లాంటి వాళ్లు సార్వత్రిక ఏకత కోసం ఉత్సవం చేస్తున్నారు. సరే వారి అర్థంలో విద్వేషాలను, విభజనను వెళ్లగక్కటానికి కావలసిన ఏకత కోసం ఈ పాట్లన్నీ పడుతున్నారు. కాబట్టే ఏ మాటల వెనుక ఏ అర్థాలు దాగున్నాయో తెలుసుకోనంతవరకు మోసపోతూనే ఉంటాం. ఇప్పుడు ముసుగేసుకున్న ఆ సంఘ్ ఏర్పడి వందేండ్లు నిండిన సందర్భంగా ప్రపంచంలోనూ తమ గళాన్ని, గరళాన్ని చిందించే క్రమంలో ఏర్పాటు చేసుకున్నదే న్యూయార్క్‌లో భగవత్ ప్రసంగ సభ. భారతదేశం నుంచి వీళ్లు పోయి అక్కడ చెప్పేదేమిటి? ఈ దేశపు సాంస్కృతిక జీవన విధానాన్ని ఏమైనా ప్రతిబింబిస్తారా? ప్రపంచంలోని ప్రజలకు వీళ్లు వినిపించే సందేశం ఏమిటి? న్యూయార్క్‌లో ఉన్న ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు వీళ్ల విషయాలన్నీ తెలుసు. అందుకే 'మోహన్ భగవత్ ఇక్కడ సభ పెట్టటాన్ని మేం వ్యతిరేకిస్తున్నాం' అని ప్రదర్శన తీశారు. వాళ్లింకా ఏమన్నారంటే, మహాత్మా గాంధీని చంపిన వారసులు వీళ్లు, వీళ్ల సభను జరగనివ్వమని నినదించారు. అంతే కాదు, వేలాది మందిని చంపిన యుద్ధ పిపాసి, ఫాసిస్టు హిట్లర్ వీరికి ఆదర్శం. అటువంటి సంఘ్ శక్తులకు అవకాశం ఇవ్వవద్దని ధర్నా నిర్వహించారు. హిందూ మతతత్వ శక్తులకు ఇక్కడ చోటులేదని పెద్దఎత్తున మాడిసన్ వీధులలో ప్రదర్శనలు తీశారు. వాళ్లంతా హిందూ సమూహాలే కావడం విశేషం. ఇక న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దాని కూడా తాను ఈ కార్యక్రమానికి మద్దతివ్వటం లేదని ప్రకటించారు. అయితే అదొక ప్రైవేటు కార్యక్రమం కావడం వల్ల దాన్ని రద్దుచేసే అధికార పరిధి నగర ప్రభుత్వానికి ఉందా అన్నది వేరే ప్రశ్న అని ఆయన పేర్కొన్నారు. కానీ ఆరెస్సెస్ గురించిన తన అభిప్రాయాలను బహిరంగంగానే వ్యక్తం చేశారు. మమ్దాని గుజరాత్ రాష్ట్ర వారసత్వం కలిగినవారు. భారతదేశానికి సంబంధించిన అవగాహన ఉన్నవాడు. ఆయన ఏమన్నారంటే, 'తన కుటుంబం తనకు నేర్పిన భారతదేశం, తాను పెరిగిన భారతదేశం "బహుళత్వ సమాజం, లౌకిక గణతంత్రం" అని, భారత

**సార్వత్రిక ఏకతా ఉత్సవమని దానికి పేరుపెట్టటం మరీ విడ్డూరంగా ఉంది. అయితే వారి ఏకత కేవలం మతపరమైన ఏకతకు సంబంధించింది కావచ్చు. వీళ్లు అసలు మనుషుల ఐక్యతను ఎప్పుడూ కోరుకోరు. వీరి సిద్ధాంతంలోనే విభజన, విద్వేషం ఉంటుంది.**



దేశానికి చెందిన ప్రతి వ్యక్తికీ ఆ దేశంలో తనదైన స్థానం, హక్కు, గౌరవం ఉందనే భావనతో తాను పెరిగానని చెప్పారు. ఒక దేశం ఎవరిది? అనే ప్రశ్నకు సమాధానం ఒకే మతం, ఒకే వర్గం, ఒకే గుర్తింపుగా మారకూడదని, ఏ దేశాన్నయినా ఇతరులను వెలివేసే, పక్కనపెట్టే దృక్పథంతో చూడటం తనకు ఆందోళన కలిగించే విషయమని, అందుకే ఆరెస్సెస్ కార్యక్రమానికి మద్దతు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు.

# జాతీయం-అంతర్జాతీయం

# మాయమైన ఓట్లు

- ఢిల్లీలోనే 33 శాతం ఓటర్ల పేర్లు తొలగింపు
- తెలంగాణలోనూ 21.7 శాతం కోత
- దేశవ్యాప్తంగా 13.37 కోట్ల ఓట్లు గల్లంతు
- డ్రాఫ్ట్ జాబితాలతో ప్రజాస్వామ్యానికి కొత్త చిక్కులు
- సాధారణ పౌరుడి పైనే అదనపు భారం
- ప్రభుత్వ యంత్రాంగం చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు
- ఓట్లులేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటూ ఆదేశాలు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 02 (ఎ.ఎం.ఎస్):** ఓటు అనేది ప్రజాస్వామ్యంలో పౌరుడి అత్యంత కీలకమైన హక్కు. కానీ ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో కోట్లాది మంది పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి మాయమవుతున్నాయి. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 13.37 కోట్ల మంది పేర్లు తొలగించగా.. ఢిల్లీలో ఏకంగా 32.8 శాతం, తెలంగాణలో 21.7 శాతం ఓటర్ల పేర్లకు కోత పడటం ఆందోళన కలిగిస్తోంది. తొలగించబడిన ఓటర్లు తిరిగి తమ పేర్లను చేర్చుకోవడానికి ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలపై ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ భారీ స్థాయిలో పేర్ల తొలగింపునకు దారితీసింది. మూడు దశల్లో ఇప్పటివరకు 13.37 కోట్ల మంది ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ రోల్స్ నుంచి తొలగించబడ్డాయి. ఇది సర్‌కు ముందు ఉన్న ఓటర్ల సంఖ్యతో పోలిస్తే 14.1 శాతం. తాజాగా మూడో దశలో ఢిల్లీ, మహారాష్ట్ర డ్రాఫ్ట్ wఓటర్ల జాబితాలు విడుదల కావడంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. ఢిల్లీలో 1.45 కోట్ల మంది ఓటర్లలో 47.7 లక్షల పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో కనిపించలేదు. మహారాష్ట్రలో 9.78 కోట్ల నుంచి 7.71 కోట్లకు ఓటర్ల సంఖ్య తగ్గింది. ఎన్నికల సంఘం చేపట్టిన సర్‌లో ఓటర్లను కొత్తగా ధృవీకరించే ప్రక్రియను అమలు చేస్తున్నారు. ప్రతి నమోదైన ఓటరు నిర్దేశిత కాలంలో ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలి. అంతేకాకుండా గతంలో జరిగిన చివరి సర్ సమయంలోని ఓటర్ల జాబితాలో తమ పేరు లేదా తల్లిదండ్రుల పేర్లతో తమను తాము 'మ్యాప్' చేసుకోవాల్సి ఉంటుంది. అర్హతను నిరూపించేందుకు అవసరమైన పత్రాలను కూడా సమర్పించాల్సి ఉంటుంది.

అయితే ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ఓటు హక్కు పొందేందుకు ఇప్పటికే నమోదై ఉన్న పౌరుడే.. మళ్లీ తన అర్హతను నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఎందుకు? పేరు తొలగించడం సులభంగా జరిగి, తిరిగి చేర్చుకోవాల్సిన బాధ్యత మాత్రం పౌరుడిపైనే పడితే.. పేదలు, వలస కార్మికులు, వృద్ధులు, నిరక్షరాస్యులు, పత్రాలు సరిగా లేని కుటుంబాల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో పరిస్థితి అత్యంత తీవ్రంగా కనిపిస్తోంది. సర్‌కు ముందు 1.45 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. డ్రాఫ్ట్ రోల్‌లో వారి సంఖ్య 97.53 లక్షలకు పడిపోయింది. అంటే దాదాపు 47.7 లక్షల మంది పేర్లు ఓటరు జాబితాలో లేవు. తొలగింపుల్లో 29.86 శాతం మంది గైర్హాజరు, వలస వెళ్లినవారు, ఇతర కారణాల కింద ఉన్నారు. మొత్తంగా 32.8 శాతం ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితా నుంచి తొలగించబడ్డాయి. దేశ రాజధానిలోనే ఇంత భారీ స్థాయిలో ఓటర్ల జాబితా మారడం సహజంగానే తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. సర్ ప్రభావం తెలంగాణపైనా గణనీయంగానే పడింది. ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం తెలంగాణలో 21.7 శాతం ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయి. అంటే ప్రతి ఐదుగురు ఓటర్లలో ఒకరి పేరు డ్రాఫ్ట్ జాబితాలో లేదన్నమాట.

మహారాష్ట్రలో సర్‌కు ముందు 9.78 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. డ్రాఫ్ట్ జాబితాలో ఆ సంఖ్య 7.71 కోట్లకు పడిపోయింది. అంటే సుమారు 2.07 కోట్ల మంది ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో లేవు. మహారాష్ట్ర ఎన్నికల సంఘం వివరాల ప్రకారం 3.56 శాతం మంది మరణించినవారిగా, 15.78 శాతం మంది శాశ్వతంగా వలస వెళ్లిన, గైర్హాజరు లేదా ఇతర కేటగిరీలుగా, 1.81 శాతం మంది ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైనవారిగా గుర్తించబడ్డారు. మొత్తంగా 21.1 శాతం మేర ఓటర్ల సంఖ్య తగ్గింది. ఎన్నికల సంఘం ప్రకారం డ్రాఫ్ట్ జాబితాలో తప్పుగా పేరు తొలగించబడిన వారు తుది జాబితాలో పేరు చేర్చుకోవడానికి ఒక నెలలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఇక్కడ ఎదురవుతున్న ప్రశ్న.. ఈ సమాచారం ప్రతి ఓటరుకూ చేరుతుందా? గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వృద్ధులు, వలస కార్మికులు, పేదలు, డిజిటల్ సౌకర్యాలు లేని కుటుంబాలు, సరైన పత్రాలు లేని వారు ఈ ప్రక్రియను సులభంగా పూర్తి చేయగలరా? పేరు తొలగించబడిన విషయం తెలియకపోతే? అప్లికేషన్ గడువు ముగిసిపోతే? అలాంటప్పుడు ఎన్నికల రోజున తమ ఓటు హక్కు కోల్పోయిన పౌరుడికి పరిహారం ఏమిటి? ఇవే ఇప్పుడు ప్రజాస్వామ్య పరిరక్షణపై కీలక ప్రశ్నలుగా మారుతున్నాయి.

ఇక్కడే రాజకీయ ప్రశ్న కూడా ముందుకు వస్తోంది.


ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంస్కరణలు, పారదర్శకత, 'ఒక దేశంఒక ఎన్నిక' వంటి అంశాలను పదేపదే ప్రస్తావిస్తోంది. అయితే అదే సమయంలో కోట్లాది మంది ఓటర్ల పేర్లు ఒకేసారి డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగించబడటం 'సర్' ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. ఎన్నికల్లో గెలవడం ఎంత ముఖ్యమో.. ఓటర్ల హక్కును కాపాడటం అంతకంటే ముఖ్యమని కేంద్రంలోని మోడీ సర్కారు గుర్తించాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు చెప్తున్నారు. ఎందుకంటే ఒక నకిలీ ఓటును తొలగించడం ప్రజాస్వామ్య పరిరక్షణ అయితే.. ఒక నిజమైన ఓటును తొలగించడం ప్రజాస్వామ్య హక్కుపై దెబ్బగా వారు అభివర్ణిస్తున్నారు. దేశవ్యాప్తంగా మూడు దశల్లో ఇప్పటివరకు 13.37 కోట్ల పేర్లు డ్రాఫ్ట్ రోల్స్ నుంచి తొలగించబడ్డాయి.

**అత్యధిక తొలగింపు శాతం ఈ కింది విధంగా ఉంది...**

ఢిల్లీ - 32.8 శాతం
దాద్రానగర్ హవేలీ,
డామన్‌డయ్యూ - 29.6 శాతం
తెలంగాణ - 21.7 శాతం
మహారాష్ట్ర - 21.1 శాతం
అండమాన్ అండ్ నికోబార్ - 20.6 శాతం

# బాధ్యతగా ఉండాల్సిందే..

- జవాబుదారీతనంతో పని చేయాల్సిందే...
- అవినీతిపై ఉక్కు పాదం మోపుతాం
- చైనా అధినేత షీ జిన్‌పింగ్ హెచ్చరిక



**బీజింగ్, సెప్టెంబరు 02:** తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించని అధికారులు జవాబుదారీగా ఉండాల్సిందేనని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) అధినేత షీ జిన్‌పింగ్ స్పష్టం చేశారు. అధికారానికి తగ్గట్టుగా తగిన బాధ్యతతో పని చేయాలని సూచించారు. చైనాలో అధికారుల పనితీరు, బాధ్యతలపై ఆయన మరోసారి హెచ్చరికలు చేశారు. చైనా కమ్యూనిస్ట్ పార్టీ స్వీయ పాలనకు (సెల్ఫ్ గవర్నెన్స్) సంబంధించిన అంశంపై జిన్‌పింగ్ రాసిన ప్రత్యేక వ్యాసంలో ఈ వ్యాఖ్యలు చేసినట్టు ప్రభుత్వ ఆధీనంలోని షిన్హువా వార్తా సంస్థ తెలిపింది. 'అధికారం ఎక్కడ ఉంటుందో అక్కడ దానికి సమానమైన బాధ్యత ఉండాలి.

తమ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైన ప్రతి ఒక్కరినీ కచ్చితంగా జవాబుదారీ చేయాల్సిందే' అని జిన్‌పింగ్ నొక్కి చెప్పారు. పార్టీ స్వయం పాలన పూర్తి స్థాయిలో అమలు కావడానికి పక్కా లక్ష్యంతో కూడిన, సమర్థవంతమైన జవాబుదారీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాంతాలు, ప్రభుత్వ విభాగాల్లో పార్టీ స్వీయ పాలనను కఠినంగా అమలు చేసే విషయంలో ఆయా పార్టీ సంస్థలు, ముఖ్యంగా కీలక అధికారులు ప్రాథమిక బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు. అన్ని స్థాయిల్లోని ఉన్నతాధికారులు తమ బాధ్యతల్ని కచ్చితంగా నిర్వర్తించడంతో పాటు ప్రభుత్వ వ్యవస్థలో నైతికత, క్రమశిక్షణతో కూడిన వాతావరణాన్ని పెంపొందించాలని అన్నారు.

షీ జిన్‌పింగ్ తాజాగా చేసిన హెచ్చరికను ఆయన 2012 సమయంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొనసాగిస్తున్న కఠినమైన అవినీతి వ్యతిరేక ప్రచారానికి కొనసాగింపుగా భావిస్తున్నారు. దీనికి సంబంధించి గత కొన్నేండ్లలో అవినీతి ఆరోపణల పేరుతో వేలాది మంది పౌర, సైనిక అధికారుల్ని ఆయన పదవుల నుంచి తొలగించారు. కొందరు శిక్షలు కూడా ఎదుర్కొన్నారు. అయితే ఈ తాజా హెచ్చరిక కేవలం అవినీతిని అరికట్టడానికి మాత్రమే పరిమితం కాకుండా, అధికారులు తమ పని తీరులో మంచి ఫలితాలు రాబట్టాలనే దిశగా ఒత్తిడిని పెంచే ప్రయత్నంగా కూడా కనిపిస్తోంది. జిన్‌పింగ్ ప్రస్తుతం చైనా కమ్యూనిస్ట్ పార్టీకి, అలాగే సైన్యానికి అధినేతగా ఉన్నారు. ఆయనను పార్టీలో ఫౌండర్ మావో జెడాంగ్ తర్వాత కీలకమైన కోర్ లీడర్‌గా పేర్కొంటున్నారు. ఈయన ఇప్పటికే మూడోసారి పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆయనకు ముందు చైనా అధ్యక్షులు సాధారణంగా ఐదేండ్ల పదవీ కాలం రెండు సార్లు చేపట్టిన తర్వాత పదవి నుంచి తప్పుకునే సంప్రదాయం ఉండేది. జిన్‌పింగ్ మాత్రం ఆ సంప్రదాయానికి స్వస్తి చెప్పి మూడోసారి అధికారంలో కొనసాగుతున్నారు. వచ్చే ఏడాది జరిగే కమ్యూనిస్ట్ పార్టీ ఐదేండ్లకోసారి నిర్వహించే కాంగ్రెస్‌లో ఆయన నాలుగోసారి అధ్యక్ష పదవి కోసం ప్రయత్నించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఈ నేపథ్యంలో అధికారులు తమ బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిన్‌పింగ్ చేస్తున్న వరుస హెచ్చరికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



# రామమందిర ట్రస్ట్ మొట్టమొదటి సీఈవోగా జితేంద్ర మిశ్రా

- క్లిష్ట సమయంలో కీలక బాధ్యతలు

**లక్నో, సెప్టెంబరు 02 (ఎ.ఎం.ఎస్) :** రామమందిర ట్రస్ట్ మొట్టమొదటి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) జితేంద్ర మిశ్రా ఎంపికయ్యారు. భారత వైమానిక దళంలో పలు కీలకమైన కమాండింగ్ బాధ్యతలు నిర్వహించిన ఈ మాజీ అధికారి, 'ఆపరేషన్ సింధూర్' సమయంలో వెస్ట్రన్ కమాండ్ అధిపతిగా వ్యవహరించారు. అయోధ్య విరాళాల చోరీకి సంబంధించిన వివాదంతో తీవ్రంగా దెబ్బతిన్న ఆలయ నిర్వహణ, ఆర్థిక జవాబుదారీతనాన్ని పటిష్టం చేయాల్సిన కీలక బాధ్యత ఇప్పుడు ఆయనపై ఉంది. ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) మిశ్రా 1986 డిసెంబర్‌లో భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా నియమితులయ్యారు. 38 ఏళ్లకు పైగా సేవలందించిన అనంతరం, ఆయన 2026 మేలో భారత వైమానిక దళం నుండి పదవీ విరమణ చేశారు. ఆయన పూణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ, బెంగళూరులోని ఎయిర్ ఫోర్స్ టెస్ట్ పైలట్స్ స్కూల్, అమెరికాలోని ఎయిర్ కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజ్, యూకేలోని రాయల్ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ పూర్వ విద్యార్థిగా ఉన్నారు.

# ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలి

- డిసెంబర్‌లో జైల్‌భరో ఆందోళన
- బద్లావ్ జరూరీ' ర్యాలీలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 02 (ఎ.ఎం.ఎస్) :** బద్లావ్ జరూరీ హై ('మార్పు అనివార్యం') అనే నినాదంతో మంగళవారం సీపీఐ నిర్వహించిన 'ఢిల్లీ చలో' ర్యాలీలో దేశవ్యాప్తంగా భారీగా కార్యకర్తలు,

ప్రజలు కదంతొక్కారు. ర్యాలీలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాగ్రహం వెల్లువెత్తింది. ఆర్ఎస్ఎస్‌బీజేపీ పాలనకు వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని నేతలు పిలుపునిచ్చారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అమర్‌జీత్ కౌర్, అన్నీ రాజా, ప్రకాశ్ బాబు, ఎంపీ పి సంతోష్ కుమార్, కె రామకృష్ణ తదితరులు ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. దేశం నలుమూలల నుంచి వేలాది మంది కార్యకర్తలు అణచివేత, వరదలు, ప్రతికూల వాతావరణం, సుదీర్ఘ ప్రయాణాలను అధిగమించి ఢిల్లీకి చేరుకుని ఆర్ఎస్ఎస్‌బీజేపీ పాలనకు వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపించారని డి రాజా అభినందించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ఏలుబడిలో దేశంలో సంక్షోభంలో కూరుకుపోయిందని, ఈ విపత్కర పరిస్థితి నుంచి దేశాన్ని బయటపడేయాలంటే రాజకీయ మార్పు అనివార్యమని ఆయన అన్నారు. దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సంక్షోభం తీవ్రమవుతున్నాయని, కార్మికుల హక్కులపై దాడులు, ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచడం, విద్య, వైద్య రంగాల వాణిజ్యకరణతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్‌బీజేపీ రాజ్‌ను ఓడించేందుకు ప్రజలంతా మరోసారి ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం, లౌకిక ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం, మెరుగైన భారత దేశం నిర్మాణం కోసం నిరంతర ఉద్యమానికి ఇది ఆరంభమన్నారు. మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని, వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టబద్ధ హామీ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించాలని, బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికల నిర్వహణను పునరుద్ధరించాలని, దళితులు, ఆదివాసీలకు సామాజిక న్యాయం కల్పించాలని డిమాండ్ చేశారు. దేశ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో ప్రధాని మోడీ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ద్రవ్యోల్బణం ఎందుకు పెరుగుతోందో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా డిసెంబరు మొదటి వారంలో జైల్‌భరో ఆందోళన నిర్వహించనున్నట్టు సీపీఐ ప్రకటించింది. 'మార్పు అనివార్యం' పేరుతో చేపట్టిన ప్రచారాన్ని మరింత ఉధృతం చేయనున్నట్టు తెలిపింది. అక్టోబరు రెండున గాంధీ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాజా తెలిపారు.

అక్టోబరు సోషలిస్టు విప్లవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నవంబరు ఏడున కూడా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# ఆకస్మికంగా పిడుగుపాటు

- తృటిలో తప్పిన ప్రాణాపాయం
- అమెరికాలో ఘటన

**వాషింగ్టన్, సెప్టెంబరు 02 :**



అమెరికాలో ఆకస్మికంగా సంభవించిన పిడుగుపాటుకు తృటిలో ప్రాణపాయం తప్పింది. న్యూయార్క్‌లోని స్టాటెన్ ఐలాండ్‌కు చెందిన ఒక వ్యక్తి గత గురువారం దంతవైద్యుడిని కలిసేందుకు వెళ్తుండగా,

ఇంటికి కొద్ది దూరంలోనే అతని ముందు పిడుగు పడింది. ఈ ఘటన దృశ్యాలు అతని ఇంటి డోర్‌బెల్ కెమెరాలో రికార్డ్ అయినాయి. ఆ భయానక దృశ్యం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎన్.బీ.సీ.న్యూస్ ప్రకారం, థామస్ ఫహ్మీ అనే వ్యక్తి న్యూయార్క్ లోని విండ్సర్ రోడ్ సమీపంలోని టోడ్ట్ హిల్ రోడ్ వెంబడి... తన ఇంటి ముందు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో అడుగుల దూరంలో అకస్మాత్తుగా ఆకాశం నుంచి పిడుగుపడింది. ఈ పిడుగు ధాటికి ఫహ్మీ కిందపడిపోయాడు. కరెంట్ షాక్ మాదిరిగా అతని బాడీ షేక్ అయిపోయింది. కొద్ది సమయం తర్వాత అతనే స్వయంగా లేచి నెమ్మదిగా నడుచుకుంటూ ఇంట్లోకి ప్రవేశించాడు. గమనించిన కుటుంబసభ్యులు ఫహ్మీని నార్త్‌వెల్ స్టేటెన్ ఐలాండ్ యూనివర్శిటీ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ అతన్ని రాత్రంతా వైద్యులు పర్యవేక్షించారు. ఎలాంటి హానికరమైన గాయాలు కాకపోవడంతో కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

# బస్సుల్లో పానిక్ బటన్లు కచ్చితంగా ఉండాల్సిందే

- కిటికీలకు పరదాలు కూడా ఉండొద్దు
- ఢిల్లీ సర్కారు సంచలన నిర్ణయం
- ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరిక

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 02 (ఎ.ఎం.ఎస్):** దేశ రాజధాని ఢిల్లీలో కదులుతున్న స్లీపర్ బస్సులో మైనర్ బాలికపై డ్రైవర్, కండక్టర్ దారుణంగా సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం అందరికీ తెలిసిందే. ఈ ఘటనతో అప్రమత్తమైన ఢిల్లీ సర్కారు మంగళవారం రోజు సంచలన నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా పబ్లిక్, ప్రైవేట్ బస్సుల్లో ప్రయాణికులు, మహిళల రక్షణకు సంబంధించిన నిబంధనలను అత్యంత కఠినతరం చేసింది. ఢిల్లీలో నడిచే స్థానిక బస్సులతో పాటు



ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అన్ని బస్సుల్లోనూ.. పానిక్ బటన్లు కచ్చితంగా పని చేయాల్సిందేనని, అలాగే కిటికీలకు పర్దాలు కూడా ఉంచకూడదని స్పష్టం చేసింది.

ఆగస్టు 4వ తేదీ రాత్రి గ్రేటర్ నోయిడాలో బస్సు ఎక్కిన మైనర్ బాలికపై డ్రైవర్, కండక్టర్ అత్యాచారానికి పాల్పడ్డారు. దాడి అనంతరం బాధితురాలిని దాదాపు 40 కిలో మీటర్ల దూరంలో ఉన్న కాశ్మీరీ గేట్ సమీపంలో పడేసి పారిపోయారు. ఈ ఘటన జరిగిన బస్సు కిటికీలకు లోపలి దృశ్యాలు బయటకు కనిపించకుండా ఉండేందుకు కిటికీల పర్దాలు కప్పి ఉంచడం, అలాగే నిబంధనల ప్రకారం పనిచేసే సీసీటీవీ కెమెరా వ్యవస్థ లేకపోవడం నేరస్థులకు కలిసివచ్చింది. 2012 నాటి నిర్భయ ఘటన జ్ఞాపకాలను మళ్లీ గుర్తు చేసిన ఈ ఉదంతంతో.. ఢిల్లీ ప్రభుత్వం తక్షణమే మేల్కొని నిబంధనలను కఠినతరం చేసింది.

నూతన నిబంధనల ప్రకారం.. బస్సు కిటికీలకు ఉండే పర్దాలు, నిబంధనలకు విరుద్ధంగా వేసే విండో ఫిల్మ్‌లను పూర్తిగా నిషేధించారు. విండ్‌షీల్డ్, వెనుక అద్దాలు, పక్క కిటికీల పారదర్శకత చట్టబద్ధంగా ఉండాల్సిందే. బస్సుల్లో వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ డివైజ్‌లు, పానిక్ బటన్లు నిరంతరం పనిచేసే స్థితిలోనే ఉండాలని ఆదేశించారు. ప్రయాణికులకు సులభంగా అందుబాటులో ఉండేలా పానిక్ బటన్లను అమర్చాలి. వీటితో పాటు పని చేసే అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స కిట్లు ప్రతి బస్సులో ఉండటం తప్పనిసరి చేశారు. రాత్రి సమయాల్లో లేదా సర్వీసులో లేనప్పుడు వెలుతురు ఉండే సురక్షిత ప్రాంతాల్లోనే బస్సులను పార్క్ చేయాలి.

డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, మద్యం లేదా ఇతర మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వం పేర్కొంది. బస్సు డ్రైవర్లు, కండక్టర్లు విధిగా సంబంధిత లైసెన్సులు, యూనిఫాం, పీఎస్వీ బ్యాడ్జీలను కలిగి ఉండాలి. విధుల్లో చేర్చుకునే ముందే వారి బ్యాగ్రౌండ్‌ను యజమానులు సరిచూసుకోవాలని తెలిపిది. బస్సు కదులుతున్న సమయంలో తలుపులన్నీ మూసి ఉంచాలని వెల్లడించింది.

ఎవరైనా మహిళ పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తించినా.. వేధింపులకు గురిచేసినా బస్సు సిబ్బంది వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు లేదా పీసీఆర్ వ్యాన్‌కు సమాచారం అందించి బస్సును అక్కడికి తరలించాలి. నిబంధనలను కాగితాలకే పరిమితం చేయకుండా కచ్చితంగా అమలు చేస్తామని, ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు పర్మిట్లను రద్దు చేస్తామని రవాణా శాఖ మంత్రి డాక్టర్ పంకజ్ కుమార్ సింగ్ హెచ్చరించారు.



# యాపిల్ కొత్త సీఈవోగా జాన్ టెర్నస్

- సంస్థలో పలు కీలక మార్పులు

**న్యూయార్క్, సెప్టెంబరు 02 :** యాపిల్ కొత్త సీఈఓగా జాన్ టెర్నస్ బాధ్యతలు చేపట్టారు. దీంతో సంస్థలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. టెర్నస్ సీఈఓగా.

. టిమ్ కుక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కొత్త బాధ్యతల్లోకి వెళ్లారు. ఈ ఇద్దరి కొత్త వేతన ప్యాకేజీలను యాపిల్ వెల్లడించింది. కొత్త సీఈఓ జాన్ టెర్నస్‌కు ఈ ఆర్థిక సంవత్సరానికి దాదాపు 58 మిలియన్ డాలర్ల ప్యాకేజీ అందుతుంది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.551 కోట్లు. ఇందులో 3 మిలియన్ డాలర్లు వార్షిక వేతనం. వచ్చే ఆర్థిక సంవత్సరానికి 55 మిలియన్ డాలర్ల విలువైన షేర్లు కూడా ప్యాకేజీలో ఉన్నాయి.మరోవైపు టిమ్ కుక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా సుమారు 47 మిలియన్ డాలర్లు అందుకోనున్నారు. ఇందులో 2 మిలియన్ డాలర్లు వేతనం. మరో 45 మిలియన్ డాలర్ల విలువైన షేర్లు ఉన్నాయి. సీఈఓగా ఉన్నప్పుడు కుక్‌కు 3 మిలియన్ డాలర్ల వార్షిక వేతనం ఉండేది.

# నిరసనకారులపై జల ఫిరంగులు

- కేరళలో పోలీసుల దుశ్చర్య

**తిరువునంతపురం, సెప్టెంబరు 02 (ఎ.ఎం.ఎస్ :** కేరళలో స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆందోళన చేపట్టింది. కేరళ విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక ప్రదర్శన సందర్భంగా కేంద్ర కమిటీ సభ్యుడు ఆర్య ప్రసాద్, రాష్ట్ర సచివాలయ సభ్యురాలు వైష్ణవి షాజీతో సహా తమ విద్యార్థి నాయకులపై పోలీసులు దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని తిరువనంతపురంలోని కేరళ సచివాలయం వరకు పాదయాత్ర నిర్వహించింది. ఆ ఘర్షణలో తమ సభ్యులపై పోలీసులు మితిమీరిన బలప్రయోగం చేశారని,వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేసింది. సచివాలయం వైపు సాగుతున్న నిరసనకారులను నిలువరించడానికి పోలీసులు వాటర్ ఫిరంగులు ప్రయోగించారు. పలువురిని అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించారు.



# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## భూముల రీ-సర్వే, డిజిటల్ క్రాప్ సర్వేలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**– ఐనవోలు మండలంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి క్షేత్రస్థాయి పర్యటన**



**హనుమకొండ, సెప్టెంబర్ 2 (వుదయం ప్రతినిధి):** హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని, దాని అనుబంధ గ్రామం చింత కుంటలలో బుధవారం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. అక్కడ కొనసాగుతున్న భూముల రీసర్వేతో పాటు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న డిజిటల్ క్రాప్ సర్వేను ఆమోదపూర్వకంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. భూముల రీసర్వే 15 రోజుల్లో పూర్తి కావాలిపంథిని గ్రామంలో మొత్తం 3,541 ఎకరాల భూమికి గానూ ఇప్పటి వరకు 2,144 ఎకరాల్లో రీసర్వే పూర్తయినట్లు సర్వేయర్లు కలెక్టర్ కు వివరించారు. రోవర్ల ద్వారా సర్వే ప్రక్రియ జరుగుతున్న తీరును, గ్రామంలో పురోగతిని కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాజిరెడ్డి, రామరాజు, సంపత్ రెడ్డి తదితర రైతులతో నేరుగా మాట్లాడి వారిఅభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. రీసర్వేతో భూ సరిహద్దులు, విస్తీర్ణంపై స్పష్టత వస్తుందని, భవిష్యత్తులో భూ వివాదాలు ఉండవని కలెక్టర్ తెలిపారు. మిగిలిన రీసర్వేను మరో 15 రోజుల్లో పూర్తి చేయాలని, వివరాలను వెంటనే ల్యాండ్ పార్సల్ మ్యాప్లో నమోదు చేయాలని సర్వేయర్లను ఆదేశించారు. డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలిఅనంతరం చింతకుంట గ్రామంలో జరుగుతున్న డిజిటల్ క్రాప్ సర్వేను కలెక్టర్ పరిశీలించారు. సర్వే నంబర్ల వారీగా పంటల వివరాల నమోదు, జియో మ్యాపింగ్, ఫోటోల అప్‌లోడ్ ప్రక్రియను జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర కలెక్టర్ కు వివరించారు. నమోదయ్యే పంట వివరాలు భవిష్యత్తులో రైతులకు వివిధ వ్యవసాయ ఫలాలు, సేవలు అందడానికి ప్రామాణికంగా మారతాయని, కాబట్టి ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా యాప్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఇన్‌చార్జి ఏడీఏ రాజ్‌కుమార్, వ్యవసాయ అధికారి సునీల్, గ్రామ సర్పంచ్ శ్రీరాం భూపాల్ పాల్గొన్నారు.

## ల్యాప్‌టాప్‌లను ప్రారంభించిన మంత్రి సీతక్క

**సాంకేతిక పరిజ్ఞానంతోనే ప్రగతి**



మంగపేట/ములుగు సెప్టెంబర్ 02 వుదయం ప్రతినిధి) : విద్యార్థినులు పాఠశాల స్థాయి నుంచే సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ, ఉన్నత లక్ష్యాలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. బుధవారం మంగపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 'బాలవికాస' స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన 14 ల్యాప్‌టాప్‌లతో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సాంకేతికత పై పట్టు, ఉన్నత చదువుల్లో డిజిటల్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, విద్యార్థినులు ల్యాప్‌టాప్‌ల సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కన్నాయిగూడెం కేజీబీవీ విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించిన తీరును గుర్తుచేస్తూ, ప్రణాళికాబద్ధంగా చదివి విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వసతుల పరిశీలన, పాఠశాలలో భోజనం నాణ్యత, పారిశుద్ధ్యం, నీటి సరఫరాపై విద్యార్థినులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. భద్రత, ఆరోగ్యం, అనుమతి లేకుండా ఒంటరిగా బయటకు వెళ్లవద్దని, భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. శ్రమదానం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పండ్ల మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, జీసీడీఓ బుర్ర రజిత, ఎంఈఓ మేనక, ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## కార్యాలయ భవనాలు ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు చేయాలి



**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జయశంకర్ భూపాలపల్లి సెప్టెంబర్ 02(వుదయం ప్రతినిధి):** ఫైర్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయ భవనాలు ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మహదేవపూర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫైర్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. మౌలిక వసతులు, పార్కింగ్ సౌకర్యం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫైర్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్, అత్యవసర సమయాల్లో ఫైర్ ఇంజన్లు, విపత్తు నిర్వహణ వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా పార్కింగ్, ప్రాంగణం అనువుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఈఈ విద్యాసాగర్, ఎంపిడిఓ రవీంద్ర నాథ్, అగ్నిమాపక అధికారి నాగరాజు, డిటి యూసఫ్ పాల్గొన్నారు.

## గాంధీజీ సిద్ధాంతాలు ప్రపంచానికే మార్గదర్శనం

**– అదనపు జిల్లా కలెక్టర్ అనిల్ కుమార్**



**మహబూబాబాద్, సెప్టెంబర్ 02 (వుదయం ప్రతినిధి) :** గాంధీజీ చూపిన అహింసా, శాంతి మార్గాలు ప్రపంచ దేశాలకే మార్గదర్శనమని, ప్రస్తుత యాంత్రిక జీవనంలో మళ్లీ 'గాంధీ ఇజం' అవసరం ఎంతైనా ఉందని మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లో 'గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న "గాంధీజీ మాసోత్సవాల" పోస్టర్లు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య సంగ్రామం నుంచి తెలంగాణ ఉద్యమం వరకు అహింసా మార్గంలోనే విజయాలు సాధించామని, ప్రపంచ శాంతి ఉద్యమాలకు మహాత్ముడే ఆదర్శమని అన్నారు. ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో పెరుగుతున్న హింస, అవినీతి వంటి సమస్యలకు గాంధీజీ ఆలోచనలే సరైన పరిష్కారమని తెలిపారు. విద్యార్థులను కౌమార దశ నుంచే సరైన మార్గంలో నడిపించేందుకు గత 20 ఏళ్లుగా ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా విద్యార్థులకు "ప్రపంచ శాంతి గాంధీ మార్గం" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, అక్టోబర్ 2న కలెక్టర్ల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి రాజేంద్రప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్, మధు పాల్గొన్నారు.

## క్యాంప్ ఆఫీస్‌పై బీజేపీ దాడి హేయమైన చర్య

### ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 02 (వుదయం ప్రతినిధి) :** భువనగిరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై నిన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడిన ఘటనను భువనగిరి ఎమ్మెల్యే శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఈరోజు క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేగారు మాట్లాడుతూ, "క్యాంప్ ఆఫీస్‌పై దాడి చేయడం హేయమైన చర్య.. ఇది రాజకీయం కాదు.. ప్రజాస్వామ్యంపై దాడి" అని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు చేయాలని, ప్రత్యర్థులపై నిర్మాణాత్మక విమర్శలు చేయాలి తప్ప దాడులు, హింసకు పాల్పడటం ప్రజాస్వామ్య సంస్కృతి కాదని అన్నారు. మారణాయుధాలతో క్యాంప్ కార్యాలయంపై దాడి చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా వేదిక అని, భువనగిరిలో ఇలాంటి దాడుల సంస్కృతి గతంలో ఎన్నడూ లేదన్నారు.

బీజేపీపై ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు

ఢిల్లీ నుంచి అమిత్ షా డైరెక్షన్‌లో బండి సంజయ్ మరియు బీజేపీ నాయకులు గుండా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. "ఇన్ని రోజులు మేము సంయమనం పాటించాం.. మా ఓపికను బలహీనతగా భావించొద్దు. హద్దులు దాటితే ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే గట్టిగా సమాధానం చెబుతాం" అని హెచ్చరించారు. ఇటీవల నల్గొండలో మంత్రి ఇంటిపై జరిగిన దాడిని కూడా ప్రస్తావిస్తూ, బీజేపీ హింసాత్మక రాజకీయాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. "చెప్పేది రాముడి పేరు.. చేసేది రావణకాండ" అన్న రీతిలో బీజేపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. నిన్నటి ఘటన అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించారని, ఈరోజు క్యాంప్ కార్యాలయాన్ని గోపంచకంతో శుద్ధి చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హింసకు ఎప్పటికీ తలొగ్గదని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు

బీఆర్ఎస్‌పై కూడా ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "తెలంగాణలో 1000 రోజుల దగా" అంటూ బీఆర్ఎస్ మరో కొత్త రాజకీయ నాటకానికి తెరతీసిందని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే అబద్ధాలు, అసత్య ప్రచారాలను మానుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన వైఫల్యాలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని, ప్రజా సమస్యలపై చర్చించకుండా రాజకీయ నాటకాలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్ ఒక్కరోజు కూడా అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రజా సమస్యలకు దూరంగా ఉండటం సరికాదని విమర్శించారు. ప్రజల కోసం పని చేయని కేసీఆర్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. "అబద్ధాలకు అడ్రస్ అంటేనే బీఆర్ఎస్" అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిర్మాణాత్మక విమర్శలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, అయితే హింస, దాడులు, బెదిరింపులను మాత్రం సహించేది లేదని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి-రవికుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, పట్టణ కౌన్సిలర్లు, pacs చైర్మన్లు, డైరెక్టర్స్, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కోఆప్షన్ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, డీసీసీ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ అనుబంధ విభాగాల నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, సెప్టెంబర్ 02 (వుదయం ప్రతినిధి) :** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. బుధవారం రఘునాథపల్లి మండలం గిద్దెబండ తండా గ్రామ పంచాయతీ కార్యాలయం, నర్మెట్ట మండలం బొమ్మకూర్ ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఓటర్ల వివరాల పరిశీలన, మ్యాపింగ్, దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించిన ఆయన బీఎల్‌వోల పనితీరు, నోటీసుల జారీపై తహసీల్దార్లతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. రాతపూర్వక ధ్రువీకరణ: అభ్యర్థులు సమర్పించే జిరాక్స్ ప్రతులపై తప్పనిసరిగా సంబంధిత వ్యక్తుల సంతకాలు తీసుకోవాలి. పక్కా పరిశీలన, ఓటర్ల ఇళ్ల పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలను పాత రికార్డులతో సరిపోల్చుకుని ఎలాంటి పొరపాట్లు లేకుండా నిశితంగా పరిశీలించాలి. అవగాహన కల్పన, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా ప్రజల్లో అవగాహన పెంచి, వచ్చిన అభ్యంతరాలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి. అప్రమత్తత, క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తూ నిష్పక్షపాతంగా, ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీకి కృషి చేయాలి. ఈ కార్యక్రమంలో రఘునాథపల్లి, నర్మెట్ట తహసీల్దార్లు రాజేష్, కె.వి. చారి, రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## సైబర్ జాగ్రత్తలపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

**– పోలీస్ కమిషనర్ ఎస్ శ్వేత**



**వరంగల్ క్రైం, సెప్టెంబర్ 02 (వుదయం ప్రతినిధి) :** వినాయక చవితి పండగను పురస్కరించుకుని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన 'వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు' అవగాహన పోస్టర్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎస్. శ్వేత, ఐపిఎస్ బుధవారం సీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ గణనాథుని ప్రతిరూపం నుంచి స్ఫూర్తి పొందుతూ జాగ్రత్తగా వినడం, నిశితంగా పరిశీలించడం, ఆలోచించి నిర్ణయం తీసుకోవడం ద్వారా సైబర్ మోసాల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ప్రజల భయం, అత్యాశ, తొందరపాటును సైబర్ నేరగాళ్లు ఆసరాగా చేసుకుంటున్నారని హెచ్చరించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు: గుర్తుతెలియని వ్యక్తుల కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు మరియు యాప్‌లకు దూరంగా ఉండాలి. బ్యాంక్ ఖాతా వివరాలు, డెబిట్/క్రెడిట్ కార్డ్ సమాచారం, పాస్‌వర్డ్‌లు, OTP మరియు PIN వంటి రహస్యాలను ఎవరితోనూ పంచుకోవద్దు. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, పెట్టుబడులు, తక్కువ వడ్డీ రుణాలు, లాటరీలు, ఉచిత బహుమతుల పేరిట వచ్చే ఆకర్షణీయ ప్రకటనలను నమ్మవద్దు. సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు, టూఫ్యాక్టర్ ఆథెంటికేషన్ (2FA) అమర్చుకోవాలి. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం ఏసీపీ వెంకటరమణ, సిఎసిబి 2 ఏసీపీ జానీ నర్సింహులు, ఎస్.ఐలు చరణ్, శివ పాల్గొన్నారు.

## నారాయణ కళాశాలలో సైబర్ క్రైమ్ పై డీఎస్పీ ప్రసన్న కుమార్ అవగాహన సదస్సు

**సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండండి - ఓటీపీలు షేర్ చేయొద్దు - తెలియని లింకులు క్లిక్ చేయొద్దు: డీఎస్పీ**



**సూర్యాపేట సెప్టెంబర్ 2: వుదయం ప్రతినిధి** సూర్యాపేట పట్టణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక నారాయణ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత మరియు ఉత్తమ ప్రవర్తనపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టౌన్ సీఐ వెంకటయ్య, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. డీఎస్పీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత సాంకేతిక కాలంలో విద్యార్థులు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని లింకులను క్లిక్ చేయ వద్దని, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను ఎవరికీ షేర్ చేయవద్దని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. టౌన్ సీఐ వెంకటయ్య మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని, మైనర్లు వాహనాలు నడపడం నేరమని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ఏరియాలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి

**– డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారం రాథోడ్**



**భద్రాచలం 2/9/26 వుదయం ప్రతినిధి** వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో వైరల్ ఫీవర్లతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సంబంధిత వైద్యాధికారులు, మలేరియా అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ తుకారం రాథోడ్ సూచించారు. ముందస్తు జాగ్రత్తలు, నిరంతర పర్యవేక్షణ, గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా సీజనల్ వ్యాధుల వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన పేర్కొన్నారు. బుధవారం భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి మలేరియా అధికారులు, ల్యాబొరేటరీ టెక్నీషియన్లు, ఎల్‌టీఎస్, ఎంటీఎస్‌లు, సాంకేతిక సహాయకులు, సంబంధిత వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అమలు చేయాల్సిన ప్రత్యేక కార్యక్రమాలు, మలేరియా మరియు డెంగ్యూ నివారణ చర్యలు, ప్రయోగశాల సేవల పనితీరు తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారం రాథోడ్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్నందున గ్రామాల్లో దోమల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందన్నారు. వర్షపు నీరు వివిధ ప్రాంతాల్లో నిల్వ ఉండటం, పరిసరాల పరిశుభ్రత లోపించడం వల్ల దోమలు అధికంగా వృద్ధి చెందే అవకాశం ఉంటుందని, వాటి ద్వారా మలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకరమైన వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని తెలిపారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు అవసరమని ఆయన అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలిన తర్వాత చర్యలు చేపట్టడం కంటే, వ్యాధులు రాకముందే నివారణ చర్యలు చేపట్టడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి వైద్యాధికారి తమ పరిధిలోని గ్రామాల పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యాత్మక గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యాధికారులు, మలేరియా అధికారులు, ఆరోగ్య సిబ్బంది, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు పరస్పర సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేస్తే ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో వైరల్ ఫీవర్లు, మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారం రాథోడ్ పేర్కొన్నారు. గిరిజన ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, ప్రతి సమస్యాత్మక గ్రామంలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాలని ఆయన ఆదేశించారు.

## మ్యాపింగ్ కానీ ఓటర్ల విచారణకు ప్రత్యేక కేంద్రాలు



**– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**

**హనుమకొండ,సెప్టెంబర్ 02 (వుదయం ప్రతినిధి) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోమ్యాపింగ్, అనామాలీస్ జాబితాలో ఉండి నోటీసులు అందుకున్న ఓటర్ల విచారణ కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. బుధవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఏఈఆర్ఓ విచారణ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూపశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 50 విచారణ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు అక్టోబర్ 18 లోగా సంబంధిత ధ్రువపత్రాలతో ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలను కలవాలని సూచించారు. పత్రాల పరిశీలన, ఓటర్లు సమర్పించిన వివరాలను తక్షణమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తూ, రిజిస్టర్‌లో సంతకాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారదర్శకత, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీల సహకారం: ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఈఆర్వో/ఆర్డీవో వెంకటేష్, ఏఈఆర్ఓ/తహసిల్దార్ రవీందర్ రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

## ఈ రాష్ట్రానికి రైతు ఒక కన్ను రైస్ మిల్లర్ మరో కన్ను

**రైస్ మిల్లర్ల జిల్లా అధ్యక్షులు కర్నాటి నారాయణ జనరల్ సెక్రటరీ రేపాల భద్రాద్రి రాములు**



**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 02** నల్గొండ పట్టణ కేంద్రంలో రామగిరి రోడ్డు వైపు ఉన్న రైస్ మిల్లర్ల భవనంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో రైస్ మిల్లర్ల అధ్యక్షులు నల్లగొండ జిల్లా అధ్యక్షులు కర్నాటి నారాయణ జనరల్ సెక్రటరీ రేపాల భద్రాద్రి రాములు మాట్లాడుతూ... బకాయిలు ఉన్న మిల్లులను చెక్ చేయండి మేము సహకరిస్తాం డిఫాల్టర్ మిల్లర్ల నుంచి బకాయిలు వసూలు చేయడంపై అభ్యంతరం లేదు బకాయిలు లేని మిల్లులను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు Inspection పేరుతో మిల్లర్లపై వేధింపులు ఆపాలి 90 శాతం మంది మిల్లర్లను దొంగలు, దోపిడీదారులుగా ముద్ర వేయడం సరికాదు 2014 నుంచి 2025 వరకు 9.70 కోట్ల టన్నుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు మిల్లర్ల సామర్థ్యానికి మించి 200 శాతం వరకు ధాన్యం దిగుమతి 7 లక్షల టన్నుల రబీ ధాన్యం మిల్లులకు కేటాయించారు మొదట బాయిల్డ్ రైస్ అంటారు ఇప్పుడు రా రైస్ మాత్రమే అంటున్నారుఆగస్టు 28 నుంచి బాయిల్డ్ రైస్ తీసుకోకుండా సీఎంఆర్ నిలిపివేశారు ఐదు రోజులుగా మిల్లులు బంద్. నెలరోజులు బంద్ అయితే 15-20 లక్షల నిర్వహణ భారం సీఎంఆర్ ఆలస్యమైతే 25 శాతం పెనాల్టీ 12 శాతం వడ్డీ ఎందుకు రా రైస్ ఇవ్వలేం.. ధాన్యం ప్రభుత్వమే తీసుకోవాలని కలెక్టర్‌కు లేఖ 202627 వానాకాలం ధాన్యాన్ని ప్రభుత్వ గిడ్డంగుల్లోనే భద్రపరచాలి.. టెస్ట్ మిల్లింగ్ తర్వాతే ధాన్యం కేటాయించాలి 2 లారీలు 67% రా రైస్.. 2 లారీలు 68% బాయిల్డ్ రైస్ ఇవ్వాలి Sortexలో భారీగా నష్టం వస్తోంది, ఖాళీ బస్తాల్లో ఖాప్రా పురుగు.. బియ్యం రిజెక్ట్ అవుతోంది 10, 20 రూపాయల వర్కింగ్ చార్జీలు 40 ఏళ్లుగా మారలేదుఏళ్ల తరబడి వర్కింగ్, ట్రాన్స్‌పోర్ట్, డ్రేజీ, కస్టోడియన్ చార్జీలు పెండింగ్ 202223 రబీ టెండర్ ధాన్యానికి చార్జీలు చెల్లించలేదుమళ్లీ మార్కెట్ ఫీజు కట్టాలంటూ ఒత్తిడి చేయడం సరికాదు మార్కెట్ లైసెన్సులు రెన్యూవల్ చేయకుండా మిల్లర్లను ఇబ్బంది పెట్టొద్దు 10 ఏళ్లుగా ఖాళీ బస్తాలు మిల్లుల్లోనే.. 25 శాతం వరకు డ్యామేజ్‌ఖాళీ బస్తాల లెక్కలు ఇప్పటికీ తేల్చలేదు ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్నట్టే మిల్లింగ్ చార్జీలు ఇవ్వాలి ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రైస్ మిల్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కర్నాటి నారాయణ జనరల్ సెక్రటరీ రేపాల భద్రాద్రి రాములు ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూలకంటి ఇంద్రారెడ్డి అధ్యక్షులు చిట్టిపోలు యాదగిరి జాయింట్ సెక్రటరీ కండె రామకృష్ణ , చిట్యాల సెంటర్ అధ్యక్షులు తేరేటిపల్లి హనుమంత్ జనరల్ సెక్రటరీ పోల పెద్దయ్యా , నకిరేకల్ అధ్యక్షులు కన్మంత రెడ్డి కేశవరెడ్డి గారు, జనరల్ సెక్రటరీ తౌనుపునూరి వెంకటేశ్వర్లు , దేవరకొండ అధ్యక్షులు సముద్రాల వెంకటేశ్వర్లు జనరల్ సెక్రటరీ శిల శ్రీనివాస్ నల్లగొండ అధ్యక్షులు వీరుమల్ల శ్రీనివాస్ , జనరల్ సెక్రటరీ తేలుకుంట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం సూర్యాపేటలో ఘనంగా 17వ వర్ధంతి వేడుకలు



**సూర్యాపేట సెప్టెంబర్ 2: వుదయం ప్రతినిధి** ఖమ్మం క్రాస్ రోడ్ లో సాజిద్ ఖాన్ ఆధ్వర్యంలో నివాళులు ముఖ్య అతిథిగా కొప్పుల వేణారెడ్డి, వైఎస్ఆర్ డి ఆర్ అనుబంధాన్ని గుర్తు చేసిన నేత సూర్యాపేట సెప్టెంబర్ 2 వుదయం ప్రతినిధి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్ అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం నాయకులు ఎస్ ఎస్ సాజిద్ ఖాన్ ఆధ్వర్యంలో బుధవారం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ అబ్దుల్ కరీం, కౌన్సిలర్లు బైరు శైలేందర్ గౌడ్, ఎల్గూరి ఇందిరా వీరయ్య గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు శనగాని రాంబాబు గౌడ్, సీనియర్ నాయకులు లింగారెడ్డి, ఎల్గూరి రవి, పట్టణ మైనార్టీ అధ్యక్షులు గౌస్, జాకీర్ ఇమ్రాన్, కత్తి వెంకన్న, ఫయాజ్, నకిరేకంటి సతీష్, కె కె, వేణు, కృష్ణ, అబ్బాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.



**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 2.** రోడ్డు భద్రత జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ బుధవారం సంబంధిత శాఖల, క్షేత్రస్థాయి అధికారులతో కలిసి సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. వరంగల్ కొత్త బస్టాండ్ నిర్మాణంలో పనులను, రోడ్డులో ఏర్పాటుతున్నా నీటి నిలువలు,గుంతలు వలన ట్రాఫిక్ జామ్, రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే లక్ష్మీపురం మార్కెట్ పరిధిలోని రహదారుల పరిస్థితిని కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు మరియు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మార్కెట్ పరిధికి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, వానకాలం లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలను, నీటి నిలువలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నిర్ణీత ప్రమాణాలతో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి ఎడి సర్వే ల్యాండ్ అధికారి శ్రీనివాసులు, ఆర్డీవో వరంగల్ సుమ, ఆర్ అండ్ బి ఈఈ రాజేందర్, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

# పాఠశాలల్లో పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి : కలెక్టర్

**కిచెన్ షెడ్లు, మరమ్మతులు, మరుగుదొడ్ల పనులను నెల రోజుల్లోగా పూర్తి చేయాలి**

**అల్లూరు , యూపీహెచ్‌సీలో ఎన్‌సీడీ స్క్రీనింగ్‌ను పెంచాలి**

**లక్ష్మీపురం–వీర్లపల్లి రహదారి పనులను 3 నెలల్లో పూర్తి చేయాలి**

**రామగుండం ప్రాంతంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి, సెప్టెంబర్ 02 (వుదయం ప్రతినిధి)**

రామగుండం ప్రాంతంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం రామగుండం ప్రాంతంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ పలు ప్రభుత్వ పాఠశాలలు, అల్లూరు యూపీహెచ్‌సీ, లక్ష్మీపురం–వీర్లపల్లి రహదారి పనులను పరిశీలించారు.రామగుండం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మార్కండేయ కాలనీ గోదావరిఖని ఉర్దూ మీడియం పాఠశాల, అడ్డగుంటపల్లి ఎం.పీ.పీ.ఎస్ పాఠశాల, సంజయ్ నగర్ ఎం.పీ.పీ.ఎస్ పాఠశాల, అల్లూరు ఎం.పీ.పీ.ఎస్ పాఠశాల, జడ్పీహెచ్ఎస్ నరసింహపురం (న్యూ మారేడుపాక), వీర్లపల్లి ఎం.పీ.పీ.ఎస్ పాఠశాల, చైతన్యపురి ఎం.పీ.పీ.ఎస్ పాఠశాల, 46వ డివిజన్ శాంతినగర్ ఎం.పీ.పీ.ఎస్ పాఠశాలలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, పాఠశాల భవనాల పరిస్థితి, మరమ్మతు పనులు, కిచెన్ షెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణం తదితర పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. గోదావరిఖని ఉర్దూ మీడియం పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీ–ప్రైమరీ తరగతి గదిని ప్రారంభించారు.పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పునరుద్ధరణ పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వివిధ పాఠశాలల్లో కొనసాగుతున్న కిచెన్ షెడ్లు, ఇతర మరమ్మతు పనులు, మరుగుదొడ్ల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి నెల రోజుల్లోగా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు.అనంతరం రామగుండం మండలంలోని అల్లూరు యూపీహెచ్‌సీ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న ఓపీ సేవలు, వైద్యుల అందుబాటు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఎన్‌సీడీ స్క్రీనింగ్ తదితర అంశాలను పరిశీలించారు.అల్లూరు యూపీహెచ్‌సీలో ఎన్‌సీడీ స్క్రీనింగ్ చాలా తక్కువగా ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకొని స్క్రీనింగ్ శాతాన్ని పెంచాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఓపీ సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. వైద్యులు నిర్ణీత సమయానికి విధులకు హాజరై రోగులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం లక్ష్మీపురం నుంచి వీర్లపల్లి వరకు జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులను పరిశీలించారు. సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించే పనులను వివరించారు. రహదారి పనుల పురోగతిని పరిశీలించిన పనులను వేగవంతం చేసి మూడు నెలల్లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రహదారి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, పనులలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, రహదారుల అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ పర్యటనలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, డిప్యూటీ ఇంజనీర్ మారుతి, ఏఈ నరేష్, యూపీహెచ్‌సీ డా.దివేన, ఆర్అండ్‌బీ ఏఈ జావిద్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భైంసా గ్రీవెన్స్ డేలో ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి

**ఫిర్యాదులను స్వీకరించి తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జిల్లా ఎస్పీ జానకి షర్మిల**




**నిర్మల్ జిల్లా 2 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**

నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ బుధవారం భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను ఎస్పీ ఓర్పుగా విని, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు. ఫిర్యాదుదారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి, సమస్యలపై చట్టపరమైన చర్యలు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని ఆదేశించారు. కుటుంబ సమస్యల పరిష్కారానికి కౌన్సిలింగ్‌గ్రీవెన్స్ డేకు వచ్చిన కొన్ని కుటుంబ వివాదాలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పరస్పర అవగాహన కల్పించడం ద్వారా కుటుంబ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. భైంసాలోనే కౌన్సిలింగ్ సదుపాయం కల్పించడం పట్ల బాధితులు సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ ఫిర్యాదులపై సమీక్షగత గ్రీవెన్స్ డేల్లో అందిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని ఎస్పీ సమీక్షించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, వాటిని వేగంగా పరిష్కరించి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు గ్రీవెన్స్ డే కార్యక్రమం ఉపయోగకరంగా నిలుస్తోందని తెలిపారు.

## 22-ఏ నిషేధిత భూముల జాబితాల రూపకల్పనలో అత్యంత జాగ్రత్త వహించాలి...

**దేవాదాయ శాఖ భూములపై ప్రభుత్వ ప్రయోజనాలను పరిరక్షించాలి...**

**అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత**



**జగిత్యాల సెప్టెంబర్ 02 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలోని దేవాదాయ శాఖకు సంబంధించిన భూములను 22–ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చే ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత అధికారులను ఆదేశించారు. 22–ఏ నిషేధిత భూముల జాబితాల తయారీ పరిశీలన తుది ఖరారుపై జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు కరీంనగర్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ ఆ శాఖ సిబ్బందితో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత మాట్లాడుతూ దేవాలయాలు ఇతర దేవాదాయ సంస్థలకు చెందిన భూముల సర్వే నంబర్లు ఉప విభాగ సంఖ్యలు విస్తీర్ణం భూమి వర్గీకరణ యాజమాన్య వివరాలు రెవెన్యూ దేవాదాయ శాఖ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే 22–ఏ జాబితాలను తుది ఖరారు చేయాలని సూచించారు. రెవెన్యూ దేవాదాయ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి సంబంధిత రికార్డులను పరస్పరం సరి చూసుకోవాలని ఆదేశించారు. దేవాదాయ భూములు పొరపాటున జాబితా నుంచి మినహాయించబడకుండా అలాగే తప్పుడు సర్వే నంబర్లు లేదా విస్తీర్ణాలు నమోదు కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు ప్రభుత్వ దేవాదాయ శాఖ ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా ఎలాంటి లోపాలు అనధికార మార్పులు లేదా మినహాయింపులు చోటు చేసుకోకుండా ప్రతి ప్రతిపాదనను బాధ్యతాయుతంగా పరిశీలించాలని తెలిపారు. క్షేత్ర స్థాయి పరిస్థితులు అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డులు దేవాదాయ శాఖ రిజిస్టర్లు మరియు ఇతర ఆధారాలను సమగ్రంగా ధృవీకరించిన అనంతరమే జాబితాలను ఖరారు చేయాలని ఆదేశించారు. దేవాదాయ శాఖ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని సంబంధిత భూముల విషయంలో ప్రభుత్వ ప్రయోజనాలను పూర్తిస్థాయిలో కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా సమగ్రంగా పరిశీలించిన దోషరహితమైన తుది 22–ఏ నిషేధిత భూముల జాబితాలను సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాలోని తహసీల్దార్లు కరీంనగర్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ దేవాదాయ శాఖ అధికారులు సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి

**మహానేత సేవలను కొనియా డిన కాంగ్రెస్ శ్రేణులు**



**ధర్మపురి, సెప్టెంబర్ 2 (వుదయం ప్రతినిధి):**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలను ధర్మపురిలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల.దినేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి,వైఎ స్సార్ చిత్రపటానికి పూలమా లలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దినేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ఆయన పాలన సాగిందని, సమాజంలోని ప్రతీ వర్గానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియా డారు. వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్ కౌన్సిలర్లు సంఘీ ఆనం ద్,వంకడోతు విజయ్, కస్తూరి శ్రీనివాస్, మొగిలి శేఖర్, బాల గౌడ్, జే.సుముఖ్, ఎండి రఫీయు ద్దీన్, శ్రీపతి.సత్యనారాయణ, పాల. గణేష్, చుక్క భీమ్ రాజు, నాయకులు, కార్య కర్తలు, యువత పాల్గొన్నారు.

## కవిత మీద అనుచిత పోస్టులు పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: తెలంగాణ రక్షణ సేన, కరీంనగర్



**కరీంనగర్ సెప్టెంబర్ 02 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు కవిత మీద సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు కమెంట్స్ పెట్టిన వారిమీద చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ లోని ఒకటోవ పోలీస్ స్టేషన్ లో జిల్లా పార్టీ బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో పోలిసులకు పిర్యాదు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కవిత మీద అసభ్యకర వ్యాఖ్యలు చేసిన పోలీస్ కానిస్టేబుల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర సేన నాయకురాలు కవిత మీద సోషల్ మీడియా గ్రూపులలో అత్యంత అసభ్యకరమైన, అవమానకరంగా కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన పోలీస్ కానిస్టేబుల్ కె అనిల్ మీద తక్షణమే చట్టపరంగా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేయడం జరిగిందని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. సోషల్ మీడియా వేదికగా మహిళ నాయకురాలి మీద అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసినా కవిత గౌరవాన్ని ప్రతిష్టను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం యావత్ మహిళలోకానికి జరిగిన అవమానంగా భావించాలని. కానిస్టేబుల్ అనిల్ చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపించాలని వారు అన్నారు. పవిత్రమైన పోలీస్ ఉద్యోగంలో ఉన్న అనిల్ ప్రజలకు చట్టపరంగా రక్షణ, మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన ఒక బాధ్యత కలిగిన పోలీస్ ఉద్యోగంలో ఉండి ఈ విధంగా ఒక మహిళా రాజకీయ నాయకురాలిని లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం పైన అతడి వెనుక ఉన్న వ్యక్తులు ఎవ్వరూ అనేది కూడ బహిర్గతం చేయాలని పోలీస్ శాఖ కూడ అతడి మీద శాఖాపరమైన విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ తెలంగాణ రాష్ట్ర సేన నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 2 (వుదయం ప్రతినిధి):**

పేదవాడి సంక్షేమమే పాలనకు కొలమానంగా నిలవాలని చాటి చెప్పిన మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అని, పేదలు, రైతుల కోసం ఆయన తీసుకున్న నిర్ణయాలు నేటికీ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు.వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ పాలనలో అమలైన సంక్షేమ కార్యక్రమాలను, పేదలు, రైతుల కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించేందుకు వైఎస్సార్ చూపిన చొరవ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

## సిలబస్ ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి.. కలెక్టర్



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

ఇంటర్మీడియట్ విద్యార్థుల సిలబస్ ను నిర్ణీత గడువులోగా పూర్తిచేసి వార్షిక పరీక్షల వైపు సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని రెబ్బెన మండలం ఇందిరనగర్ లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి విద్యార్థులు, అధ్యాపకుల హాజరు పట్టికలు, తరగతి గదులు, విద్యాబోధన తీరు, పరిసరాలను పరిశీలించారు.

ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థుల సిలబస్ ను నిర్ణీత గడువులోగా పూర్తిచేసి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని తెలిపారు. విద్యార్థులు 100 శాతం కళాశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు కంప్యూటర్ పై అవగాహన కలిగే విధంగా శిక్షణ ఇవ్వాలని తెలిపా రు. అనంతరం రెబ్బెన మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంద ర్శించి సిబ్బంది హాజరు పట్టిక, మందు ల నిల్వల గది, రోగులు చికిత్స పొందు తున్న గదులను పరిశీలించి రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. వైద్య చికిత్సల కోసం ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, చిన్నచిన్న కారణాలతో రోగుల ను ఇతర ప్రాంతాలకు సిఫారసు చేయకూడదని తెలిపారు.

## ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి- కలెక్టర్

**ఆదిలాబాదు :**



జిల్లాలో పారదర్శకమైన, తప్పులులేని ఓటర్ల జాబితా తయారీకి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా కోరారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (సార్)పై ఆయన సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం నో–మ్యాపింగ్, వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో నోటీసులు జారీ చేసి ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈవిచారణకు ఓటరే స్వయంగా హాజరు కావాల్సిన తప్పనిసరి నిబంధన లేదని, వారు రాలేని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు లేదా బంధువులు సైతం హాజరు కావచ్చని స్పష్టం చేశారు. విచారణకు వచ్చేవారు కుల, జనన ధ్రువీకరణ, పాస్‌పోర్టు, శాశ్వత నివాస పత్రం, మెట్రిక్యులేషన్, అటవీ హక్కుల పత్రం లేదా ప్రభుత్వ ఇళ్ల పట్టాలు లాంటి గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకదాని ఒరిజినల్ సర్టిఫికెట్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందన్నారు.

## సైబర్ భద్రతపై అప్రమత్తతే రక్షణ

**విద్యార్థులే కీలక భాగస్వాములు-- ఎస్పీ మహేష్ బి. గితే**



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 02 (వుదయం ప్రతినిధి) :**

సైబర్ నేరాల నివారణలో ముందస్తు అప్రమత్తతే ప్రధాన ఆయుధమని జిల్లా ఎస్పీ మహేష్‌బి. గితే అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా సైబర్ టీమ్ ఆధ్వర్యంలో బుధవారం నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని తెలిపారు,విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో నకిలీ ఖాతాలు, ఫేక్ లింకులు, పార్ట్ టైమ్ ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లు, గిఫ్ట్ ఆఫర్లు, లక్కీడ్రాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్, వీడియో కాల్స్, సందేశాలు, లింకులను నమ్మొద్దన్నారు. ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, సీవీవీ, ఆధార్, పాస్‌వర్డ్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. అత్యాశ, భయం, అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకుని మోసగాళ్లు వల వేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు తమతోపాటు కుటుంబ సభ్యులు, స్నేహితులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. సైబర్ మోసానికి గురైన వెంటనే భయపడకుండా 1930కు ఫోన్ చేయాలని ఎస్పీ సూచించారు. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

**వినాయకుడి బోధనలతో భద్రతా పాఠాలు**

వినాయక చవితి సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన 'వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు' పోస్టర్‌ను ఎస్పీ విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. సైబర్ మోసాల నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోస్టర్‌లో వినూత్నంగా వివరించారు. జిల్లా సైబర్ సెల్ బృందం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా లోన్ యాప్‌లు, షేర్ మార్కెట్, ఏపీకే ఫైల్స్, కొరియర్, క్రెడిట్ కార్డు, మ్యాట్రిమోని, లాటరీ–గిఫ్ట్, మల్టీలెవల్ మార్కెటింగ్, క్రిప్టో కరెన్సీ, డిజిటల్ అరెస్ట్, సోషల్ మీడియా తదితర మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించింది. సైబర్ భద్రతలో 'ప్రివెన్షన్ ఈస్ ద బెటర్ దెన్ క్యూర్' అన్న సూత్రాన్ని పాటిస్తామని విద్యార్థులు తెలిపారు. కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ ఎస్ఐ జునైద్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, సైబర్ సెల్ సిబ్బంది గంగిరెడ్డి, రాజు, శ్రీకాంత్, విజయ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## 22ఏ భూముల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలు పక్కాగా పాటించాలి

**రెవెన్యూ అధికారులతో సమీక్షలో కలెక్టర్ భవేష్ మిశ్రా**



**నిజామాబాద్, సెప్టెంబర్ 02 :**

నిషేధిత 22(ఏ) భూములకు సంబంధించిన అంశాలలో ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమగ్ర ఆధారాలు, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే సహేతుక నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో బుధ వారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి 22ఏ నిషేధిత భూముల జాబితా పై రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీ క్ష నిర్వహించారు. 22ఏ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులు, భూముల రికార్డుల పరిశీలన, జాబితాలో చేర్చడం, తొలగింపు ప్రక్రియ తదితర అంశాలపై ఒక్కో మండలం వారీగా తహసీల్దార్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా ప్రైవేట్ భూమి పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే, సర్వే నంబర్ వారీగా డిలీటెడ్ లిస్ట్ రూపొందించి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. 22ఏ జాబితాలో భూములను చేర్చే సమయంలో అనుసరించే విధానాన్నే తొలగింపు ప్రక్రియలోనూ విధిగా పాటించాలని తెలిపారు. తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన కారణాలు, నిర్దిష్ట రిమార్క్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## 'గేట్' ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోండి

- గీతం విద్యార్థులకు గేట్ ఏరోస్పేస్ అకాడమీకి చెందిన అశోక్ నాయుడు సూచన

**పటాన్చెరు (వుదయం):**

ఇంజనీరింగ్ లో గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (GATE) శ్రేష్ఠతకు ముఖద్వారం వంటిదని, దానిలో ఉత్తీర్ణత సాధించడం ద్వారా విజయవంతమైన వృత్తికి అపార అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని గేట్ ఏరోస్పేస్ అకాడమీకి చెందిన అశోక్ నాయుడు అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ నాతి వేణుకుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ అక్తర్ ఖాన్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అశోక్ నాయుడు ప్రసంగిస్తూ, గేట్ ద్వారా ఏరోస్పేస్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు అందుబాటులో ఉన్న విస్తృత శ్రేణి ఉద్యోగ అవకాశాలను వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్ యూలు), రక్షణ సంస్థలు, పరిశోధనా సంస్థలు, ప్రైవేటు రంగంలో ఉన్న అవకాశాలను ప్రముఖంగా ప్రస్తావించారు. రక్షణ రంగంలోని వివిధ అవకాశాలను అశోక్ నాయుడు వివరిస్తూ, వాటిలో ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ (AFCAT), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (CDS), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (SSC) టెక్నికల్, యూనివర్సిటీ ఎంట్రీ స్కీమ్ (UES), టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు (TGC), NCC ద్వారా ప్రవేశం వంటివి ఉన్నాయన్నారు. వీటితో పాటు హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (HAL), డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) వంటి సంస్థల లోని ఉద్యోగావకాశాల గురించి కూడా తెలియజేశారు. అంతేకాకుండా, పరిశోధన, ఉన్నత విద్యలో ఉన్న అవకాశాలను అన్వేషించమని అశోక్ నాయుడు విద్యార్థులను ప్రోత్సహించారు. వాటిలో రక్షణ రంగ పరిశోధనా సంస్థ (DRDO/DRDL)లో శాస్త్రవేత్తలుగా, భారత వైమానిక దళంలో టెక్నికల్ ఆఫీసర్లుగా, సీఎస్ఐఆర్ కింద జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (JRFs), ఐఐటీలు, ఐఐఎస్సీ వంటి ప్రముఖ సంస్థలలో పీజీ, పీహెచ్.డీ. వంటి కోర్సులలో చేరవచ్చని ఆయన తెలియజేశారు. లక్ష్యంతో దానిని ఏకాగ్రతతో సాధించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అశోక్ నాయుడు విద్యార్థులకు ఉద్బోధించారు.

## జమ్ములమ్మ కళ్యాణానికి ఘన ఏర్పాట్లు

- నడిగడ్డ ఇలవేల్పు ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలి
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగొద్దు.. అధికారులకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశం
- కళ్యాణ మహోత్సవ పోస్టర్, వాట్సాప్ వీడియో ఆవిష్కరణ

**గద్వాల సెప్టెంబర్ 02 (వుదయం బ్యూరో)**

నడిగడ్డ ఇలవేల్పుగా భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీశ్రీశ్రీ జమ్ములమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని ఈసారి మరింత ఘనంగా, అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. కళ్యాణ మహోత్సవానికి తరలివచ్చే భక్తులకు ఎక్కడా ఇబ్బందులు, అసౌకర్యాలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ, అధికారులను సూచించారు. గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ జమదగ్ని సమేత శ్రీ జమ్ములమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవ పోస్టర్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం కళ్యాణ మహోత్సవానికి సంబంధించిన వాట్సాప్ వీడియోను కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, సీనియర్ నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. నడిగడ్డ భక్తుల ఆరాధ్యదైవం శ్రీ జమ్ములమ్మ అమ్మవారికి గద్వాల నడిగడ్డ ప్రాంతంలో ప్రత్యేకతతో ఆధ్యాత్మిక ప్రాశస్త్యం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అమ్మవారి దర్శనం, మొక్కులు చెల్లించేందుకు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో భక్తులు గద్వాలకు తరలివస్తారని తెలిపారు. గత ఏడాది శ్రావణమాసం చివరి మంగళవారం నిర్వహించిన జమ్ములమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా అదే తరహాలో భక్తిశ్రద్ధలకు ప్రతీకగా, కనులపండువగా నిర్వహించేందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి, తాగునీరు, పారిశుద్ధ్యం, రాకపోకలు, భక్తుల సౌకర్యాలు తదితర అంశాల్లో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. అమ్మవారి కళ్యాణ మహోత్సవానికి వచ్చే



ప్రతి భక్తుడు సంతృప్తిగా, ప్రశాంతంగా తిరిగి వెళ్లేలా ఏర్పాట్లు ఉండాలి" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి అండగా ఉంటా శ్రీ జమ్ములమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు దేవాలయ అభివృద్ధికి అవసరమైన చర్యలకు సహకరిస్తామని చెప్పారు.మూడు రోజుల పాటు కన్నులపండువగా ఉత్సవాలు సెప్టెంబరు 7, సోమవారం:

ఉదయం 8 గంటలకు ధ్వజారోహణం నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు జమ్మిచేడు గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఎదురుకోళ్లు కార్యక్రమం జరగనుంది. సెప్టెంబరు 8, మంగళవారం: మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీ జమదగ్ని సమేత శ్రీ జమ్ములమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు పల్లకీసేవ జరగనుంది. సెప్టెంబరు 9, బుధవారం: ఉదయం 8 గంటలకు ధ్వజావరోహణంతో మూడు రోజుల ఉత్సవాలు ముగియను న్నాయి. సీనియర్ నాయకులు, అధికారులు హాజరు కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు చెన్నయ్య, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ బోయ వెంకట్రాములు, ఈవో పురంధర్, జిల్లా వైద్య ఆరోగ్య వింగ్ డీసీసీ అధ్యక్షుడు నర్సింగ రావు, మాజీ ఆలయ కమిటీ డైరెక్టర్ అభిలాష్, నాయకులు అజయ్, వెంకటేశ్వ ర్‌రెడ్డి, రాముడు, నాగన్న, రవి తదితరులు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



## గంజాయి, మాదకద్రవ్యాల నివారణపై కట్టుదిట్టమైన చర్యలు

- సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి
- విద్యార్థుల ప్రవర్తన అసాధారణంగా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- విద్యాసంస్థల సమీపంలో పొగాకు విక్రయాలపై కఠిన చర్యలు.
- కలెక్టరేట్‌లో జిల్లా మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం.

**సిద్దిపేట, సెప్టెంబర్ 02 (వుదయం బ్యూరో)**

మాదకద్రవ్యాల వాడకం కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తుందని, జిల్లాలో వీటి ప్రభావం పడకుండా పోలీస్, ఎక్సైజ్, విద్య, సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం జరిగింది.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,** ఇతర ప్రాంతాల నుండి వచ్చి నివసిస్తున్న వారి వలన జిల్లాలో గంజాయి తదితర మాదకద్రవ్యాలు ప్రవేశించే అవకాశం ఉన్నందున అనుమానం ఉన్న ప్రాంతాలలో, వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు చేపట్టాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా చూడాలని, వారి ప్రవర్తన అసాధారణంగా ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను సూచించారు. మెడికల్ షాపుల్లో నిషేధిత డ్రగ్స్ అమ్మకుండా డ్రగ్ ఇన్స్పెక్టర్ పర్యవేక్షించాలని, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యాసంస్థలు, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ ధనరాజ్, ఎక్సైజ్ సూపరింటిండెంట్ సంతోష్, డిడబ్ల్యుఓ శారదా, పోలీస్ అధికారులు, డ్రగ్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ ను ముందుగానే గుర్తించేందుకు స్క్రీనింగ్ చేయించుకోవాలి

- ఎంపీ డీకే అరుణ
- తొలి దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స
- జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 2(వుదయం ప్రతినిధి)**

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందిస్తే పూర్తిగా నయం చేసే అవకాశం ఉంటుందని మహబూబ్‌నగర్ ఎం.పి డి.కె అరుణ అన్నారు. ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

బాలానగర్ మండలంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, ప్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎం.పి డి.కె అరుణ, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎం.పి డి.కె అరుణ మాట్లాడుతూ కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమై చాలామంది మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, వ్యాధి ముదిరిన తర్వాత చికిత్స కష్టతరమై ఖర్చులు కూడా పెరుగుతాయని తెలిపారు. తొలిదశలో గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించి వ్యాధిని నియంత్రించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కోరారు. స్క్రీనింగ్‌లో అనుమానిత కేసులను గుర్తించి, వారికి తదుపరి పరీక్షలు, చికిత్స అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇంట్లో తల్లి ఆరోగ్యంగా ఉంటే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది అని పేర్కొన్న ఎంపీ, ప్రతి ఒక్కరూ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ మహిళలు కుటుంబ బాధ్యతలు వల్ల తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు అన్నారు.. అందువల్ల మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని మహిళలందరికీ ఇటువంటి స్క్రీనింగ్ కార్యక్రమాలను నిర్వహించేందుకు ముందుకు వచ్చిన ఎంపీ డీకే అరుణకు, ప్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఫౌండేషన్‌కు జిల్లా యంత్రాంగం తరపున కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమానికి మహిళలు పూర్తి సహకారం అందించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల సహకారంతోనే కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు.స్క్రీనింగ్ అనంతరం క్యాన్సర్ అనుమానం ఉన్నవారిని అవసరమైన తదుపరి పరీక్షలు, చికిత్స కోసం ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయడంతో పాటు, వారి చికిత్స ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ప్రతి కేసును సున్నితంగా పరిగణించి, స్క్రీనింగ్ తర్వాత అవసరమైన తృతీయ స్థాయి చికిత్స అందేలా ఫాలోఅప్ చేయాలని సూచించారు.స్క్రీనింగ్‌లో గుర్తించిన కేసులపై ప్రతి పది రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించి, సంబంధిత మహిళలు ఎక్కడ చికిత్స పొందుతున్నారు, వారికి ఎలాంటి వైద్య సహాయం అవసరమవుతోంది అనే వివరాలను తెలుసుకోవాలని తెలిపారు. అవసరమైన వారికి ప్రభుత్వ పథకాల ద్వారా తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంస్థలు, వైద్యులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఏ శ్రీనివాసులు బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ప్రతినిధులు, ప్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




## పేటలో జనసేన పార్టీ అధినేత పుట్టినరోజు వేడుకలు



**నారాయణపేట సెప్టెంబర్ 2 (వుదయం ప్రతినిధి)**

జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి ప్రముఖ నటుడు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని గొడుగు గేరి అభయాంజనేయ స్వామి దేవాలయము దగ్గర పూజారి శివానంద్ స్వామి చే ప్రత్యేక పూజలు అభిషేకాలు బుధవారం నిర్వహించారు.అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో కలకాలం నిలిచి ప్రజాసేవ తోపాటు సినిమాలతో ప్రేక్షకులను ఆదరించాలని ఆ హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మార్కెట్ లోని రైతులకు అన్నదానం చేసి ఆర్ కె ఫంక్షన్ హల్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి చేరుకుని రక్తదానం చేసారు. ఈ కార్యక్రమం లో జనసేన నారాయణపేట జిల్లా నారాయణపేట, మక్తల్, కొడంగల్ నాయకులు కార్యకర్తలు, మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ సంఘం నాయకులు పవన్ కళ్యాణ్ అభిమానులు హాజరయ్యారు.

## 'ర్యాంప్–ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం' చక్కటి అవకాశం




**వనపర్తి సెప్టెంబర్ 2 (వుదయం ప్రతినిధి)**

మహిళలు పారిశ్రామిక రంగంలో ఎదిగేందుకు 'వీ హబ్' 'ర్యాంప్-ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం' చక్కటి అవకాశం : అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

మహిళలు పారిశ్రామిక రంగంలో రాణించి ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ సూచించారు.

బుధవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ ఆధ్వర్యంలోని విహబ్ సౌజన్యంతో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 'ర్యాంప్-ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం'పై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మహిళా పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడారు.

**ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ**

మహిళలు పారిశ్రామిక రంగంలో రాణించి ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాలను మరింత విస్తరించుకునేందుకు 'ర్యాంప్-ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం' చక్కటి అవకాశమని తెలిపారు. ప్రభుత్వాలు అందిస్తున్న శిక్షణ, రుణ సదుపాయాలు, మార్కెటింగ్ సహకారం, ఇతర ప్రోత్సాహకాలను వినియోగించుకొని తమ ఉత్పత్తులకు మంచి మార్కెట్ అవకాశాలను సృష్టించుకోవాలని తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారతకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

వీ హబ్ సీనియర్ డైరెక్టర్ జాహీద్ అక్తర్ షేక్, డైరెక్టర్ ఊహ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు, కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్త సహకారంతో 'ర్యాంప్' పథకం అమలు చేస్తున్నట్లు వివరించారు. మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న సూక్ష్మ, చిన్న తరహా వ్యాపార సంస్థలను మరింత వేగంగా అభివృద్ధి చేయడం, వాటి సామర్థ్యాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమం కింద ఎంపికైన మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం, అవసరమైన సహకారం అందిస్తారని వివరించారు. జౌళి, ఆహార శుద్ధి, తయారీ, చేతివృత్తులు, హస్తకళలు తదితర రంగాల్లోని వ్యాపార సంస్థలకు ప్రోత్సాహం కల్పిస్తారని తెలిపారు.బ్యాంకుల ద్వారా రుణ అనుసంధానం కల్పించడంతో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులతో వ్యక్తిగత మెంటరింగ్ అందించి మహిళల వ్యాపారాలను మరింత లాభదాయకంగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తారని తెలిపారు.సదస్సులో స్థానిక మహిళ పారిశ్రామికవేత్తలకు సంబంధించిన ఉత్పత్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందేందుకు ఆసక్తి చూపిన మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ రామ మహేశ్వర్, ఆర్ సెటి డైరెక్టర్ అనిల్, అడిషనల్ డి ఆర్ డి ఓ, సంబంధిత శాఖల అధికారులు, విహబ్ ప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల పాలనలో సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ సక్సెస్

- అమలు చేసిన పథకాలపై చర్చకు BRS, BJP సిద్ధమా..?
- కేటీఆర్.. ముందు మీ ఇల్లు చక్కబెట్టుకోండి.. మా ఇల్లు సంగతి మీకెందుకు: జగ్గారెడ్డి

**హైదరాబాద్,సంగారెడ్డి సెప్టెంబర్ 2: వుదయం:**



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి భర్త జగ్గారెడ్డి గాంధీభవన్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టఫలితంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని ఆయన అన్నారు.గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు స్వేచ్ఛ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు స్వేచ్ఛ, స్వతంత్ర వాతావరణం ఏర్పడిందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. సెక్రటేరియట్‌లోకి సామాన్య ప్రజలకు కూడా ప్రవేశం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు.

**హామీలను అమలు చేశాం**

ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ ఆదేశాలతో మేనిఫెస్టో ప్రకటించామని, అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పేదలకు సబ్సిడీ గ్యాస్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ తదితర పథకాలను అమలు చేస్తున్నామని జగ్గారెడ్డి తెలిపారు.గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పథకం నిర్వీర్యమైందని ఆరోపించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్నారు.

**పథకాలపై చర్చకు సిద్ధమా?**

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై BRS, BJP నాయకులు చర్చకు సిద్ధమా? అని జగ్గారెడ్డి సవాల్ విసిరారు. ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర పథకాలపై సిరిసిల్ల, సిద్దిపేట ప్రాంతాల్లోనైనా చర్చకు తాము సిద్ధమని అన్నారు. "మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందో చూడటానికి బస్సు ఎక్కుదాం.. మీరు సిద్ధమా?" అంటూ ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ప్రతి గ్రామానికి, ప్రతి బస్తీకి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, వాటిపై కూడా ప్రజల మధ్య చర్చకు సిద్ధమని చెప్పారు.

**కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు**

BRS వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై జగ్గారెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "కేసీఆర్ అసెంబ్లీకి రారు అంటున్నావు కేటీఆర్.. మీరు కూడా ఇలాగే ప్రతిపక్షంలో ఉండండి.. అసెంబ్లీకి రాకండి" అంటూ వ్యాఖ్యానించారు. "కేటీఆర్.. ముందు నీ ఇల్లు చక్కబెట్టుకో..మా ఇల్లు సంగతి నీకెందుకు?" అని ప్రశ్నించారు. ఏ పార్టీలో అయినా అంతర్గత విభేదాలు ఉంటాయని, BRSలోనూ కుటుంబ సభ్యుల మధ్య విభేదాలు బయటకు వస్తున్నాయని అన్నారు.

**తెలంగాణ ఏర్పాటుపైనా వ్యాఖ్యలు**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సోనియా గాంధీ కీలక నిర్ణయం తీసుకున్నారని జగ్గారెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల బలిదానాలు కీలక పాత్ర పోషించాయని, ఉద్యమాన్ని తమ కుటుంబమే సాధించిందన్నట్లుగా BRS నాయకులు చెప్పుకోవడం సరికాదని విమర్శించారు.రాష్ట్ర విభజన కోసం కాంగ్రెస్ నాయకుల ఇళ్ల చుట్టూ తిరిగిన వారు ఇప్పుడు అదే కాంగ్రెస్ నాయకులను విమర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మీకు చేసిన అన్యాయం ఏమిటని నిలదీశారు.దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదో కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజనకు BJP వ్యతిరేకంగా ఉన్నప్పటికీ పరిస్థితుల కారణంగా చివరకు అంగీకరించిందని వ్యాఖ్యానించారు.

**ఖజానా ఖాళీ చేశారంటూ ఆరోపణ**

గత BRS ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని జగ్గారెడ్డి ఆరోపించారు. "చెరువులో చేపలు ఉన్నట్లు ఇన్ని రోజులు బతికారు.. ఇప్పుడు చెరువు నుంచి చేపలు బయటపడి కొట్టుకున్నట్లు చేస్తున్నారు" అంటూ BRS నేతల తీరుపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అమలు చేసిన పథకాలపై తాము ప్రజల మధ్యకు వచ్చి చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రతిపక్షాలు కూడా సిద్ధంగా ఉండాలని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ సత్తా చాటాలి



**నాగర్ కర్నూల్ రూరల్, సెప్టెంబర్ 02, (వుదయం ప్రతినిధి):**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల్లా రాజేష్ రెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు క్రీడలను ప్రోత్సాహకంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కుర్మయ్య, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్, వైస్ చైర్మన్ బాదం రమేష్, పట్టణ అధ్యక్షులు జక్కా రాజకుమార్ రెడ్డి , నిజాం, జట్టి ధర్మరాజు ,విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది పనితీరు మెరుగుపడాలి
- విద్యార్థులకు హెల్త్ కార్డులు అందజేసేందుకు చర్యలు
- వారంలోగా సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల, సెప్టెంబర్ 02 (వుదయం బ్యూరో)**

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్య సిబ్బంది విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో వైద్యశాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరం లేకుండా ఇతర ఆసుపత్రులకు గర్భిణులను రెఫర్ చేయడం తగదని అన్నారు. జిల్లా వైద్యాధికారులు తరచూ మెడికల్ అధికారులతో సమావేశాలు నిర్వహించి, వైద్యులు, సిబ్బంది మెరుగైన పనితీరు కనబరిచేలా దిశానిర్దేశం చేయాలని సూచించారు.

ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్) సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, టీబీ వ్యాధిగ్రస్తులు పోషణ్ కిట్లను సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం ద్వారా జిల్లాలోని విద్యాసంస్థల్లో విద్యార్థులకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అన్ని విద్యాసంస్థల్లోని విద్యార్థులకు హెల్త్ కార్డులు అందజేసేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, వారంలోగా సమర్పించాలని ఆయా పీహెచ్‌సీల మెడికల్ అధికారులను ఆదేశించారు.వైద్య సేవల్లో నాణ్యతను పెంచడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగేలా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ సంధ్య కిరణ్మయి, ప్రోగ్రాం అధికారులు రాజు, రామచంద్రరావు, అస్గర్ అలీ, ప్రసూనరాణి, ఇతర వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.





## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండల పరిదిలోని బచ్చురాజ్‌పల్లి, నస్కల్, నిజాంపేట గ్రామాల పరిదిలోని 33/11 కేవీ మరమ్మత్ కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నాడు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 3 గ్రామాల సబ్‌స్టేషన్ పరిదిలో గల వ్యసాయ భూములకు 3 ఫేజీ విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. ఇందుకు రైతులు సహకరించాలని కోరారు.

# మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ఆర్ వర్ధంతి వేడుకలు



**ఖానాపురం, సెప్టెంబర్ 2 (వుదయం ప్రతినిధి):**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను మండల కేంద్రంలోని ఘనంగా నిర్వహించినట్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్ పర్సన్ వల్లే శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని ఏఎంసి వైస్ చైర్మన్ శాఖమూరి ఇంటి వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్, సొసైటీ చైర్ పర్సన్ మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు.

అలాగే బుధరావుపేట గ్రామంలోని గ్రామ పార్టీ అధ్యక్షుడు లింగిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, పెసరు రాణి, జాటోతు వినోద్ కుమార్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె ముస్తఫా, సొసైటీ పర్సన్ జటంగి నాగరాజు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి షేక్ లాల్ షాబ్, మండల కిషన్ సెల్ అధ్యక్షుడు చెడిపాక ఉపేందర్, బ్లాక్ కమిటీ సభ్యుడు గిరగని నర్సయ్య,

ఉప సర్పంచ్ ఆరె సంపత్ కుమార్, వార్డు సభ్యుడు జాటోత్ బాలు, నాయకులు మండవ ప్రసాదరావు, రెడ్డి నాగార్జున రెడ్డి, గూగులోతు రాజు, బిక్కి మురళి, రంగు కుమారస్వామి, కందుల సాంబయ్య, భీమగాని సురేష్, కందిక రాంబాబు, మారగాని లింగయ్య, నారగోని సమ్మయ్య, చెడిపాక యాకయ్య, షేక్ షరీఫ్, కోడి మల్లేష్, కే ప్రకాష్,ఓరుగంటి శ్రీనివాస్, గుండు సాంబయ్య, ఆకుల రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సంక్షేమ పథకాలు చరిత్రాత్మకం

**కొండూరులో ఘనంగా దివంగత ముఖ్యమంత్రి వైయస్సార్ 17వ వర్ధంతి**

**రాయపర్తి, సెప్టెంబరు 2 (వుదయం ప్రతినిధి):**



దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని రాయపర్తి మండలం కొండూరు గ్రామంలో బుధవారం వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు కొండూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు గిరిగాని వేణు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి హాజరై అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలు చారిత్రాత్మకమని అన్నారు. భారత రాజకీయాల్లో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల చరిత్రలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రస్థానం సువర్ణ అధ్యాయమని పేర్కొన్నారు. ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు లక్షలాది కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపాయని తెలిపారు.ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాయిని యాకయ్య, మండల సీనియర్ నాయకుడు కూందూరు రామ్‌రెడ్డి, కొలనుపల్లి పీఏసీఎస్ చైర్మన్ జక్కుల వెంకట్‌రెడ్డి, గబ్బెట బాబు, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, మండల ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తూరులో వికసిత భారత్ గ్రామసభ

**అభివృద్ధి పనులపై గ్రామస్థుల ప్రతిపాదనలు.. ఎంపీడీవో పాక శ్రీనివాసులు**

**రాయపర్తి, సెప్టెంబరు 2 (వుదయం ప్రతినిధి) :**



మండలం కొత్తూరు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం వి.బి. రాంజీ వికసిత భారత్ గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కందికట్ల స్వప్న సంతోష్ అధ్యక్షతన జరిగిన సభకు ఎంపీడీవో పాక శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వి.బి. రాంజీ పథకం కింద కొత్తూరులో నూతనంగా 318 పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని తెలిపారు.

గ్రామ అవసరాలను గుర్తించి పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రజలను కోరారు. దీంతో గ్రామస్థులు వ్యక్తిగత అవసరాలతో పాటు సామూహిక అభివృద్ధికి సంబంధించిన పలు పనులను సభ దృష్టికి తీసుకువచ్చారు.కొత్తూరు ఊరచెరువు మినీ ట్యాంక్ అభివృద్ధి, మేడికుంట మినీ ట్యాంక్ అభివృద్ధి , రహదారులకు ఇరువైపులా మొక్కల పెంపకం, లీడ్ ఛానల్, ఇల్లు ఛానల్ వెంబడి మొక్కలు నాటడం, గౌడ సంఘం ఆధ్వర్యంలో చెరువు కట్టలపై ఈత చెట్లు, మొక్కల పెంపకం, ఫామ్ పాండ్‌లు, పశువుల షెడ్ల నిర్మాణం, ఇంకుడు గుంతల ఏర్పాటు తదితర పనులను గుర్తించారు. గుర్తించిన పనులకు ఈ ఏడాది ప్రణాళిక ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు సూచించారు.కుక్కల బెడద నివారణకు పిటిషన్లు మంలో కుక్కల బెడద అధికంగా ఉందని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ యువత సర్పంచ్ కందికట్ల స్వప్న సంతోష్‌కు పిటిషన్ అందజేశారు. దీనిపై సంబంధిత అధికారులకు సమాచారం అందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హామీ ఇచ్చారు.మట్టి వినాయకుడినే పూజిద్దాం వినాయక చవితి, నవరాత్రుల నేపథ్యంలో గ్రామంలో ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని, ప్లాస్టిక్ వినియోగ నిర్మూలనకు సహకరించాలని గ్రామసభలో తీర్మానించారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రజలు భాగస్వాములు కావాలని ఎంపీడీవో, సర్పంచ్ సూచించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.డి. ఆస్మా, ఫీల్డ్ అసిస్టెంట్ కందికట్ల సృజన, వార్డు సభ్యులు తాటికాయల నాగరాణి భాస్కర్, చిర్ర నాగరాజ్, దొమ్మటి లలితా రమేష్ పాల్గొన్నారు.

# నర్సంపేట గడ్డపై బీఆర్ఎస్ సమరభేరి

**1000 రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన. ఆరు గ్యారంటీల హామీలను వెంటనే అమలు చేయాలి. ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి. ఏనుగుల రాకేష్ రెడ్డి. తక్కెళ్ళపల్లి రవీందర్ రావు.**

**నర్సంపేట వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 2.**



ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ శ్రేణులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, వృద్ధులు, వితంతువులకు రూ.4,000 పెన్షన్, రైతులు, కౌలు రైతులకు ఇచ్చిన హామీలు, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ఇందిరమ్మ ఇళ్ల వంటి హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో జరిగిన వైఫల్యాలు, ప్రజా సమస్యలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమరభేరి నిర్వహిస్తున్నామని తెలిపారు. నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి యాది సభకు నర్సంపేట నుంచి ఉద్యమకారుల తరలింపు



**వరంగల్ జిల్లా నర్సంపేట వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 2:**

తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి స్మారకార్థం ఉమ్మడి వరంగల్ జిల్లా అఖిలపక్ష తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న 'యాది సభ' కు నర్సంపేట నుంచి పలువురు సహచర ఉద్యమకారులు, అభిమానులు తరలివెళ్లారు. పెద్ది సుదర్శన్ రెడ్డితో ఉన్న అనుబంధాన్ని, తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఈ యాది సభలో పాల్గొనేందుకు నర్సంపేట నుంచి ఉద్యమకారులు బయలుదేరారు. ఆయనతో కలిసి తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన సహచరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా దార్ల రమాదేవి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, రావుల సతీష్, రామసాయం ఉపేందర్ రెడ్డి, గుంటి కిషన్, బూస అశోక్, బాలు నాయక్, షేక్ ఇర్ఫాన్, పల్నాటి సాంబయ్య, మద్దెల సాంబయ్య, గాదె ఇసాక్ తదితరులు పాల్గొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని, నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని ఉద్యమకారులు పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ప్రజా సేవా స్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని వారు అన్నారు.

# వీబీగ్రాంజీ పథకంతో రైతులకు ఎంతో ప్రయోజనం

**అడిషనల్ డీఆర్డీఓ భూక్యా సురేందర్ నాయక్**

**చిట్యాల: సెప్టెంబర్ 02 (వుదయం ప్రతినిధి)**



వీబీగ్రాంజీ పథకంతో రైతులకు ఎంతో ప్రయోజనం అని అడిషనల్ డీఆర్డీఓ భూక్యా సురేందర్ నాయక్ అన్నారు చిట్యాల మండల కేంద్రంలో రైతు ఇజ్జిగిరి శ్రీనివాస్‌కు వీబీగ్రాంజీ పథకం కింద మంజూరైన ఫార్మ్ పాండ్ పంట కుంట పనులను అడిషనల్ డీఆర్డీఓ భూక్యా సురేందర్ నాయక్ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సురేందర్ నాయక్ మాట్లాడుతూ ఫార్మ్ పాండ్ ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు భూగర్భ జలాల మట్టం పెరుగుతుందని, పంటలకు అవసరమైన సమయంలో నీటిని వినియోగించుకోవచ్చని తెలిపారు. పంటలకు రక్షణ కల్పించడంతో పాటు భూగర్భ జలాల వృద్ధికి, చేపల పెంపకానికి కూడా ఫార్మ్ పాండ్‌లు ఉపయోగపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ తౌటం నవీన్, ఏపీఓ ఎండీ అలీం, టీఏ సుధాకర్, రైతు ఇజ్జిగిరి శ్రీనివాస్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు అమూల్యం!



**హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 02 (వుదయం ప్రతినిధి) :**

దివంగత నాయకుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ Y.S. రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ భవన్‌లో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్సార్ అందించిన సేవలు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయాయని కొనియాడారు. పేద ప్రజల సంక్షేమం, సంక్షేమ పథకాల అమలులో ఆయన దిశానిర్దేశం ఎప్పటికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బొజ్జ భాను, జనరల్ సెక్రటరీ విష్ణుదాస్ వంశీచందర్ రావులతో పాటు జిల్లా ప్రధాన నాయకులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొని వైఎస్సార్‌తో ఉన్న జ్ఞాపకాలను స్మరించుకున్నారు.

## నూతన కమ్యూనిటీ టాయిలెట్లకు భూమి పూజ

**మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత**

**ఖానాపురం, సెప్టెంబర్ 2 (వుదయం ప్రతినిధి):**



పారిశుధ్యాన్ని మెరుగుపరచడంలో భాగంగా ప్రజల సౌకర్యార్థం నూతన సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలను చేపడుతున్నట్లు మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత మండల ప్రజలకు తెలిపారు. మండల కేంద్రంలోనీ సబ్ మార్కెట్ యార్డు ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాని మండల అభివృద్ధి అధికారి ఏఎంసి వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు గ్రామ సర్పంచ్ సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ తో కలిసి ఎంపీడీవో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నూతన సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సునీల్ కుమార్ రాజ్, ఏపీవో సునీత, సర్పంచ్ దానసరి సురేష్, ఈసీ అరుణ్ కుమార్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కే ముస్తాఫా, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఉప సర్పంచ్ ఉప్పు రాజు, వార్డు సభ్యులు గుండ్లపల్లి విజయ్, భూక్య స్రవంతి, తోటకూరి సంధ్య, గ్రామ నాయకులు కందుల సాంబయ్య, మలికంటి వెంకన్న జిపి అటెండర్ షఫీ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సదస్సుకు ప్రొఫెసర్ జ్యోతి, డాక్టర్ ఆదిరెడ్డి





**కాజీపేట, సెప్టెంబర్ 02 (వుదయం ప్రతినిధి) :**

చెన్నైలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24, 25 తేదీల్లో నిర్వహించనున్న అగ్రిటెక్-2026 అంతర్జాతీయ సదస్సుకు కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, పౌర సంబంధాల అధికారి డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డికి ఆహ్వానంఅందింది.వారు సంయుక్తంగా "వ్యవసాయం,గ్రామీణ ఆర్థికాభివృద్ధి: సుస్థిర, సమ్మిళిత అభివృద్ధికి సమగ్ర రూపకల్పన" అంశంపై సమర్పించిన పరిశోధన పత్రాన్ని సదస్సు నిర్వాహకులు ఆమోదించారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి, గ్రామీణ ఉపాధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నీటి నిర్వహణ, వాతావరణ మార్పులకు అనుగుణమైన సుస్థిర వ్యవసాయ విధానాలపై పరిశోధన పత్రంలో విశ్లేషించినట్లు ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రాన్ని సమర్పించే అవకాశం లభించడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. వారి ఎంపిక పట్ల కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, అభినందనలు తెలిపారు.

## విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా ఉపాధ్యాయుడిని నియమించండి

**సర్పంచ్ వేల్పుల సరిత**

**మహాదేవపూర్: సెప్టెంబర్ 02(వుదయం ):**



మండలం, మద్దులపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల సరిత బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రాన్ని అందించారు. ప్రస్తుతం పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహించాల్సి ఉండగా, వారిలో ఒకరు మాతృత్వసెలవులోఉన్నారని, దీంతో ప్రస్తుతం ఒకే ఒక్క ఉపాధ్యాయుడు అన్ని తరగతుల విద్యార్థులకు బోధించాల్సి వస్తోందని, విద్యార్థుల విద్యాభ్యాసానికి తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు.గతవిద్యా సంవత్సరంలో తమ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షల్లో సీట్లు సాధించి పాఠశాలకు మంచి గుర్తింపు తెచ్చారని తెలిపారు.ప్రస్తుతం ఉపాధ్యాయుల కొరత కారణంగా చదువులకు ఆటంకం కలగకుండా, వారి విద్యా ప్రమాణాలను కొనసాగించేందుకు తక్షణమే మరో ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై మద్దులపల్లి ప్రాథమిక పాఠశాలకు పంపించాలని, విద్యార్థులభవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వినతిని సానుకూలంగా పరిశీలించి వీలైనంత త్వరగా ఉపాధ్యాయుడిని కేటాయించాలని కోరారు.

# కస్తూర్బా పాఠశాల సందర్శన తనిఖీలు



**మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి కాంప్లెక్స్ హెడ్మాస్టర్**

**పర్వతగిరి , సెప్టెంబర్ 2 ( వుదయం ప్రతినిధి ):**

పర్వతగిరి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం ను ఈరోజు పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి పర్వతగిరి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కే. నవీన్ కుమార్ కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గది పాఠ్యాంశ బోధనను పరిశీలించారు, విద్యార్థులను సంబంధిత విషయాలపై ప్రశ్నలు అడిగారు. వంటశాల పరిసరాలను మరియు భోజన పదార్థాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల డైరీలు, ఎఫ్ ఎల్ ఎం రిజిస్టర్ లు, హాజరు రిజిస్టర్లు తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సలహాలు సూచనలు చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కొరకు ఉచితంగా అందజేసిన స్కూల్ బ్యాగులను

వారి చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు.కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా సీ ఆర్ టి లు పాల్గొన్నారు

## మహాదేవపూర్ లో పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవ వేడుకలు

**మహాదేవపూర్: సెప్టెంబర్ 02(వుదయం ప్రతినిధి)**

కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో బుధవారం జనసేన పార్టీ మంథని నియోజకవర్గ నాయకులు కాల్వ రాజశేఖర్ ఆధ్వర్యంలో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా స్థానిక ప్రజలు మరియు యువత పెద్ద ఎత్తున పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు శేషాద్వాల రాజేష్, నారా రవికాంత్, చిర్ర రాకేష్, కలుగూరి విజయ్, తలారి ఉదయ్ కాంత్, రామ్ శెట్టి రాకేష్, సాగర్ల మహేందర్, బుర్రి రాకేష్, అంబాల రాజకుమార్, చందు, గట్టు సందీప్, నాయకులు జనగాం పవన్, భూపాలపల్లి నాయకులు మహేందర్, సిద్ధం రవి, వంగ శారద తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కం అశోక్**

**మహాదేవపూర్, సెప్టెంబర్ 02(వుదయం ప్రతినిధి):**



వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయం అని కాంగ్రెస్ పార్టీ మహాదేవపూర్ మండల అధ్యక్షుడు కట్కం అశోక్ అన్నారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కం అశోక్ ఆధ్వర్యంలో బుధవారం దివంగతనేత మాజీ ముఖ్యమంత్రి, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాన్ని మండలకేంద్రంలోని శ్రీపాదరావు విగ్రహం ముందు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అశోక్ తోపాటు పలువురు నాయకులు మాట్లాడుతూ పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, రైతు సంక్షేమం వంటి అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రజల గుండెల్లో వైఎస్సార్ చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, సర్పంచ్ లు సమ్మిరెడ్డి,మాజీ సర్పంచ్ విలాస్ రావు, దేవస్థానం డైరెక్టర్ అశోక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, అశ్రర్ ఖురేషి,వామన్ రావు, గుడాల శ్రీనివాస్, వరప్రసాద్, కోట సమ్మయ్య, అయిత తిరుపతి రెడ్డి, బుర్రి శివరాజ్, జగదీశ్, చెక్రి,

వార్డు మెంబర్స్ హరీష్, స్వామి, నాయుమోద్దీన్, నాయకులు కార్యకర్తలు, యువజన నాయకులు,పాల్గొన్నారు.

# పర్వతగిరిలో వైఎస్సార్ వర్ధంతి వేడుకలు



**ఘనంగా నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు**

**పర్వతగిరి,సెప్టెంబర్ 02 ( వుదయం ప్రతినిధి ):**

వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి, జననేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి, కాంగ్రెస్పార్టీ సీనియర్ నాయకులు పిన్నింటి అనిల్‌రావు ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు సావిత్రి మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రవేశ పెట్టిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇళ్ల స్థలాల పంపిణీ వంటి సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పర్వతగిరి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేడ్ల సంతోష్, జిలా కార్యదర్శి బొట్ల మహేంద్ర, ఉపసర్పంచ్ అనిత రమేష్,కుసం రామచందర్, పిన్నింటి సునిల్ రావు, కందికట్ల అనిల్,అత్తి కుమారస్వామి, మైనారిటీ నాయకులు సుల్తానా, రాఘవులు,వడ్లకొండ ప్రసాద్,చిదురు తిరుపతి,బోట్ల వెంకన్న,కనకరాజు లతో పాటు మండల,పట్టణ కమిటీల ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏ ఐ కె ఎమ్ ఎస్ రాష్ట్ర 9వ మహాసభలను విజయవంతం చేయండి

**తొర్రూరు, సెప్టెంబర్ 2 (వుదయం ప్రతినిధి):**



కేంద్రంలోని అఖిలభారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో (ఏ ఐ కె ఎమ్ ఎస్ )నేడు రాష్ట్ర9 మహాసభలను జయప్రదం చేయాలని స్థానిక కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ ఎంఎల్.న్యూడెమోక్రసీ తొర్రూరు. డివిజన్ కార్యదర్శి ఉడుగుల లింగన్న పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వం.విదేశీ లతో వాణిజ ఒప్పందాలను వెంటనే ఉపసంహరించుకోవాలి .ప్రభుత్వాలు. రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని వారు మండిపడ్డారు. ప్రభుత్వాలు హామీలకే పరిమితమయ్యారు కానీ రైతాంగాన్ని విస్మరించారు.అని అన్నారు. రైతాంగంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు కే టా యిం చ కుం డా పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రభుత్వాలు కొమ్ముకాచుతున్నాయని మండిపడ్డారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని లేకుంటే అనేక ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం కింద రైతులకు అనుసంధానం చేయాలని వారి డిమాండ్ చేశారు. ఏ విధంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికీ వెయ్యి రోజులు గడుస్తున్నది అని పండుగ చేసుకున్నటువంటి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చినటువంటి ఆరు. గ్యారంటీలుఎక్కడ అమలు చేసారో చెప్పాలని వారు.డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించే దిశలో అఖిల భారత రైతు కూలీ సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని వారు అన్నారు. అందులో భాగంగా ఈనెల 8 9 తేదీలలో మంచిర్యాల జిల్లాలో రైతు కూలీ సంఘం 9వ మహాసభలను నిర్వహించుకుంటున్నామని ఈ మహాసభలను రైతాంగం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరా యకన్న. తండా సురేష్ ,వెంకన్న, లింగన్న ,మధు, కృష్ణ, సోమయ్య, ఐలమ్మ ముత్తమ్మ,.తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడమే వీబీజీ రామ్ జీ పథకం

**గ్రామ సభ ద్వారా ఉపాధి కూలీలకు ఉపాధి హామీ పనుల గుర్తింపు. మెటీరియల్ కాంపోనెంట్ నిధులను గ్రామ యూనిట్ గా ప్రకటించాలి. సర్పంచుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్.**

**ఖానాపురం, సెప్టెంబర్ 2 (వుదయం ప్రతినిధి):**



గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడమే వీబీజీ రామ్ జీ పథకం ముఖ్య ఉద్దేశమని గ్రామ సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ గ్రామ ప్రజలకు ఉపాధి కూలీలకు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే మెటీరియల్ కాంపోనెంట్ నిధులను గ్రామ యూనిట్ గా ప్రకటించాలని ప్రభుత్వాన్ని అధికారులను డిమాండ్ చేశారు. మండల కేంద్రంతో పాటు ఇరవై ఒక్క గ్రామ పంచాయతీల పరిధిలోని వీబీజీరామ్ జీ గ్రామసభలను ఆయా గ్రామాల సర్పంచ్ల ఆధ్వర్యంలో గ్రామ సభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కూలీల ఉద్దేశించి సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వీబీజీరామ్ జీ పథకంలొ వాతావరణ ప్రభావ పరిస్థితి తో ఉపాధి కూలీలకు ఎక్కువ పని దినాలు కల్పించాలనె లక్ష్యంతో ఉపాధి పనుల గుర్తింపు కోసం గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు తెలుపుతూ, గ్రామంలోని ఉపాధి హామీ పథకంలొ చేపట్టాల్సిన పనులు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ప్లాంటేషన్, నర్సరీ పనులు, కమ్యూనిటీ టాయిలెట్లు, గోడౌన్ల నిర్మాణం తదితర పనులను గుర్తించినట్లు సర్పంచ్ తెలుపుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే మెటీరియల్ కాంపోనెంట్ నిధులను గ్రామ యూనిట్ గా ప్రకటించాలని గ్రామ సభ ద్వారా ఏకగ్రీవంగా తీర్మానం చేసి అధికారులకు కలెక్టర్ నివేదికలను పంపుతున్నట్లు సర్పంచ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొంది సుజాతనాగేశ్వర్ రావు, ఏపీవో సునీత, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఉప సర్పంచ్లు ఉప్పు రాజు, భాషబోయిన రాజుయాదవ్, వార్డు సభ్యులు గుండ్లపల్లి విజయ్, చలిగంటి మల్లికార్జున్, భూక్య స్రవంతి, ఎస్.కె ఆరిపా, తోటకూర సంధ్య, మమ్మద్ అజహర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# స్కీమ్ వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**1000 రోజుల పాలన పూర్తయినా సమస్యలు పరిష్కరించలేదు. జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌కు బి ఆర్ టి యు వినతిపత్రం.**

**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 2.**



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజుల పాలన పూర్తయినప్పటికీ ఎన్నికల మేనిఫెస్టోలో స్కీమ్ వర్కర్లకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని బిఆర్టియు వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు విమర్శించారు. స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ప్రకటించిన రూ.18 వేల వేతన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బి ఆర్ టి యు వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శ్రావణ్ కుమార్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గోనె యువరాజు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు రెండు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అధికారంలోకి వస్తే ఫీల్డ్ అసిస్టెంట్లను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న మూడు కేటగిరీల వేతన విధానాన్ని రద్దు చేసి, అందరికీ ఒకే కేటగిరీలో వేతనాలు చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్కీమ్ వర్కర్ల సమస్యలపై సానుకూలంగా స్పందించి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని గోనె యువరాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్టియు హన్మకొండ జిల్లా ఇన్‌చార్జి నాయిని రవి, అంగన్వాడీ జిల్లా నాయకురాలు బి. శిరీష, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బండారి మంజుల, జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా నాయకుడు వేల్పుల రాజు, మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా నాయకురాలు గండు శ్రీదేవితో పాటు నాయకులు సంధ్య, రమ, సువర్ణ, రిపిక, సుజాత, లక్ష్మి, శారద, సునీత, జ్యోత్స్న

## ఎస్ ఐ ఆర్ హియరింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 2.**

సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న హియరింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. మంగళవారం వరంగల్ నగరంలోని కాశీబుగ్గ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం, వరంగల్ మండల తహసీల్దార్ కార్యాలయాలను ఆమె సందర్శించి ఓటరు హియరింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు.వరంగల్ ఆర్డీవోతో కలిసి ఆయా కార్యాలయాలను సందర్శించిన కలెక్టర్ ఎస్ ఐ ఆర్ కు సంబంధించి ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులు, అభ్యంతరాలపై నిర్వహిస్తున్న హియరింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం, సంబంధిత రికార్డుల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ హియరింగ్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో, సంబంధిత తహసీల్దార్లు, ఎన్నికల శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## శరీరానికి శక్తిని అందించి ఉత్సాహంగా మార్చే నల్ల నువ్వులు..



రోజంతా నీరసంగా, అలసటగా అనిపిస్తోందా? ఉదయం నిద్ర లేచిన తర్వాత కూడా శక్తి లేనట్టుగా అనిపించడం, మధ్యాహ్నానికి బాగా నీరసించిపోవడం వంటి సమస్యలు చాలామందిని వేధిస్తున్నాయి. తగినంత నిద్ర లేకపోవడం, ఒత్తిడి, జీవనశైలి వంటి కారణాలతో పాటు ఆహారంలో కొన్ని ముఖ్యమైన పోషకాలు లోపించడం కూడా నిరంతర అలసటకు కారణం అవుతాయి. అలాంటి సమయంలో కాఫీ లేదా ఎనర్జీ డ్రింక్స్‌పై ఆధారపడటానికి బదులుగా రోజువారీ ఆహారంలో పోషకాలు అధికంగా ఉండే పదార్థాలను చేర్చుకోవడం మంచిది. ముఖ్యంగా నల్ల నువ్వులు (కాలా తిల్) శరీరానికి అవసరమైన పలు పోషకాలను అందించే ఆహారమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కెఫీన్ తాత్కాలికంగా నిద్రమత్తును తగ్గించగలిగినా, అది శరీర కణాలకు నేరుగా శక్తిని అందించదు. మెదడులోని అడెనోసిన్ రిసెప్టర్లను కెఫీన్ నిరోధించడం ద్వారా అలస ట భావనను కొంతసేపు దాచిపెడుతుంది. కెఫీన్ ప్రభావం తగ్గిన తర్వాత మళ్లీ అలసట లేదా నిద్రమత్తు ఎక్కువగా అనిపిస్తుంది. దీనికి భిన్నంగా శరీరానికి స్థిరమైన శక్తి అందాలంటే కణాల్లో ఏటీపీ (అడెనోసిన్ ట్రైఫాస్ఫేట్) ఉత్పత్తి సక్రమంగా జరగాలి. ఈ ప్రక్రియకు ఐరన్, కాపర్, మెగ్నీషియం, బి–కాంప్లెక్స్ విటమిన్లు వంటి సూక్ష్మ పోషకాలు అవసరం. నల్ల నువ్వుల లోని ప్రత్యేకత వాటి పైపొరలోనే ఉంటుంది. తెల్ల నువ్వులతో పోలిస్తే నల్ల నువ్వులు సహజమైన బయటి పొరతో ఉంటాయి. ఇందులో శరీర జీవక్రియలకు అవసరమైన పలు ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ముఖ్యంగా ఐరన్ శరీరంలో హిమోగ్లోబిన్ తయారీలో కీలక పాత్ర పోషిస్తుంది. హిమోగ్లోబిన్ ఊపిరితిత్తుల నుంచి శరీరంలోని వివిధ అవయవాలు, కణజాలాలకు ఆక్సిజన్‌ను చేరవేస్తుంది. ఐరన్ లోపం ఉన్నప్పుడు శరీర కణాలకు తగినంత ఆక్సిజన్ అందక అలసట, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఐరన్‌తోపాటు కాపర్ కూడా శరీరంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఐరన్‌ను కణాల మైటోకాండ్రియాకు చేరవేసే ప్రక్రియలో కాపర్ సహాయపడుతుంది. నల్ల నువ్వుల్లో ఐరన్, కాపర్ రెండూ ఉండటం వల్ల శరీర కణాల్లో శక్తి ఉత్పత్తికి అవసరమైన ప్రక్రియలకు ఇవి తోడ్పడతాయి. నల్ల నువ్వుల్లో విటమిన్ బి1 (థయామిన్), బి3 (నియాసిన్), బి6తో పాటు మెగ్నీషియం కూడా ఉంటాయి. ఇవి కార్బోహైడ్రేట్ల జీవక్రియను సక్రమంగా నిర్వహించడంలో, నరాలు, కండరాల పనితీరును నియంత్రించడంలో సహాయపడతాయి. దీంతో కండరాల బలహీనత, నరాల అలసట వంటి సమస్యలను తగ్గించడంలో పోషకపరంగా ఉపయోగపడతాయి. నల్ల నువ్వులపై జరిగిన కొన్ని పరిశోధనలు కూడా వీటిలోని పోషక విలువలను సూచిస్తున్నాయి. నల్ల నువ్వులలో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గించడంలో సహాయపడతాయని కొన్ని అధ్యయనాలు పేర్కొన్నాయి. అధిక ఆక్సిడేటివ్ స్ట్రెస్ కణాల్లోని మైటోకాండ్రియాను దెబ్బతీసి శక్తి ఉత్పత్తిని ప్రభావి తం చేస్తుంది. అందువల్ల యాంటీఆక్సిడెంట్ లక్షణాలు కలిగి న ఆహారాలను తీసుకోవడం మొత్తం ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటుంది. నల్ల నువ్వుల పొడిని ప్రతిరోజూ తీసుకున్నప్పుడు రక్తనాళాల పనితీరులో మెరుగుదల కనిపించడంతో పాటు సిస్టోలిక్ రక్తపోటు కొంత తగ్గినట్లు ఒక అధ్యయనం సూచించింది. రక్తనాళాల పనితీరు మెరుగ్గా ఉంటే శరీరంలోని వివిధ అవయవాలకు ఆక్సిజన్, పోషకాలు సక్రమంగా చేరేందుకు సహాయపడుతుంది. అయితే నల్ల నువ్వులు రక్త పోటు లేదా అలసటకు చికిత్సగా భావించకూడదు. నల్ల నువ్వు ల్లో సెసమిన్, సెసమోలిన్ వంటి లిగ్నాన్లు కూడా ఉంటాయి. వీటికి యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇవి నాడీ కణాలను ఆక్సిడేటివ్ ఒత్తిడి నుంచి రక్షించడంలో సహాయపడతాయని చెబుతున్నారు. నల్ల నువ్వులను ఎలా తీసుకుంటామన్నదీ ముఖ్యమే. వాటిని పచ్చిగా, పూర్తిగా తినడం కంటే తేలికగా వేయించి, ఆ తర్వాత కొద్దిగా పొడిగా చేసుకు ని తీసుకోవడం మంచిదని సూచిస్తున్నా రు. నువ్వుల బయటి పొరలో ఆక్స లేట్లు, ఫైటిక్ యాసిడ్ వంటి యాంటీ న్యూట్రియం ట్లు ఉండటంతో పచ్చి నువ్వు ల్లోని కొన్ని పోషకాలు శరీరానికి పూర్తిగా అందవు. తక్కువ మంటపై రెండు నుంచి మూడు నిమిషాలు తేలికగా వేయించి, తర్వాత బరకగా పొడి చేసుకోవచ్చు.

## ఆహారాలను కట్ చేసేందుకు ఎలాంటి చాపింగ్ బోర్డులను ఉపయోగించాలి..?



ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంపై చాలామంది శ్రద్ధ పెడుతుంటారు. అయితే ఆ ఆహారాన్ని తయారు చేసే సమయంలో ఉపయోగించే వస్తువుల విషయంలో మాత్రం అంతగా దృష్టి పెట్టరు. ముఖ్యంగా కూరగాయలు, పండ్లు, మాంసం వంటి ఆహార పదార్థాలను కట్ చేయడానికి ఉపయోగించే చాపింగ్ బోర్డు విషయంలో పరిశుభ్రత, క్రాస్ కంటామినేషన్ వంటి అంశాలను తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. మనం ఎలాంటి ఆహారాన్ని తయారు చేస్తున్నామనే దానిపై కూడా చాపింగ్ బోర్డు ఎంపిక ఆధారపడి ఉంటుంది. ప్లాస్టిక్, చెక్క, స్టీల్.. ఇలా వివిధ రకాల చాపింగ్ బోర్డులు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఒక్కో రకానికి కొన్ని ప్రయోజనాలు, కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. ముఖ్యంగా పరిశుభ్రత, కత్తి పదును, నిర్వహణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని వీటిని ఎంచుకోవాల్సి ఉంటుంది. ప్లాస్టిక్ చాపింగ్ బోర్డులు తేలికగా ఉండటంతోపాటు తక్కువ ధరకు లభిస్తాయి. డిష్‌వాషర్‌లో కూడా సులభంగా శుభ్రం చేసుకోవచ్చు. అయితే కత్తితో పదేపదే కోయడం వల్ల వీటి ఉపరితలంపై లోతైన గాట్లు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఆ గాట్లలో బ్యాక్టీరియా పేరుకుపోయే ప్రమాదం ఉంటుంది. చెక్క బోర్డులతో పోలిస్తే ప్లాస్టిక్ బోర్డులు కత్తుల పదును త్వరగా తగ్గిస్తాయి. అలాగే కాలక్రమంలో వీటి నుంచి మైక్రోప్లాస్టిక్ కణాలు ఆహారంలోకి చేరే అవకాశం ఉందనే ఆందోళనలు కూడా ఉన్నాయి. చెక్కతో తయారు చేసిన చాపింగ్ బోర్డులు కత్తి బ్లేడ్ పదును కాపాడటంలో సహాయపడతాయి. చెక్కలో సహజసిద్ధమైన యాంటీమైక్రోబయల్ లక్షణాలు ఉండటం వల్ల బ్యాక్టీరియా ఉపరితలం నుంచి దూరమై, నిర్వీర్యం కావడానికి సహాయపడతాయి. అయితే చెక్క బోర్డులకు ప్రత్యేకమైన నిర్వహణ అవసరం. వాటిని క్రమం తప్పకుండా నూనెతో సంరక్షించాలి. చేతితో శుభ్రం చేయడం మంచిది. ఎక్కువసేపు నీటిలో నానబెడితే చెక్క వంకరగా మారడం లేదా పగుళ్లు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇక స్టీల్ చాపింగ్ బోర్డులు పూర్తిగా పోరస్ లేని ఉపరితలంతో ఉంటాయి. ఇవి తుప్పు పట్టకుండా ఉండటంతో పాటు, అచ్చు ఏర్పడే అవకాశం తక్కువగా ఉంటుంది. వాసనలను కూడా పీల్చుకోవు. చాలా కాలం మన్నికగా ఉండటంతో పాటు సులభంగా శానిటైజ్ చేసుకోవచ్చు. అందువల్ల పరిశుభ్రత పరంగా ఇవి ఉపయోగకరంగా ఉంటాయి. అయితే స్టీల్ బోర్డులకు కూడా కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. గట్టి ఉపరితలం కారణంగా కత్తి అంచు త్వరగా మొద్దుబారే అవకాశం ఉంటుంది.

## రోజూ అనేక నిర్ణయాలు తీసుకుంటూ మెదడు మానసికంగా అలసిపోతుంటే ఏం చేయాలి..?

రోజువారీ జీవితంలో ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు ఎన్నో నిర్ణయాలు తీసుకుంటుంటారు. ఏం తినాలి, ఏం ధరించాలి, ఎప్పుడు ఏ పని చేయాలి, ఎవరికి మెసేజ్ చేయాలి, పనిలో ఏ నిర్ణయం తీసుకోవాలి వంటి చిన్నా పెద్ద ఎంపికలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. అయితే ఇలా వరుసగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల మెదడుపై మానసిక భారం పెరిగి, కొంతసేపటికి అలసటకు దారితీసే అవకాశం ఉంటుంది. దీనినే డెసిషన్ ఫటీగ్ లేదా నిర్ణయాల వల్ల కలిగే మానసిక అలసటగా పిలుస్తారు. ఇది ఏకాగ్రత, ఆలోచనా సామర్థ్యం, తదుపరి నిర్ణయాలు తీసుకునే విధానాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఒకే రోజులో పదుల సంఖ్యలో నిర్ణయాలు తీసుకోవాల్సి రావడం సాధారణమే. వాటిలో కొన్ని చాలా చిన్నవిగా అనిపించినప్పటికీ, ప్రతి ఎంపికను పరిశీలించడం, వివిధ అవకాశాలను బేరీజు వేయడం, నిర్ణయం సరైనదేనా కాదా అని ఆలోచించడం మెదడుకు మానసిక శ్రమను కలిగిస్తుంది. ముఖ్యంగా అనిశ్చితి ఎక్కువగా ఉన్నప్పుడు, అనేక ఎంపికల మధ్య నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు లేదా తీసుకున్న నిర్ణయానికి



బాధ్యత వహించాల్సి వచ్చినప్పుడు ఈ మానసిక భారం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. మానసిక అలసటపై జరిగిన పరిశోధనలు ఇది ఏకాగ్రత తగ్గడం, ఆలోచించే వేగం మందగించడం, తప్పులు పెరగడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు వంటి సమస్యలతో సంబంధం కలిగి ఉంటుందని సూచిస్తున్నాయి. మానసిక అలసటకు లోనైనప్పుడు దాని ప్రభావం ఏకాగ్రతపై స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యమైన పని పూర్తి చేయడానికి కూర్చున్నప్పటికీ పదేపదే ఫోన్ చూడటం, ఒకే పేరాగ్రాఫ్‌ను మళ్లీ మళ్లీ చదవడం లేదా పని ఎక్కడి నుంచి ప్రారంభించాలో అర్థం కాకపోవడం వంటివి జరుగుతాయి. దీంతో తమ ఏకాగ్రత సామర్థ్యం తగ్గిపోయిందని చాలా మంది భావిస్తారు. అయితే ప్రతిసారీ సమస్య నేరుగా ఏకాగ్రత లోపం కావాల్సిన అవసరం లేదు. రోజంతా వరుసగా ఎన్నో ఎంపికలు చేయడం వల్ల మెదడు ముందుగానే అలసిపోయి ఉంటుంది. దాంతో తర్వాత చేయాల్సిన పనులపై దృష్టి పెట్టడం మరింత కష్టంగా మారుతుంది. అయితే ఎన్ని నిర్ణయాలు తీసుకున్నామన్నది మాత్రమే ముఖ్యం కాదు.

## జీర్ణాశయంలో ఇన్ఫెక్షన్ వచ్చిన వారు ఎలాంటి ఆహారాలను తీసుకోవాలి..

కడుపులో ఇన్ఫెక్షన్, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు వచ్చినప్పుడు జీర్ణవ్యవస్థకు విశ్రాంతి ఇవ్వాలని చాలామంది భావిస్తారు. అందుకే అరటిపండు, అన్నం, యాపిల్‌సాస్, టోస్ట్‌తో కూడిన బ్రాట్ డైట్ ను చాలాకాలంగా పాటిస్తున్నారు. అయితే కేవలం ఈ నాలుగు ఆహారాలకే పరిమితం కావడం వల్ల శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు అందవని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. వాంతులు, తీవ్రమైన విరేచనాలు తగ్గుముఖం పట్టిన తర్వాత క్రమంగా వైవిధ్యమైన, ముఖ్యంగా ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం జీర్ణవ్యవస్థ కోలుకోవడానికి సహాయపడుతుంది. కలుషితమైన ఆహారం లేదా నీటి కారణంగా వచ్చే కడుపు ఇన్ఫెక్షన్ జీర్ణవ్యవస్థ సాధా రణ పనితీరును ప్రభావితం చేస్తుం ది.



దీంతో విరేచనాలు, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సమయంలో తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థపై భారం తగ్గుతుంది. అయితే కోలుకునే ప్రక్రియలో శరీరానికి ద్రవాలు, ఎలక్ట్రోలైట్లు మాత్రమే కాకుండా తగినంత శక్తి, విటమిన్లు, ఖనిజాలు, ఇతర పోషకాలు కూడా అవసరం. అరటి పండ్లు, అన్నం, యాపిల్‌సాస్, టోస్ట్‌తో కూడిన బ్రాట్ డైట్‌లోని ఆహారాలు సాధారణంగా తేలికగా జీర్ణమవుతాయి. అందువల్ల కడుపు ఇబ్బందిగా ఉన్నప్పుడు ఇవి కొంత ఉపశమనం కలిగిస్తాయి. అయితే ఈ ఆహారాల్లో పోషక వైవిధ్యం పరిమితంగా ఉంటుంది. వాంతులు, విరేచనాల వల్ల శరీరంలోని నీరు, ఎలక్ట్రోలైట్లు తగ్గిపోయే అవకాశం ఉన్నందున కేవలం ఈ ఆహారాలపై ఆధారపడటం పూర్తిస్థాయి పోషక అవసరాలను తీర్చదు. వాంతులు, తీవ్రమైన విరేచనాలు తగ్గిన తర్వాత ఒక్కసారిగా సాధారణ ఆహారానికి మారకుండా క్రమంగా వివిధ రకాల ఆహారాలను తీసుకోవడం మంచిది. ముఖ్యంగా అరటిపండ్లు, ఓట్స్, యాపిల్స్, క్యారెట్లు, ఆలుగడ్డలు వంటి కరిగే ఫైబర్ (సాల్యుబుల్ ఫైబర్) ఉండే ఆహారాలు ఈ దశలో ఉపయోగకరంగా ఉంటాయి. కరిగే ఫైబర్ జీర్ణవ్యవస్థలో నీటిని పీల్చుకుని జెల్ లాంటి పదార్థంగా మారుతుంది. దీంతో పలుచని విరేచనాలను కొంతవరకు నియంత్రించడంలో సహాయపడుతుంది. ఫైబర్ కేవలం మలాన్ని నియంత్రించడానికే కాకుండా పేగుల్లోని ప్రయోజనకరమైన బ్యాక్టీరియాకు ఆహారంగా కూడా పనిచేస్తుంది. కడుపు ఇన్ఫెక్షన్ సమయంలో పేగులలోని మైక్రోబయోమ్ ప్రభావితమయ్యే అవకాశం ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉండే మొక్కల ఆధారిత ఆహారాలను క్రమంగా తీసుకోవడం వల్ల పేగుల్లోని మంచి బ్యాక్టీరియా తిరిగి అభివృద్ధి చెందడానికి సహాయపడుతుంది.

## రోజువారీ ప్రోటీన్ అవసరాలను సోయాబీన్స్ తీరుస్తాయా..

భారతీయుల ఆహారంలో ప్రోటీన్ లోపం ఒక ముఖ్యమైన పోషకాహార సమస్యగా మారుతోంది. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆహార సర్వేలు, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్‌ఎస్–5), భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్)కు సంబంధించిన నివేదికల ప్రకారం.. 70 శాతానికి పైగా భారతీయుల్లో ప్రోటీన్ లోపం ఉన్నట్లు, దాదాపు 90 శాతం మందికి తమ రోజువారీ ప్రోటీన్ అవసరం ఎంత అన్నదానిపై స్పష్టమైన అవగాహన లేదని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో, సులభంగా లభించే మొక్కల ఆధారిత ప్రోటీన్ వనరులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. రోజువారీ ఆహారంలో అన్నం, గోధుమ పిండి వంటి ధాన్యాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. వీటిలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండడంతోపాటు, శరీరానికి అందే ప్రోటీన్ పరిమాణం కూడా పరిమితంగానే ఉంటుంది. అందుకే ప్రోటీన్ అవసరాలను తీర్చుకునేందుకు సోయాబీన్స్ వంటి పోషక విలువలు అధికంగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. మొక్కల ఆధారిత ఆహారాల్లో సోయాబీన్స్ ను ప్రోటీన్‌లకు మంచి వనరుగా పరిగణిస్తారు. అయితే పచ్చి సోయాబీన్స్‌ను ఉడికించిన తర్వాత అందులో ఎంత ప్రోటీన్ ఉంటుంది ? ఒక కప్పు ఉడికించిన సోయాబీన్స్ రోజువారీ ప్రోటీన్ అవసరాల్లో ఎంతవరకు తీర్చగలదు ? అనే విషయాలు చాలామందికి తెలియవు. ఐసీఎంఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) రూపొందించిన ఇండియన్ ఫుడ్ కంపోజిషన్ టేబుల్స్ (ఐఎఫ్‌సీటీ) 2017 ప్రకారం.. 100 గ్రాముల పచ్చి సోయాబీన్స్‌లో సుమారు 35.58 గ్రాముల నుంచి 37.80 గ్రాముల వరకు ప్రోటీన్ ఉంటుంది. అయితే సోయాబీన్స్‌ను ఉడికించినప్పుడు అవి గణనీయమైన మొత్తంలో నీటిని పీల్చుకుంటాయి. దీంతో వాటి బరువు, పరిమాణం పెరుగుతుంది. సుమారు 170 గ్రాముల బరువుండే ఒక కప్పు ఉడికించిన సోయాబీన్స్‌లో దాదాపు 28 నుంచి 31 గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది.

ఐసీఎంఆర్–ఎన్ఐఎన్ 2020 పోషకాహార మార్గదర్శకాల ప్రకారం.. శరీర బరువులో ప్రతి కిలోగ్రాముకు 0.66 గ్రాముల ప్రోటీన్ అవసరం ఉంటుందని అంచనా. సిఫార్సు చేసిన రోజువారీ పరిమాణం (ఆర్‌డీఏ) ప్రతి కిలోగ్రాము శరీర బరువుకు 0.83 గ్రాములుగా ఉంది. ఉదాహరణకు 60 కిలోల బరువున్న ఒక వ్యక్తికి రోజుకు సుమారు 50 గ్రాముల ప్రోటీన్ అవసరం అవుతుంది. ఈ లెక్కన ఒక కప్పు ఉడికించిన సోయాబీన్స్ తీసుకోవడం ద్వారా రోజువారీ ప్రోటీన్ అవసరాల్లో 55 నుంచి 60 శాతం వరకు పొందవచ్చు. సోయాబీన్స్‌లో శరీరానికి అవసరమైన తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. అందువల్ల దీనిని పూర్తి స్థాయి ప్రోటీన్ వనరుగా పరిగణిస్తారు. ఇతర పప్పుధాన్యాలు, ధాన్యాల్లో కొన్ని ముఖ్యమైన అమైనో ఆమ్లాలు తక్కువగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, సోయాలో అవన్నీ ఉండటం దీని ప్రత్యేకత. సోయాబీన్స్‌ను వండుకుని తినడం వల్ల వాటిలో సహజంగా ఉండే కొన్ని యాంటీ న్యూట్రిషనల్ ఫ్యాక్టర్ల ప్రభావం కూడా తగ్గుతుంది. పచ్చి సోయాబీన్స్‌లో ట్రిప్సిన్ ఇన్హిబిటర్లు, లెక్టిన్లు, ఫైటేట్లు వంటి పదార్థాలు ఉంటాయి. ఇవి జీర్ణక్రియలో కొన్ని ఎంజైమ్‌ల పనితీరును ప్రభావితం చేయడంతోపాటు, కొన్ని ఖనిజాల శోషణను అడ్డుకుంటాయి. అయితే సోయాబీన్స్‌ను నానబెట్టి ఉడికించడం లేదా ప్రెజర్ కుకింగ్ చేయడం వంటి వేడి ప్రక్రియల ద్వారా వీటి ప్రభావం గణనీయంగా తగ్గుతుంది. దీంతో ప్రోటీన్ జీర్ణం కావడం, శరీరానికి అమైనో ఆమ్లాలు అందడం మెరుగుపడుతుంది. రోజువారీ ప్రోటీన్ అవసరాలను సోయాబీన్స్ వంటి మొక్కల ఆధారిత ఆహారాల ద్వారా తీర్చుకోవడం కండరాల ఆరోగ్యానికి కూడా ఉపయోగపడుతుంది. తగినంత ప్రోటీన్లను తీసుకోవడం కండరాల నిర్మాణం, మరమ్మత్తు, శరీర జీవక్రియలకు తోడ్పడుతుంది. సరైన పరిమాణంలో తీసుకున్నప్పుడు సోయా ప్రోటీన్ కూడా కండరాల ప్రోటీన్ సంశ్లేషణకు సహాయపడుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే రోజంతా అవసరమైన ప్రోటీన్ మొత్తాన్ని సోయాబీన్స్ నుంచే పొందాలని నిపుణులు సూచించడం లేదు. సోయాబీన్స్‌లో రాఫినోస్, స్టాకియోస్ వంటి సంక్లిష్ట ఒలిగోశాకరైడ్లు ఉంటాయి. ఇవి పేగుల్లోని బ్యాక్టీరియా ద్వారా పులియడం వల్ల కొంతమందిలో గ్యాస్, కడుపు ఉబ్బరం, జీర్ణ సంబంధిత అసౌకర్యం కలుగుతాయి. ముఖ్యంగా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారు ఎక్కువ మొత్తంలో తీసుకుంటే ఈ సమస్యలు మరింతగా కనిపించే అవకాశం ఉంటుంది. అందువల్ల రోజువారీ ఆహారంలో సోయాబీన్స్‌ను సరైన మోతాదులో చేర్చుకోవడం మంచిది.



## శాకాహారులకు ప్రోటీన్లను అందించే అత్యుత్తమ ఆహారం ఇది..



శాకాహారులు, వీగన్లు రోజువారీ ఆహారంలో తగినంత ప్రోటీన్ పొందేందుకు ఎన్నో మొక్కల ఆధారిత ఆహారాలను ఎంచుకుంటారు. అయితే ప్రోటీన్‌తోపాటు ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు వంటి పలు పోషకాలను ఒకేసారి అందించే చిన్న విత్తనం ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టిని ఆకర్షిస్తోంది. అదే హెంప్ హార్ట్స్. పొట్టు తొలగించిన హెంప్ విత్తనాలు తినడానికి సులభంగా ఉండటంతోపాటు, తక్కువ పరిమాణంలోనే పలు ముఖ్యమైన పోషకాలను అందిస్తాయి. హెంప్ హార్ట్స్‌లో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. సుమారు రెండు టేబుల్ స్పూన్ల హెంప్ హార్ట్స్‌లో 8.4 గ్రాముల వరకు మొక్కల ఆధారిత ప్రోటీన్ లభిస్తుంది. అలాగే శరీరానికి అవసరమైన మొత్తం తొమ్మిది ఎసెన్షియల్ అమైనో యాసిడ్లు ఇందులో ఉంటాయి. అందువల్ల వీటిని కంప్లీట్ ప్రోటీన్ అందించే ఆహార వనరుగా తీసుకోవచ్చు. ముఖ్యంగా శాకాహారులు, వీగన్లకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది. హెంప్ హార్ట్స్‌లో అర్జినైన్ అనే అమైనో యాసిడ్ కూడా సహజంగా సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తికి సహాయపడుతుంది. నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలు సడలించడంలో, రక్తప్రసరణ సక్రమంగా ఉండటంలో, సాధారణ రక్తపోటు నియంత్రణకు తోడ్పడటంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది.

వీటిలో ప్రోటీన్ మాత్రమే కాకుండా మెగ్నీషియం, ఒమెగా–3 వంటి పోషకాలు కూడా లభిస్తాయి. సుమారు 25 గ్రాములు లేదా రెండు టేబుల్ స్పూన్ల హెంప్ హార్ట్స్‌లో దాదాపు 175 మిల్లీగ్రాముల మెగ్నీషియం, 2.5 గ్రాముల ఏఎల్ఏ ఒమెగా–3 లభిస్తుంది. ఇందులో ఏఎల్ఏ, ఎల్ఏ, జీఎల్ఏ వంటి కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. హెంప్ హార్ట్స్‌లో ఒమెగా–6 నుంచి ఒమెగా–3 నిష్పత్తి సుమారు 2.5:1 నుంచి 3:1 వరకు ఉంటాయి. హెంప్ హార్ట్స్‌లోని పోషకాల కలయిక వాటిని చిన్న పరిమాణంలోనే ఎక్కువ పోషకాలను అందించే ఆహారంగా మారుస్తుంది. ప్రోటీన్, మెగ్నీషియం, ఏఎల్ఏ, జీఎల్ఏ, అర్జినైన్ వంటి పోషకాలు ఇందులో ఉండటం వల్ల రోజువారీ ఆహారంలో వీటిని చేర్చుకోవచ్చు. హెంప్ హార్ట్స్‌లోని కొవ్వు ఆమ్లాలు శరీరంలోని వాపు సంబంధిత ప్రక్రియలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా జీఎల్ఏ వాపును నియంత్రించే మార్గాల్లో భాగస్వామ్యం అవుతుందని, వీటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు చర్మం, గుండె ఆరోగ్యానికి కూడా తోడ్పడతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. హెంప్ విత్తనాలకు భారతీయ సంస్కృతి, పురాణాలతో కూడా ఒక ఆసక్తికరమైన సంబంధం ఉంది. సముద్ర మథనం సమయంలో ఉద్భవించిన హాలాహల విషాన్ని లోకరక్షణ కోసం పరమశివుడు స్వీకరించి తన కంఠంలో నిలుపుకున్న కథ తెలిసిందే. ఈ కారణంగానే శివుడిని నీలకంఠుడిగా పిలుస్తారు. హెంప్ మొక్కకు సంబంధించిన విత్తనాలపై కూడా ఈ పురాణగాథతో ముడిపడిన సాంస్కృతిక ప్రస్తావనలు ఉన్నాయి.

రోజువారీ ఆహారంలో హెంప్ హార్ట్స్‌ను పెద్ద మొత్తంలో తీసుకోవాల్సిన అవసరం లేదు. మొదట ఒక టేబుల్ స్పూన్ అంటే సుమారు 12 నుంచి 13 గ్రాములతో ప్రారంభించాలి. వీటిని పెరుగు, ఓట్స్, స్మూతీలు, సలాడ్లు వంటి ఆహారాల్లో కలుపుకోవచ్చు. అలాగే పప్పు, చిల్లా పిండిలో లేదా గోధుమ పిండిలో కూడా హెంప్ హార్ట్స్‌ను కలిపి తీసుకోవచ్చు. ఇలా సాధారణంగా తీసుకునే ఆహారాల్లోనే వీటిని చేర్చుకోవడం ద్వారా అదనంగా మొక్కల ఆధారిత ప్రోటీన్‌తో పాటు మెగ్నీషియం, ఒమెగా–3 తదితర పోషకాలను ఆహారంలో చేర్చుకోవచ్చు. అయితే ఏదైనా కొత్త ఆహారాన్ని రోజువారీ డైట్‌లో చేర్చుకునే ముందు వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు, ఆహార అలవాట్లను పరిగణనలోకి తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

## ఫిలిప్స్ నుంచి తొలి స్మార్ట్‌ఫోన్ ..

ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ ఫిలిప్స్‌దేశీయ మార్కెట్‌లో తొలి స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. S7221 5G పేరుతో ఈ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. ఇతర స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ధరలు పెంచేస్తున్న వేళ.. కంపెనీ బడ్జెట్ ధరలో ఈ స్మార్ట్‌ఫోన్‌ను తీసుకొచ్చింది. ఇంతకీ ఫిలిప్స్ కొత్త ఫోన్ ఎలా ఉందో వివరాలు చూద్దాం.. ఫిలిప్స్ S7221 5G స్మార్ట్‌ఫోన్‌లో 6.67 అంగుళాల హెచ్‌డీ+ ఐపీఎస్ ఎల్‌సీడీ డిస్‌ప్లే ఇచ్చారు. ఇది ఆండ్రాయిడ్ 16తో పనిచేస్తుంది. Unisoc T765 ప్రాసెసర్‌ను అమర్చారు. వెనుక వైపు 64 ఎంపీ ప్రధాన కెమెరా ఇచ్చారు. ముందు వైపు 16 ఎంపీ సెల్ఫీ కెమెరా అందించారు. ఇందులో 5,700 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. సైడ్ మౌంట్ ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఇచ్చారు. ఈ ఫోన్ బరువు 210 గ్రాములు. ఫోన్‌తో పాటు ఛార్జర్, ఎజెక్ట్ పిన్, టైప్–సి డేటా కేబుల్, స్క్రీన్ ప్రొటెక్టర్, ఫోన్ ప్రొటెక్ట్ కేస్ ఇస్తున్నారు.





# యాపిల్ కొత్త సీఈఓ వేతనం ఎంతంటే..?



యాపిల్ నూతన సీఈఓగా బాధ్యతలు చేపట్టిన జాన్ టెర్నస్ కు సంస్థ భారీ వేతన ప్యాకేజీని ప్రకటించింది. వార్షిక వేతనం, షేర్ల రూపంలో లభించే ప్రోత్సాహకాలతో కలిపి ఈ ఆర్థిక సంవత్సరానికి ఆయన మొత్తం 58 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.551 కోట్లు) అందుకోనున్నారు. ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉన్న టిమ్ కుక్‌కు సుమారు 47 మిలియన్ డాలర్లు (సుమారు రూ.446 కోట్లు) అందనున్నాయి. ఈ వివరాలను అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కి సమర్పించిన నివేదికలో యాపిల్ వెల్లడించింది. టెర్నస్‌కు 3 మిలియన్ డాలర్లు వార్షిక మూల వేతనం కాగా.. మరో 55 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్ అవార్డులు అందనున్నాయి. ఆ స్టాక్‌లో 75 శాతం యాపిల్ షేరు పనితీరుతో ముడిపడి ఉంటుంది. మిగతా 25 శాతం కాలానుగుణంగా ఆయనకు దక్కుతుంది. మరోవైపు కుక్‌కు 2 మిలియన్ డాలర్ల వార్షిక వేతనం.. 2027 ఆర్థిక సంవత్సరానికి 45 మిలియన్ డాలర్ల విలువైన షేర్లు అందనున్నాయి. సెప్టెంబరు 1న జాన్ టెర్నస్ యాపిల్ సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ విభాగానికి సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. 2001లో యాపిల్ సంస్థలో చేరిన టెర్నస్.. ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్, ఎయిర్‌పాడ్స్ తదితర ఉత్పత్తుల హార్డ్‌వేర్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.

# 'పీబీ పాస్' ద్వారా అపరిమిత ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్




పైసాబజార్ ద్వారా కొత్తగా క్రెడిట్ కార్డు తీసుకునే వినియోగదారులకు ఏడాది పాటు అపరిమిత ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ కల్పించే 'పీబీ పాస్'ను తీసుకొచ్చింది. పైసాబజార్ యాప్ ద్వారా వినియోగదారులు తమ క్రెడిట్ కార్డు మొదటి చెల్లింపు పూర్తి చేయగానే ఈ కాంప్లిమెంటరీ పాస్ అన్‌లాక్ అవుతుంది. కాలిన్సన్ ఇంటర్నేషనల్ భాగస్వామ్యంతో ప్రారంభించిన ఈ పీబీ పాస్ 'లాంజ్‌కీ' సహకారంతో 800 పైగా దేశీయ, అంతర్జాతీయ విమానాశ్రయాల్లోని 1,800 పైగా ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లు, ప్రయాణ అనుభవాల గ్లోబల్ నెట్‌వర్క్‌కు యాక్సెస్ కల్పిస్తుంది. ఈ సందర్భంగా పైసాబజార్ సీఈఓ సంతోష్ అగర్వాల్ మాట్లాడుతూ మా వినియోగదారులకు అత్యుత్తమ ప్రయోజనాలు అందించడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటామన్నారు. క్రెడిట్ కార్డు వినియోగదారులు ఎక్కువగా కోరుకునే ప్రయోజనాలలో ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ ఒకటన్నారు. ఈ పాస్ అందించే అపరిమిత యాక్సెస్ ద్వారా అర్హులైన కస్టమర్లు విజిట్ పరిమితుల గురించి చింతించకుండా ఏడాది పొడవునా లాంజ్, ప్రయాణ అనుభవాలను ఆస్వాదించే స్వేచ్ఛను అందిస్తున్నామన్నారు. ఈ నెట్‌వర్క్‌లో డైనింగ్ అవుట్‌లెట్లు, స్పా, స్లీప్ పాడ్స్ వంటివి కూడా ఉన్నాయన్నారు. అదనపు మెంబర్‌షిప్‌లు, రిజిస్ట్రేషన్‌లు అవసరం లేకుండా సులభమైన క్యూఆర్ కోడ్‌ఆధారిత విధానం ద్వారా కస్టమర్లు ఈ లాంజ్‌కీ నెట్వర్క్‌ను వినియోగించుకోవచ్చన్నారు. క్రెడిట్ కార్డులతో లభించే ప్రయోజనాలలో ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ అత్యంత విలువైనదన్నారు. ఈ యాక్సెస్ కార్డు నిర్దిష్ట అర్హత ప్రమాణాలు, ఖర్చు పరిమితులు, కాంప్లిమెంటరీ విజిట్లసంఖ్యపై ఆధారపడి ఉంటుందన్నారు. అపరిమిత యాక్సెస్‌తో పీబీ పాస్ వినియోగదారులకు విజిట్పరిమితుల గురించిచింతించకుండా ఏడాది పొడవునా ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లు, ప్రయాణ అనుభవాలను ఆస్వాదించే వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు.

# దిగొస్తున్న బంగారం, వెండి ధరలు



పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. దాంతో మార్కెట్లకు చమురు సెగ తగులుతోంది. ఒకవైపు ముడిచమురు ధరలు పెరుగుతుంటే.. లోహాలకు మాత్రం డిమాండ్ తగ్గుతోంది. దీంతో బంగారం, వెండి ధరలు దిగొస్తున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల మేలిమి బంగారం (Gold) రూ.1.55 లక్షలు పలుకుతోంది. నిన్న ఆ ధర రూ.1.57 లక్షలుగా ఉంది. దీని ధర రూ.రెండు వేల వరకు దిగొచ్చింది. మరోవైపు, కేజీ వెండి రూ.2,37,486 నుంచి రూ. 2,34,478కు పడిపోయింది. ఒక కేజీకి రూ.మూడువేల మేర ధర తగ్గింది. గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,143గా ఉంది. వెండి ఫ్యూచర్స్ కేజీకి రూ.2,32,625గా ట్రేడవుతోంది. స్పాట్ గోల్డ్ 4307డాలర్లుగా ఉండగా.. స్పాట్ సిల్వర్ 63.79 డాలర్లు పలుకుతోంది. మామూలుగా పెళ్లిళ్లు, శుభకార్యాల సమయంలో బంగారం (Gold) ధర పెరుగుతుంటుంది. అలాగే పెట్టుబడికి సాధనం. మార్కెట్లు అస్థిరతలకు గురైన సమయంలో మదుపర్లు పుత్తడిలో పెట్టుబడులనే సురక్షితమని భావిస్తుంటారు. కానీ పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో.. బంగారం, వెండి ధరల విషయంలో రివర్స్ ట్రెండ్ కనిపిస్తోంది. బంగారం, వెండి వంటి విలువైన లోహాల ధరలు అంతర్జాతీయ విపణికి అనుగుణంగా మారుతుంటాయి.

# నష్టాల్లో ముగిసిన సూచీలు




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చడం, చమురు ధరలు పెరగడం, భవిష్యత్తులో అమెరికా వడ్డీ రేట్ల పెంపు తప్పదనే ఆందోళనలు మార్కెట్ సెంటి మెంట్‌పై ప్రభావం చూపించాయి. ఐటీ, రియాల్టీ, ఆటో స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఈ కారణంగా వరుసగా మూడో రోజు సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ ఉదయం 76,471.32 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,944.28) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ.. ఓ దశలో 700 పాయింట్లకు పైగా పతనమైంది. ఇంట్రాడేలో 76,135.72 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయి.. చివరికి 373.93 పాయింట్లు కోల్పోయి 76,570.35 వద్ద ముగిసింది. నిఫ్టీ 141.35 పాయింట్లు పతనమై 23,914.45 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.97గా ఉంది. సెన్సెక్స్ 30లో ప్రధానంగా ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్, బీఈఎల్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. ఆదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, పవర్ గ్రిడ్, ఎన్‌టీపీసీ, టైటాన్, రిలయన్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 95.09 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,303.19 వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్‌లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ సూచీలు కూడా నష్టాలను మూటగట్టుకున్నాయి.

# బిగ్ బ్యాటరీతో వివో T5 5G

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ వివో కొత్త స్మార్ట్‌ఫోన్ లాంచ్ చేసింది. T సిరీస్‌లో ఐదో మోడల్ వివో టీ5 (Vivo T5 5G)ను విడుదల చేసింది. స్మార్ట్‌ఫోన్ ధరలు పెరుగుతున్న వేళ ఇతర ఫోన్ కంపెనీలు ఎల్‌సీడీ డిస్‌ప్లేల వైపు మొగ్గు చూపుతుండగా.. వివో అమోలెడ్ డిస్‌ప్లేనే తీసుకురావడం విశేషం. మూడేళ్ల ఓఎస్ అప్‌గ్రేడ్స్+ ఐదేళ్ల సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తారు. ఇటీవల లాంచైన ఐకూ జెడ్ 11 పోలిన ఫీచర్లతో ఈ మొబైల్ వస్తుండటం గమనార్హం. ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఆరిజన్ ఓఎస్ 6తో పనిచేస్తుంది. 6.83 అంగుళాల 1.5కే 3డీ కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లే, 144Hz రిఫ్రెష్‌రేట్, 2000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉంటాయి. హెచ్‌డీఆర్ 10+ సపోర్టు, ఐపీ68, ఐపీ69 రేటింగ్‌లు ఇస్తున్నారు. మీడియాటెక్ డైమెన్సిటీ 7500 టర్బో ప్రాసెసర్, మీడియాటెక్ ఎన్‌పీయూ 850 ఏఐ ప్రాసెసింగ్ యూనిట్ ఇచ్చారు. కెమెరా విషయానికొస్తే.. వెనుక వైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా, 8ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. ముందు వైపు 32ఎంపీ కెమెరా ఉంది. 7050mAh బ్యాటరీ, 44W ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. ఫోన్ బరువు 199 గ్రాములు. ధర విషయానికొస్తే.. 6 GB ర్యామ్ + 128 GB స్టోరేజీ ధర రూ.34,999. 8 GB + 128 GB ధర రూ.39,999. 8 GB + 256 GB ధర రూ.44,999. 12 GB + 256 GB ధర రూ.49,999. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్డు హోల్డర్స్‌కు రూ.4 వేలవరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ ఇస్తున్నారు.









## అదరగొట్టిన తిలక్ వర్మ.. దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు దూసుకెళ్లిన సౌత్ జోన్

దులీప్ ట్రోఫీలో సౌత్ జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. నార్త్ జోన్‌తో జరిగిన రెండో సెమీ ఫైనల్‌లో సౌత్ జోన్.. 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో 256/7 స్కోరుతో బుధవారం ఆటను కొనసాగించిన నార్త్ జోన్.. 297 పరుగులకు ఆలౌటైంది. ఈ క్రమంలో 181 పరుగుల లక్ష్యాన్ని సౌత్ జోన్ 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు రికీ భుయ్ (42; 53 బంతుల్లో), నారాయణ్ జగదీశన్ (43; 83 బంతుల్లో) శుభారంభం అందించగా.. కెప్టెన్ తిలక్ వర్మ (51★; 79 బంతుల్లో), రవిచంద్రన్ స్మరన్ (32★; 42 బంతుల్లో) మిగతా పని పూర్తి చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో నార్త్ జోన్ 195 పరుగులకే ఆలౌటైంది. తిలక్ వర్మ (116 నాటౌట్; 250 బంతుల్లో 9×4) శతకంతో మెరవడంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో సౌత్ జోన్ 312 పరుగులు చేసింది. ఈ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అదరగొట్టిన తిలక్ వర్మ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. సెప్టెంబరు 6 నుంచి చెపాక్ స్టేడియంలో దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ మొదలుకానుంది. తుదిపోరులో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ తలపడనుంది.

# ఇంకా చాలా సమయం ఉంది.. అప్పుడే తొందరెందుకు?: రుతురాజ్




సుదీర్ఘ కాలంగా చెన్నై సూపర్ కింగ్స్ ప్రధాన కోచ్ బాధ్యతలను నిర్వర్తించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ వైదొలిగిన సంగతి తెలిసిందే. సీఎస్‌కేకు హెడ్ కోచ్‌గా ఎవరిని నియమిస్తున్నారనే దానిపై ఇంత వరకూ ప్రకటన రాలేదు. తాజాగా ఈ విషయంపై చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ స్పందించాడు. తన అంతర్జాతీయ పునరాగమనంపైనా మాట్లాడాడు. ధోని నుంచి కెప్టెన్సీని తీసుకోవడం కూడా మరింత బాధ్యతను పెంచిందని వ్యాఖ్యానించాడు.

''చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రధాన కోచ్ ఉంటారు. మేనేజ్‌మెంట్ కూడా ఆ దిశగా ఆలోచనలు చేస్తూనే ఉంది. రాబోయే ఐపీఎల్‌కు ఇంకా చాలా సమయం ఉంది. మినీ ఆక్షన్‌కూ గడువు ఉంది. ఇలాంటప్పుడు తొందరపడాల్సిన అవసరం లేదు''

''ఎంఎస్ ధోని నుంచి జట్టు పగ్గాలను అందుకున్నప్పుడు కాస్త సంకోచించా. ఎందుకంటే చాలా బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. ఆ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగానే ఉన్నా. మేం ఐదుసార్లు విజేతగా నిలిచాం. మా జట్టుపై భారీ అంచనాలు ఉంటాయి. అయితే, వీలైనంత వరకూ ఆటను ఆస్వాదిస్తూనే ఉంటా. 2008 నుంచి ప్రతి సీజన్‌లోనూ మేం ఐపీఎల్ ఫేవరెట్లుగానే బరిలోకి దిగాం. మాకు ఎల్లవేళలా మద్దతు ఇస్తూ అభిమానులు అండగా నిలిచారు''. ''ఏడాది పొడవునా పరుగులు చేస్తుంటే .. కచ్చితంగా పిలుపు వస్తుంది. నేను ఆ దిశగానే సాగుతున్నా. తప్పకుండా నాకు అవకాశం వస్తుందనే నమ్మకం ఉంది. అఫ్గాన్‌తో సిరీస్‌కు ఎంపిక కాలేకపోయినందుకు బాధేమీ లేదు. అయితే, జట్టుతోపాటు లేనప్పుడు సన్నద్ధతపైనే దృష్టిపెడతా. దేశవాళీలో నైపుణ్యాలకు పదును పెట్టుకుంటా. ఎప్పుడు ఛాన్స్ వచ్చినా ఆడేందుకు సిద్ధం'' అని రుతురాజ్ వెల్లడించాడు.

# 200శాతం ఫిట్‌గా ఉంటేనే ఆడిస్తాం..

## విమర్శల నేపథ్యంలో మారిన బీసీసీఐ తీరు!



గాయం నుంచి కోలుకున్నారని ఆటగాళ్లను ఎంపిక చేయడం.. ఆ ఆటగాళ్లు ఒక్క మ్యాచ్ కూడా పూర్తిగా ఆడకుండానే మళ్లీ తిరగబెట్టి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు వెళ్లడం ఇటీవల పరిపాటిగా మారింది. దీంతో బీసీసీఐ సెలక్షన్ కమిటీతోపాటు సీవోఈపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్ కోసం మంగళవారం జట్టును ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఇందులో నితీశ్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రా, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణాకు అవకాశం దక్కినా.. వారి ఫిట్‌నెస్‌పై కఠినమైన నిబంధన పెట్టింది. కేవలం 100 శాతం కాదు.. 200 శాతం ఫిట్‌గా ఉంటేనే మ్యాచుల్లో ఆడించాలనే షరతును విధించినట్లు పలు రిపోర్ట్స్ చెబుతున్నాయి. 'అవును.. ఆటగాళ్ల గాయాల విషయంలో బీసీసీఐ కఠినంగా వ్యవహరించనుంది. 200 శాతం సదరు ప్లేయర్ ఫిట్‌గా ఉన్నాడని భావిస్తేనే రిలీజ్ చేయాలని ఇప్పటికే సీవోఈకి స్పష్టమైన ఆదేశాలను ఇచ్చింది'' అని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. అయితే, అఫ్గాన్‌తో సిరీస్‌కు మాత్రం ఈ నలుగురిని ఎంపిక చేసినప్పటికీ.. '200' శాతం ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాలనే షరతును విధించడం గమనార్హం. అఫ్గాన్‌తో సిరీస్ అనంతరం భారత్ ఆసియా గేమ్స్‌లో ఆడనుంది. ఐపీఎల్‌లో గాయపడి ఆటకు దూరమైన హార్దిక్ పాండ్య ఇంకా పూర్తి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో అఫ్గాన్‌తో సిరీస్‌కు ఎంపిక చేయలేదు. ఈ ఆల్‌రౌండర్ ఆసియా క్రీడలకు అందుబాటులోకి వస్తాడని అంచనా వేస్తున్నా.. అప్పటికీ అతడు పూర్తిస్థాయి ఫిట్‌గా ఉంటేనే అవకాశం దక్కనుంది. అక్టోబర్‌లో న్యూజిలాండ్ పర్యటనకు టీమ్‌ఇండియా వెళ్లనుంది. అయితే, కివీస్ ఏతో టీమ్‌ఇండియా A నాలుగు రోజుల మ్యాచ్‌లను ఆడనుంది. ఇరు జట్ల మధ్య మూడు మ్యాచుల సిరీస్‌ను నిర్వహిస్తామని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. భారత్ – కివీస్ రెండు టెస్టుల సిరీస్‌కు దీనిని సన్నాహకంగా వినియోగించుకుంటామని ఆ బోర్డు వెల్లడించింది. న్యూజిలాండ్‌తో భారత్ అక్టోబర్ 22 నుంచి టీ20 సిరీస్‌ను ఆడనుంది. ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టుల సిరీస్‌తో షెడ్యూల్ ఫుల్ బిజీగా ఉండనుంది.

# పాక్ క్రికెటర్ 'ఫేక్ ఇంజూరీ'పై విచారణ!

ఇంగ్లాండ్‌తో రెండో టెస్టు సమయంలో గాయం కారణమని చెప్పి పాక్ క్రికెటర్ ఇమామ్ ఉల్ హక్ బ్యాటింగ్‌కు దిగలేదు. కండరాలు పట్టేశాయని చెప్పి.. రెండు ఇన్నిగ్స్‌ల్లోనూ డగౌట్‌కే పరిమితమయ్యాడు. దీంతో అతడి గాయంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. పాకిస్థాన్ మాజీ చీఫ్ సెలక్టర్ మహ్మద్ వాసిమ్ కూడా ఇమామ్ గాయాలపై విమర్శలు చేశాడు. గతంలోనూ ఇమామ్ ఇలానే వ్యవహరించాడంటూ ఆరోపించాడు. ఈ క్రమంలోనే పాకిస్థాన్ సెలక్షన్ కమిటీ సభ్యుడు ఆకిబ్ జావెద్ కీలక ప్రకటన చేశారు. ఇమామ్ గాయంపై విచారణ చేపడతామని వెల్లడించారు. 'విచారణ చేయబోతున్నాం. కండరాలు పట్టేయడంతో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అతడు బ్యాటింగ్‌కు రాలేదు. ఇది సాధ్యమా? లేకపోతే ఇందులో ఏమైనా మతలబు ఉందా? అనేది దర్యాప్తు చేస్తాం. గాయాలు కావడం ఆటగాళ్లకు సహజమే. గతంలో పలువురు చేతికి లేదా కాలుకు గాయమైనా సరే కట్లు కట్టుకొని మైదానంలోకి దిగిన సందర్భాలనూ చూశాం. కానీ, ఇప్పుడు ఇమామ్ అంశంలో పరిస్థితి భిన్నమైంది. తప్పకుండా విచారణ చేపట్టి చర్యలు తీసుకుం టాం'' అని జావెద్ వెల్లడించారు. ఈ క్రమంలో ఇమామ్ కూడా న్యాయ సలహా కోసం ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు రెండు టెస్టుల్లోనూ ఓడిపోవడంతో పాకిస్థాన్ ఏడుగురిపై వేటు వేసింది. అందులో ఇమామ్ కూడా ఉండ టం గమనార్హం. మరోవైపు ఇమామ్ తనకు నిజంగానే గాయమైనట్లు తెలియజేయాలనే ఉద్దేశంతో షార్ట్ ధరించి పట్టీలు వేసుకొని మరీ వార్మప్ చేస్తూ కెమెరాల్లో కనిపించాడు. దీనిపై ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ స్టువర్ట్ బ్రాడ్ తీవ్ర విమర్శలు గుప్పించాడు.




# ముంబయి కెప్టెన్‌ను తేల్చేది రోహితే!



ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన ముంబయి ఇండియన్స్‌కు కెప్టెన్ మారడం ఖాయం. అయితే కొత్తగా ఆ జట్టు పగ్గాలు ఎవరు చేపట్టాలన్నది నిర్ణయించేది ప్రధానంగా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మేనని సమాచారం. మళ్లీ జట్టు సారథ్యం చేపట్టాలని రోహిత్‌ను కోరగా అందుకతను నిరాకరించినట్లు తెలిసింది. దీంతో ముంబయి యాజమాన్యం.. కెప్టెన్సీని నిర్ణయించే వ్యూహ బృందంలో అతణ్ని చేర్చిందట. మూడేళ్ల ముందు రోహిత్‌ను తప్పించి హార్దిక్ ప్యాండను సారథిగా చేయడంతో ముంబయి యాజమాన్యం ఎంతగా వ్యతిరేకత ఎదుర్కొందో తెలిసిందే. ఆ సీజన్ తర్వాత రోహిత్ ఫ్రాంఛైజీని వీడుతాడని కూడా వార్తలు వచ్చాయి. కానీ హిట్‌మ్యాన్ ఆ జట్టుతోనే కొనసాగుతున్నాడు. కెప్టెన్సీ గురించి పట్టించుకోకుండా ఆటగాడిగా సర్దుకుపోతున్నాడు. ఇక హార్దిక్ వరుసగా మూడేళ్లూ సారథిగా పేలవ ప్రదర్శన చేశాడు. నిరుడు ముంబయి ఆటతీరు మరీ తీసికట్టుగా తయారవడంతో అతడిని పక్కన పెట్టాలని యాజమాన్యం నిర్ణయించింది. హార్దిక్ వేరే ఫ్రాంఛైజీకి వెళ్తాడని, ఈ మేరకు వివిధ జట్లతో సంప్రదింపులు జరుగుతున్నాయని.. గత కొన్ని నెలలుగా జోరుగా ప్రచారం జరుగుతోంది. కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్‌కింగ్స్ లాంటి జట్లు అతడి కోసం గట్టిగా పోటీ పడుతున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ వచ్చే సీజన్‌కు హార్దిక్ జట్టు మారకపోతే ఆశ్చర్యం లేదన్నది ఐపీఎల్ వర్గాల్లో వినిపిస్తున్న కొత్త మాట. రేటుపై అంగీకారం కుదరకపోవడం, హార్దిక్ బదులుగా ముంబయికి నచ్చే ఆటగాడు దొరక్కపోవడం లాంటి ఇబ్బందులున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హార్దిక్ కేవలం ఆటగాడిగా ముంబయితో మరో సీజన్ కొనసాగే అవకాశాలను కొట్టిపారేయలేమని సమాచారం.

# వుదయం సినిమా

MOVIE TIME!

# ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'రంభ ఊర్వశి మేనక'


హీరో అల్లరి నరేష్

**వుదయం సినిమా:** అల్లరి నరేష్ ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్ 'రంభ ఊర్వశి మేనక' తో అలరించబోతున్నారు. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్నారు. టీజర్, ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో అల్లరి నరేష్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**'రంభ ఊర్వశి మేనక' కథ ఎలా ఉండబోతుంది?**

–సాధారణంగా ఇలాంటి సోషియో ఫాంటసీ కథల్లో మానవులు ఇంద్రలోకం, యముడి వద్దకు వెళ్తుంటారు. కానీ ఇందులో 'రంభ ఊర్వశి మేనక' స్వర్గం నుంచి కిందకు వస్తారు. ఇందులో కథానాయకుడికి చిన్నప్పటి నుంచి ఒక డ్రామా కంపెనీ ఉంటుంది.'రంభ ఊర్వశి మేనక'ను దేవతల్లా పూజిస్తుంటాడు. తనది కష్టపడకుండా హీరో అయిపోవాలనే క్యారెక్టర్.

**దర్శకుడు ఈ కథ చెప్పిన తర్వాత మిమ్మల్ని ఎక్సైటింగ్ చేసిన ఎలిమెంట్స్ ఏమిటి?**

–చాలా రోజుల తర్వాత మంచి కామెడీ ఎంటర్‌టైనర్ విన్నట్టుగా అనిపించింది. ప్రేక్షకులు కూడా నా నుంచి 'కితకితలు', 'బెండు అప్పారావు' లాంటి కామెడీ సినిమాలు మిస్ అవుతున్నారు. అలాంటి కథ గురించి చూస్తున్నప్పుడు దర్శకుడు చంద్ర మోహన్ చెప్పిన ఈ కథ నాతో పాటు నాగార్జున గారికి, సుప్రియ గారికి, రాజేష్ గారికి, నిమ్మకాయల ప్రసాద్ గారికి అందరికీ నచ్చింది. సీజీ వర్క్ పరంగా ఎక్కువ బడ్జెట్ అవుతుందని తెలిసినా మంచి సినిమా అవుతుందని మొదలుపెట్టాం. చంద్ర మోహన్ చాలా మంచి రైటర్ కూడా. ఈ కథని ఆయన చక్కగా రాసుకొని వచ్చారు. అలాగే నందు మంచి డైలాగ్స్ ఇచ్చారు.

**ఇందులో మీ క్యారెక్టర్ ఎలా ఉంటుంది?**

–నాది చాలా ఎంటర్టైనింగ్ ఉండే క్యారెక్టర్. అందరి దగ్గర అప్పులు చేసి ఉంటాడు. తనని ఎవరు ఊర్లో నమ్మరు. అందరూ కొంచెం నెగిటివ్‌గా అనుకునే క్యారెక్టర్. తనకి చాలా కష్టాలు వస్తుంటాయి. వాటిని ఎలా ఎదుర్కొన్నాడు అనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

**ఇందులో కామెడీ ఎలా ఉండబోతోంది?** –ఆడియన్స్ కామెడీని చూసే విధానం మారింది. నా బడీ లాంగ్వేజ్ సరిపడే కామెడీని డైరెక్టర్ డిజైన్ చేశారు. అలాగే స్వర్గం, నరకం, ఇంద్రలోకం ఇలాంటి కథలు చూసి చాలా కాలం అయింది. కచ్చితంగా ఆడియన్స్, అలాగే చిన్నపిల్లలు చాలా ఎక్సైట్ అవుతారు. చాలా క్లీన్ కామెడీ ఇందులో ఉంటుంది. ఫ్యామిలీ అందరూ కలిసి చూసేలా ఈ సినిమా వుంటుంది. కామెడీ కూడా చాలా ఆర్గానిక్‌గా ఉంటుంది.

**వెన్నెల కిషోర్, శ్రీనివాస్ రెడ్డి క్యారెక్టర్స్ గురించి?** –శ్రీనివాస్ రెడ్డి గారు, పెద్ద నరేష్ గారు కలిసి నాతో ట్రావెల్ అవుతుంటారు. మా మధ్య కామెడీ చాలా హిలేరియస్‌గా ఉంటుంది. అలాగే కిషోర్ గారు, అజయ్ గారు, తారక్ పొన్నప్ప చాలా క్యారెక్టర్లు ఉన్నాయి. అన్నీ కూడా చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంటాయి. ఇది మా నాన్నగారి స్టైల్‌లో చేసిన సినిమా.


# 'ఓజీ యూనివర్స్'.. చాలా పెద్ద ప్లానింగే..



**వుదయం సినిమా:** పవన్ కల్యాణ్ బర్త్‌డే సందర్భంగా ఆయన అభిమానులకు 'ఓజీ' డైరెక్టర్ సుజీత్ సైన్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. 'ఓజీ యూనివర్స్' పేరిట ఓ స్పెషల్ వీడియో విడుదల చేశారు. అందులో 'ఓజీ'కి సీక్వెల్‌గా తెరకెక్కించే చిత్రం గురించి పవన్ కల్యాణ్‌తో సుజీత్, సంగీత దర్శకుడు తమన్ చేస్తున్న చర్చలు ఆస్తకి రేపుతున్నాయి. 'యాన్ ఇండియన్ ఆరిజిన్.. సౌత్ ఈస్ట్ ఎమోషన్.. వెస్ట్రన్ ప్రెజెంటేషన్..' అనే మాటలు, అందులో సమురాయ్‌గా పవన్ పాత్ర బాడీ లాంగ్వేజ్, ఆయుధాలు చూస్తే, 'ఓజీ' సీక్వెల్ ఏ స్థాయిలో ఉంటుందో అర్థమవుతోంది. ఇవన్నీ చూస్తుంటే సుజీత్ పెద్ద ప్లానింగే చేస్తున్నారని అభిమానులు చర్చించుకుంటున్నారు.

# "రోమాంచకం" ఒక ఫ్రెష్ లవ్ స్టోరీ

**వుదయం సినిమా:** బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా "రోమాంచకం".



సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్ర విశేషాలను ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో తెలిపారు హీరో సుమంత్ ప్రభాస్.– మా మూవీ కోసం ప్రభాస్ గారిని కలవడం చాలా హ్యాపీగా అనిపించింది. నా గతం, నా జర్నీ అంతా ఒక్కసారిగా గుర్తుకువచ్చింది. ఆయనను కలిసే ముందు ఒక ఎక్స్‌పెక్టేషన్ తో వెళ్లాం. తెలంగాణ నేపథ్యంతో మేమ్ ఫేమస్ అనే సినిమా చేశాను. ఇక్కడి ఆడియెన్స్ బాగా చూశారు. ఆంధ్ర నేపథ్యంతో గోదారి గట్టుపైన సినిమా చేశాను. ఆ సినిమాను ఏపీ వాళ్లు ఆదరించారు. ఇంజినీరింగ్ కంప్లీట్ చేసి ఒక స్టార్టప్ కంపెనీ పెట్టాలని ప్రయత్నించే యువకుడిగా ఈ చిత్రంలో కనిపిస్తాడు. రోమాంచకం సినిమా ఆరేళ్ల నుంచి అరవై ఏళ్ల వరకు ఎవరైనా చూసి ఒకేలా ఎంజాయ్ చేస్తారు. ఫ్యామిలీస్ తో ఫ్రెండ్స్ తో ఎవరితో అయినా ఈ మూవీని చూడొచ్చు. సందీప్ అన్న ఒక అవార్డ్ ఫంక్షన్ లో కలిసి ఒక క్యూట్ స్టోరీ ఉంది నువ్వు విను అన్నారు. ఆయన చెప్పాడంటే తప్పకుండా బాగుంటుందని కథ విన్నాను. – వేణు అన్న చెప్పిన నెరేషన్ రెండున్నర గంటలు ఎంజాయ్ చేశాను.సందీప్ అన్న, ప్రణయ్ అన్న బయటకు అలా కనిపిస్తారు కానీ వాళ్లు చాలా స్వీట్ పర్సన్స్. వాళ్లతో ట్రావెల్ అయిన వాళ్లకు తెలుస్తుంది.– విజయ్ దేవరకొండ అన్న మా మూవీ ప్రీ రిలీజ్ కు రావడం చాలా హ్యాపీగా అనిపించింది. ఆయన నా గురించి బాగా మాట్లాడటం కూడా సంతోషాన్నిచ్చింది. విజయ్ అన్నను చూసి నేను చాలా ఇన్స్ పైర్ అవుతుంటాను. రోమాంచకం సినిమా ఫస్ట్ కాపీ చూసి సందీప్ అన్న బాగా పర్ ఫార్మ్ చేశావంటూ కాంప్లిమెంట్ ఇచ్చారు. రోమాంచకం టైటిల్ కొత్తగా ఉంది ఆడియెన్స్ కు కనెక్ట్ అవుతుందా అనిపించింది. కానీ ఇప్పుడు అదొక ఊతపదంలా మారిపోతోంది. సినిమా రిలీజ్ అయ్యాక చాలా మందికి ఈ పదం వాడుకలోకి వస్తుందని నమ్ముతున్నా.– అనంతిక టాలెంటెడ్ యాక్ట్రెస్. ఆమెకు చాలా ఆర్ట్ ఫామ్స్ తెలుసు. ఏ విద్యనైనా తక్కువ టైమ్ లో నేర్చుకుంటుంది. ఆమెతో ఈ మూవీలో వర్క్ చేయడం మంచి ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. తనకు కూడా ఈ సినిమా మంచి గుర్తింపు తీసుకొస్తుంది. మా సినిమా ఆద్యంతం రోమాంచకం ఫీల్ ను ప్రేక్షకులకు కలిగిస్తుంటుంది. సినిమాలో ఫ్రెష్ నెస్ చూస్తారు. ప్రతి సీన్ మీకు నవ్వు తెప్పిస్తుంది. నాకు సినిమా చూసినంత సేపు మజా వచ్చింది. మా మూవీలో వాసుకి వైభవ్ మ్యూజిక్ ఇరగదీశాడు. రాధారమణ నా ఫేవరేట్ సాంగ్. ఇంకో లవ్ సాంగ్ ప్రభాస్ గారు రిలీజ్ చేశారు. – హీరోగా అన్నిరకాల చిత్రాల్లో నటించాలని ఉంది. ఇప్పుడు లవ్ స్టోరీస్ వస్తున్నాయి. హీరోగా పేరొచ్చాక యాక్షన్, కమర్షియల్ ఆఫర్స్ వస్తాయేమో చూడాలి.

# 'మా రాముడు అందరివాడు' విజయం సాధిస్తుందని నమ్ముతున్నా..

**వుదయం సినిమా:** అనుముల ప్రొడక్షన్స్, శ్రీరామ్ క్రియేషన్స్ బ్యానర్లపై అనుముల లక్ష్మణరావు, పల్లకొండ శ్రీరాములు నిర్మిస్తున్న చిత్రం 'మా రాముడు అందరివాడు'. యద్దనపూడి మైకిల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీరామ్, స్వాతి మందాడి జంటగా నటించారు. సుమన్, సమ్మెట గాంధీ, నాగ మహేష్, బాహుబలి ప్రభాకర్ కీలక పాత్రల్లో నటించారు. ఆనంద భారతి, గడ్డం నవీన్, చిట్టిబాబు, గోల్డ్ రెడ్డి ఇతర పాత్రలు పోషించారు. సెప్టెంబర్ 4న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరైన నిర్మాత వెంకట్ దుగ్గిరెడ్డి, దర్శకుడు శ్రీనివాస తేజ ఈ చిత్రం ఘన విజయం సాధించి మూవీ టీమ్‌కు మంచి పేరు తెచ్చిపెట్టాలని కోరుతూ టీమ్‌కు బెస్ట్ విషెస్ అందించారు. ఈ సందర్భంగా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు సుమన్ మాట్లాడుతూ ..''సినీ ఇండస్ట్రీలో గ్లామర్ కంటే టాలెంట్ ముఖ్యమని ఇప్పటికే చాలామంది నిరూపించారు. ఈ సినిమా హీరో శ్రీరామ్‌లో కూడా మంచి టాలెంట్ ఉంది. డ్యూయెల్ రోల్‌లో ఆయన పెర్ఫార్మెన్స్ బాగా చేశారు. ఇందులో నా పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ముఖ్యమంత్రిగా మంచి మెసేజ్ ఇచ్చే పాత్రలో కనిపిస్తాను. దర్శకుడు మైకిల్ చాలా క్లారిటీ ఉన్న డైరెక్టర్. నిర్మాత లక్ష్మణ్ గారు ఇందులో విలన్‌గా కూడా నటించారు. ఆయన యాక్టింగ్ చాలా బాగా చేశారు. ఇది చాలా మంచి కథ.




# 'ఐయామ్ గేమ్' ప్రీరిలీజ్

**వుదయం సినిమా:** మెగా బ్లాక్‌బస్టర్ 'లోకా చాప్టర్ 1: చంద్ర' తర్వాత వే ఫేరర్ ఫిల్మ్స్ నుంచి వస్తున్న ఈ చిత్రాన్ని సూపర్‌హిట్ 'RDX' ఫేం నహాస్ హిదాయత్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ప్రముఖ నిర్మాణ, డిస్ట్రిబ్యూషన్



సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సెప్టెంబర్ 3న గ్రాండ్ గా విడుదల చేయనుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ వేడుకకు విజనరీ డైరెక్టర్ నాగ్ అశ్విన్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ప్రీ–రిలీజ్ ఈవెంట్‌లో హీరో దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇది నా ప్రొడక్షన్‌లో చేసిన బిగ్గెస్ట్ ఫిల్మ్. నేను నెట్‌ఫ్లిక్స్, అమెజాన్‌తో మాట్లాడుతున్నప్పుడు.. ఇది తెలుగులో తీసిన ఒక పెద్ద సినిమాలాగే ఉంది అని చెప్పారు. ఇందులో ఉన్న ఒక ఎలిమెంట్ మీ అందరినీ సర్‌ప్రైజ్ చేస్తుంది. తెలుగు ప్రేక్షకులు హీరోలను ఆదరించడంలో చూపించే ప్రేమను మాటల్లో చెప్పలేం. చిరంజీవి గారు, మహేష్ బాబు గారు, ప్రభాస్ గారు, అల్లు అర్జున్ గారు.. ఇలా ఎవరి పేరు చెప్పినా ప్రేక్షకులు కేరింతలు కొడతారు. అది తెలుగు ప్రేక్షకులు సినిమాను ప్రేమించే విధానం. మీ అందరి మనసులో నాకు కూడా చోటు కల్పించినందుకు ధన్యవాదాలు. ఈ సినిమాతో కూడా అలరిస్తానని నమ్ముతున్నాను. ఈ సినిమాకు స్వయంగా డబ్బింగ్ చెప్పాను. నాగి ఈ సినిమా చూశారు. ఆయన ఎడిటింగ్‌లో హెల్ప్ కూడా చేశారు. సెప్టెంబర్ 3వ తేదీన ఈ సినిమాను మీరు కచ్చితంగా థియేటర్‌లో చూడండి. మీరు చాలా ఎంటర్టైన్ అవుతారు. మీ అందరి ప్రేమకు ధన్యవాదాలు. తెలుగులో ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో 'మహానటి' నా ఫేవరెట్. అది నాకు పాత్ బ్రేకింగ్ సినిమా. నా తెలుగు కెరీర్‌కు క్రెడిట్ మొత్తం నాగి, స్వప్న, ప్రియాంకకే ఇస్తాను. ఈరోజు నా సినిమాను ప్రమోట్ చేస్తున్నానంటే దానికి కారణం నాగి, స్వప్న, ప్రియాంక. వైజయంతి సినిమా అంటే నాకు ఫ్యామిలీ. నాగి ఎప్పుడు కాల్ చేసినా తన సినిమాలో చేయడానికి నేను సిద్ధంగా ఉంటాను.

# 'డియర్ హార్ట్' మోషన్ పోస్టర్ విడుదల



**వుదయం సినిమా:** వారాహి ఆర్ట్స్ బ్యానర్ మీద బొబ్బాస్ సమర్పణలో రావి సౌజన్య నిర్మాణంలో లక్ష్మణ్ టేకుమూడి , రాధికా జోషి , సుప్రియా చవాన్ ప్రధాన పాత్రలుగా జీడీ నరసింహా తెరకెక్కిస్తున్న చిత్రం 'డియర్ హార్ట్'. ఈ సినిమాలో సురేష్గురు , పృధ్వీ రాజ్, సత్య ప్రకాష్ , జబర్దస్త్ నూకరాజు , జగదీశ్వరి తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. తాజాగా ఈ సినిమాకి సంబంధించిన మోస్టర్ పోస్టర్‌ను సాయి రాజేష్ రిలీజ్ చేశారు.'కొన్ని ప్రేమ కథలు కొన్ని రోజులు మాత్రమే గుర్తుంటాయి.. కానీ కొన్ని కథలు కాలం ఉన్నంత వరకు గుర్తుంటాయి.. నువ్వునాకు ఎదురైన ప్రతీసారి కాలం కూడా ఒక్క క్షణం ఆగిపోయి చూసేది.. నా చివరి శ్వాస వరకు.. నా గుండె కొట్టుకున్న ప్రతీసారి ఆ చప్పుడు చెప్పే ఒకే ఒక్క పేరు.. నీదే.. బతికుంటే నీ ప్రేమతో.. ఊపిరి ఆగితే నీ జ్ఞాపకాలతో.. ప్రతీ ప్రేమ కథ ముగింపు వరకు వెళ్లలేకపోవచ్చు.. కానీ నిజమైన ఏ ప్రేమ అయినా చరిత్రలో అలా గుర్తుండిపోవాల్సిందే.. మన ప్రేమలా' అంటూ సాగిన ఈ మూవీ మోషన్ పోస్టర్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది.

# "రోమాంచకం" సినిమాను హ్యాపీగా చేశాం..



**వుదయం సినిమా:** బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా "రోమాంచకం". సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్ర విశేషాలను జరిగిన ఇంటర్వ్యూలో తెలిపారు. హీరోయిన్ అనంతిక సనిల్ కుమార్. 8 వసంతాలు సినిమా తర్వాత చాలా స్క్రిప్ట్స్ నా దగ్గరకు వచ్చాయి. ఎన్నో కథలు విన్నాను. అవి నన్ను ఎగ్జైట్ చేయలేదు. ఆ టైమ్‌లో రోమాంచకం స్క్రిప్ట్ నా దగ్గరకు వచ్చింది. ఈ కథ విన్నాక చాలా హ్యాపీగా అనిపించింది.నేను ఈ చిత్రంలో తమిళ అమ్మాయిగా కనిపిస్తా. ఈ తరంలో యువత జీవితాల్లో ఎలాంటివి జరుగుతున్నాయో అలాంటి కాంటెంపరరీ ఎలిమెంట్స్ మా సినిమాలో ఆకట్టుకునేలా తెరకెక్కించారు. నా గత సినిమా 8 వసంతాలతో పోల్చితే రోమాంచకం డిఫరెంట్ జానర్ మూవీ. 8 వసంతాలు లాంటి ఇంటెన్స్ ఎమోషన్స్ ఉన్న సినిమా చేయాలని కోరుకున్నాను. అలాగే ప్రేమ కథల్లో కూడా నటించాలనిఉండేది. ఈసినిమా మీకు ఎంతసరదాగా ఉంటుందో మా షూటింగ్ అలాగే ఫన్ తో సరదాగా సాగింది. పర్టిక్యులర్ గా ఈ సినిమాలో కొన్ని సీన్స్ నేను బాగా ఎంజాయ్ చేస్తూ చేశాను. కొన్నిసార్లు నటిస్తున్నప్పుడే మనకు ఒక హ్యాపీనెస్ కలుగుతుంది. ఆ జాయ్ ను ఫీల్ అవుతాం. తమిళంతో పాటు మలయాళం, తెలుగులో నటిస్తున్నాను.

# 'డాయ్‌రా ట్రైలర్ లాంచ్

**వుదయం సినిమా:** 'డాయ్‌రా' మూవీ ట్రైలర్ విడుదలైంది. నిజం ఎప్పుడూ ఒకేలా ఉండదని, న్యాయం ఎవరి కోణంలో వారు ఎలా అర్థం చేసుకుంటారనేదానిపై ఆధారపడి ఉంటుందని, ప్రతి నిర్ణయం వెనుక ఓ ఘటన ఉంటుందనే అంశాలను ఈమూవీ ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. సెప్టెంబర్ 18, 2026న థియేటర్లలో విడుదల కానున్న ఈ చిత్రానికి మేఘనా గుల్జార్ దర్శకత్వం వహించారు. క్రైమ్, న్యాయం, శిక్ష వంటి అంశాలను భావోద్వేగభరితంగా, ఉత్కంఠభరితంగా, విభిన్న కోణాలతో చెప్పే ప్రయత్నంచేశారు. ఈ కథను యష్ కేస్వానీ, సీమా అగర్వాల్, మేఘనా గుల్జార్ కలిసి అందించారు.నిజ జీవిత ఘటనల ఆధారంగా తెరకెక్కిన 'డాయ్‌రా' కథ.. దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం, ఆగ్రహానికి కారణమైన ఓ నేరం తర్వాత చోటుచేసుకునే పరిణామాల చుట్టూ సాగుతుంది. ఆ నేరానికి సంబంధించిన నిజాలను వెలికితీసే క్రమంలో రెండు వేర్వేరు దర్యాప్తులు ప్రారంభమవుతాయి.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.